నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మోంకడాపై దాడికి 72 ఏళ్లు : క్యూబన్ విప్లవంలో మలుపు
బంతి బిజెపి కోర్టులోకి..
ఇరాన్ ప్రజల కన్నీటి వీడ్కోలు
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 209 | ఆదివారం | 29-06-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించేందుకే
# భారత్ ఫ్యూచర్ సిటీ



- వందేళ్ల అభివృద్ధికి డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదల
- ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి
- రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యసాధన కోసం ప్రభుత్వం యజ్ఞంలా పనిచేస్తోంది
- ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా వెనుకాడేది లేదు
- 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది
- కంచ గచ్చిబౌలి భూముల విషయంలో బిఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేసింది
- కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఐదు లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయి
- పిజెఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



> చిన్న చిన్న నగరాలు అద్భుతంగా మెట్రోను విస్తరించుకుంటున్నాయి. మా నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, మేం ఏ పాపం చేశాం? రెండో స్థానంలో ఉన్న మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు. రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తాం. నేను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లాను. ప్రధాని సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశాను. కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం ఇచ్చారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించుకోవాలి.
> – సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. ఫ్యూచర్ సిటీని గొప్పగా నిర్మిస్తామని, నెట్ జీరో సిటీని నిర్మించాలనేదే మా ప్రయత్నమని అన్నారు. వందేళ్ల అభివృద్ధి కోసం డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని ప్రకటించారు. తనకు హైదరాబాద్ నగర అభివృద్ధిపై సంపూర్ణ అవగాహన ఉందని, నగరంతో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉందని చెప్పారు. 65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందని, హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్నారు. ముంబై, చెన్నై, ఢిల్లీ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలన్నారు. కాలుష్యమే ఇపుడు యమపాశం అయ్యిందన్నారు. రాబోయే తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరం న్యూయార్క్, టోక్యో వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. 'రైజింగ్ తెలంగాణ2047' లక్ష్య సాధన కోసం తమ ప్రభుత్వం ఒక యజ్ఞంలా పనిచేస్తోందన్నారు. దీనికి ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2029లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి వంటి పెద్ద నియోజకవర్గాలు నాలుగుగా విడిపోయే అవకాశం ఉందని, దీనివల్ల అందరికీ అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తుందన్నారు. రూ.182.72 కోట్ల వ్యయంతో ఓఆర్ ఆర్ నుంచి కొండాపూర్ వరకు కొండాపూర్ –గచ్చిబౌలి మార్గంలో ఆరు లేన్‌లతో 1.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ను జిహెచ్‌ఎంసి నిర్మించింది. ఈ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తరువాయి 2లో

## రాష్ట్రానికొక రాజ్యాంగాన్ని
# అంబేద్కర్ సమర్థించలే

- దేశానికంతటికీ ఒకే రాజ్యాంగం అవసరమన్నారు
- ఆర్టికల్ 370 రద్దు సమర్థనీయమే
- భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ స్పష్టీకరణ
- ఢిల్లీలో రాజ్యాంగ ప్రవేశిక పార్క్, అంబేద్కర్ విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవంలో ప్రసంగం



**న్యూఢిల్లీ :** దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఒకే రాజ్యాంగాన్ని ఊహించారు కానీ, ఒక రాష్ట్రం కోసం ఒక ప్రత్యేక రాజ్యాంగం అనే ఆలోచనను ఆయన ఎప్పుడూ సమర్థించలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ స్పష్టం చేశారు. బిఆర్.గవాయ్ శనివారం ఇక్కడ రాజ్యాంగ ప్రియాంబుల్ (ప్రవేశిక) పార్క్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే కేంద్రం నిర్ణయాన్ని తరువాయి 2లో



# గుండు గీయించి వివస్త్రను చేసి..

- మహిళపై విచక్షణా రహితంగా దాడి
- వివాహేతర సంబంధంపై ఆగ్రహించిన గ్రామస్థులు
- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయలలో అమానవీయ ఘటన

ప్రజాపక్షం/ధర్మసాగర్

సభ్యసమాజం తలదించుకునే ఘటన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో చోటుచేసుకుంది. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని దశాబ్దం క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ వ్యక్తి తన సమీప బంధువైన మరో వివాహితతో వివాహేతర సంబంధం తరువాయి 2లో

## 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల
# భర్తీకి నోటిఫికేషన్

జులై 10 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి జూలై 10 నుంచి 17 తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనునున్నారు.. ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఒక్కో ఒక్కో పోస్టుకు వెర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో తరువాయి 2లో

## 'మహా'న్యూస్ కార్యాలయంపై
# బిఆర్‌ఎస్ శ్రేణులు దాడి

> మహాటీవీ ఆఫీసుపై దాడి హేయమైన చర్య. తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు సమర్థనీయం కాదు : సిఎం రేవంత్‌రెడ్డి





- కంప్యూటర్లు, ఫర్నీచర్లు, కెమెరాలు ధ్వంసం
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌పై అనుచిత కథనాలు ప్రసారం చేశారంటూ ఆగ్రహం
- కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు
- ఛానల్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సిఎం, మంత్రులు, నారాయణ, పలువురు నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలుగు న్యూస్ ఛానల్ 'మహా న్యూస్' ప్రధాన కార్యాలయంపై బిఆర్‌ఎస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. ఆఫీస్ డోర్లు, స్టూడియోతో పాటు కార్యాలయం బయట నిలిపి ఉంచిన కార్లపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుపై అనుచిత కథనాలు ప్రసారం చేశారని ఆరోపిస్తూ గురువారం మధ్యాహ్నం బిఆర్‌ఎస్‌పి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లో ఉన్న మహా న్యూస్ ప్రధాన తెలుగు న్యూస్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ శ్రేణులు ఒక్కసారిగా న్యూస్ చానల్ కార్యాలయంపై భౌతిక దాడికి పాల్పడ్డారు. కార్యాలయం ఆవరణలో ఉన్న కార్లను బండరాళ్లతో ధ్వంసం చేశారు. అక్కడితో ఆగకుండా సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడి కార్యాలయంలోకి చొరబడ్డారు. కార్యాలయంలోపల కంప్యూటర్లు, ఫర్నీచర్‌లను, కెమెరాలను, కిటికి అద్దాలను పగులగొట్టారు. సుమారు అరగంట పాటు బిఆర్‌ఎస్ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. మహాన్యూస్ టివి సెక్యూరిటీగార్డులు, సిబ్బంది, కొంత మంది జర్నలిస్టులు బిఆర్‌ఎస్ కార్యకర్తలను నివారించేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం తరువాయి 2లో

### దాడి హేయం : సిపిఐ

మహాటివిపై బిఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడడం హేయకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర మీడియాదే అన్నారు. బిఆర్‌ఎస్ ఉద్యమానికి ఊపిరి అద్దింది వార్త సంస్థలేనని ఆలాంటి వాటిపై దాడికి పాల్పడడం నీచపు ఆలోచన బిఆర్‌ఎస్‌కు రావడం శోచనీయమన్నారు. బిఆర్‌ఎస్ న్యాయకత్తం తక్షణమే స్పందించి దాడికి పాల్పడితే ఆ పార్టీ కార్యకర్తలతే తక్షణమే మహాటివికి క్షమాణలు చెప్పాలి, ఆ పార్టీ వారు కాకపోతే దానిని స్పష్టం చేయాల్సిన అవసరముందన్నారు. మౌనంగా ఉండడమంటే బిఆర్‌ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా వారి ఉద్యమానికి ఊపిరి పోసిన మీడియా సంస్థల గొంతు నొక్కిన వారు అవుతారని తరువాయి 2లో

# సమసమాజానికి పునాదులు వేసిన పివి

మాజీ ప్రధానిని కొనియాడిన ప్రముఖులు
104వ జయంతి సందర్భంగా ఘననివాళులు



ప్రజాపక్షం/హైదరాబాద్

బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాన మంత్రి దివంగత భారత రత్న పి.వి.నరసింహారావుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానిగా దేశ ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో పివి నరసింహారావు చిత్ర పటానికీ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘంటించారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 104వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పివి ఘాట్ వద్ద శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి కె.జానా రెడ్డి, ఎంపి మల్లు రవి, బిజెపి ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు,మాజీ ఎంపిలు, మాజీ మంత్రులు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి,పివి కుటుంబ సభ్యులు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, తదితరులు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పి వి సప్తాహం పోస్టర్‌ను మంత్రులతో కలిసి డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు.


**సంఘసంస్కర్త పి.వి : ఉపముఖ్యమంత్రి**

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమ సమాజానికి పునాదులు వేసిన సంఘ సంస్కర్త పివి నరసింహారావు తరువాయి 12లో

## అధికారుల అలసత్వం...
# కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం



- ఆధునీకరణ పేరుతో అస్తవ్యస్తంగా మారిన పెద్దపల్లి రైల్వే స్టేషన్
- నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- అధికారులు ప్రజాప్రతినిధులు పలుమార్లు సందర్శించినా అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం
- పాత బిల్డింగ్ పడగొట్టడానికే సంవత్సరం పట్టింది.. మరి కొత్త బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి

అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణలో భాగంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించి సంవత్సరకాలం దాటుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అమృత్ భారత్ స్కీం కాస్త కాంట్రాక్టర్ల స్కామ్ అయింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు అటకెక్కాయి. అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ల అలసత్వమో ఆధునీకరణ పనుల పేరుతో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అస్తవ్యస్తంగా మారింది. నిలువ నీడ లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి రైల్వే జంక్షన్ లో నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు తరువాయి 12లో


## బంగ్లాదేశ్ జనపనార
# దిగుమతులపై ఆంక్షలు

అక్రమ వాణిజ్యానికి పాల్పడడంతో భారత్ చర్యలు

జనపనార అనుబంధ ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపైనా ఆంక్షలు కొనసాగింపు



**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌కు చెందిన సరఫరాదారులు న్యాయబద్ధంకాని అక్రమ వాణిజ్య చర్యలకు పాల్పడుతూ ఉండటంతో జనపనార దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించింది. జనపనా అనుబంధ ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపై కూడా కేంద్రం ఆంక్షలు అమలు చేసింది. భారత రైతాంగానికి హానిచేసే యాంటీ–డంపింగ్ సుంకాలు చెల్లించకుండా ఎగవేసేందుకు అన్యాయమైన పద్ధతులలో ఎగుమతిదారులు వ్యవహరిస్తున్నందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆ ఆంక్షలు పెట్టిందని ఈ వ్యాపారంతో సన్నిహిత సంబంధాలున్న వర్గాలు శనివారంనాడు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఫ్రాన్స్‌లో నేటి నుండీ ధూమపాన నిషేధం



పారిస్ : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని ఫ్రాన్స్ నిషేధించింది. ఆదివారం నుండీ ఈ నిషేధం అమలులోకి వస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం శనివారంనాడు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యానవనాలు, సముద్రతీర ప్రాంత పర్యాటక ప్రదేశాలు, బస్ స్టాప్‌లలో ధూమపాన నిషేధం అమలు చేస్తారు. అదే విధంగా చిన్న పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకుగాను పాఠశాలల వెలుపలా, ఈతకొలనుల వెలుపలా, గ్రంథాలయాల వెలుపలా కూడా ధూమపాన నిషేధం విధించారు. ఐతే ఎలక్ట్రానిక్ సిగరెట్‌లపై నిషేధం ఉందా?లేదా? అనే విషయాన్ని ఈ ఉత్తర్వులలో స్పష్టంగా చెప్పలేదు. ''పిల్లలు తిరిగే ప్రదేశాలనుండి పొగాకును పూర్తిగా నిర్మూలించాలి'' అని ఫ్రాన్స్ కుటుంబ, ఆరోగ్యశాఖా మంత్రి కేథరీన్ వౌత్రిన్ చెప్పారు. ఐతే కేఫ్‌లలో టెర్రాస్ ప్రాంతాలను మాత్రం ఈ ఉత్తర్వులనుండి మినహాయించారు. ఫ్రాన్స్‌లో ప్రతి పదిమందిలోనూ ఆరుగురు పౌరులు (62 శాతం మంది) ధూమపానంపై నిషేధం విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారని ఇటీవల ఒక అధ్యయనం వెల్లడించింది.

# ఇరాన్ ప్రజల కన్నీటి వీడ్కోలు

### ఇరాన్ సైనిక జనరల్స్,సైంటిస్టులు సహా 60 మందికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



టెహ్రాన్ : ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన 12 రోజుల యుద్ధంలో మరణించిన ఐఆర్‌జిసి (ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్) ఉన్నతస్థాయి సైనిక జనరల్స్,అణుశాస్త్రవేత్తలు సహా మొత్తం 60 మందికి శనివారంనాడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. వీరిలో నలుగురు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నారు. కాల్పుల విరమణ తర్వాత ప్రశాంత వాతావరణం మధ్య ఈ ఖనన కార్యక్రమాలు నిర్వహించారు. రాజధాని టెహ్రాన్‌లో భారీస్థాయిలో అంతిమయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇరాన్‌లో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాలకు మరణశిక్ష విధించాలని నినాదాలు చేశారు. నల్లదుస్తులు ధరించి ప్రజలు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు.
ఇజ్రాయెల్ గగనతల దాడుల్లో మరణించిన ఐఆర్‌జిసి సైనిక దళాల ప్రధానాధిపతి జనరల్ అమిర్ అలీ హాజిటాదేహ్, ఇతర నాయకుల భౌతిక దేహాలను ట్రక్కులపై ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్ళి ప్రభుత్వ లాంఛనాలతో ఖననం చేశారు. ఈ అంతిమయాత్ర ప్రయాణమార్గంలో ఆజాదీ వీధుల్లో వేలాదిమంది ప్రజలు గుమిగూడి ''డెత్ ఆఫ్ అమెరికా...డెత్ ఆఫ్ ఇజ్రాయెల్....'' అంటూ నినాదాలు చేశారు. జూన్ 13వ తేదీన ఇజ్రాయెల్ చేసిన మొదటిరోజు దాడుల్లోనే ఐఆర్‌జిసి టాప్ కమాండర్స్ సలామి, హాజిజదేహ్‌లు మరణించారు. టెహ్రాన్ అణు కార్యక్రమ కేంద్రాలను ధ్వంసం చేసే లక్ష్యంగా దాడులు చేసినట్లు ఐ డి ఎఫ్ ప్రకటించింది. ఈ అంతిమయాత్ర గురించి ఇరాన్ సర్వాధినేత ఖమేనీ నుండి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. జూన్ 11 యుద్ధం ప్రారంభం కావడానికి రెండు రోజులముందుగా ఖమేనీ ప్రజలకు కనిపించారు. ఈ అంత్య క్రియల కార్యక్రమానికి విదేశీ మంత్రిత్వశాఖ, విదేశీమంత్రి అరాఘ్చి నాయకత్వం వహించారు. ఖమేనీ ఇప్పటికీ నేలమాళిగలో అజ్ఞాతంలో ఉన్నారని భావిస్తున్నారు. రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌కు చెందిన విదేశీశాఖాధిపతి జనరల్ ఎస్మాయిల్ ఖ్వానీ, ఖ్యుడ్స్ ఫోర్స్ జనరల్ అలీ షంఖానీలు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అలీ ఖమేనీకి షంఖానీ ప్రధాన సలహాదారుడు. మొదటిరోజు ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఆయన గాయపడ్డారు. 1979లో ఇరాన్‌లో ఇస్లాం మత విప్లవం వచ్చిన తర్వాత ఐఆర్‌జిసి ఆవిర్భవించింది. అప్పటినుండీ దేశీయ భద్రత, విదేశీ ప్రమాదాల నుండి దేశానికి భద్రత ఇవ్వడంలో ఐఆర్‌జిసి కీలకపాత్ర వహిస్తోంది. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన విధ్వంస ఆయుధాలు దీని అధీనంలోనే ఉంటాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్–హమాస్ మధ్య రెండుసార్లు జరిగి యుద్ధంలో ఈ ఆయుధాలను ఇరాన్ ఉపయోగించింది. మొత్తం 30 మంది ఇరానియన్ కమాండర్లను యుద్ధంలో హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. 720 సైనిక వ్యవస్థల లక్ష్యాలను ధ్వంసం చేశామని, 1000 మందికిపైగా ఇరానీయులు యుద్ధంలో మరణించారని, వీరిలో 450 మంది సామాన్య ప్రజలు కూడా ఉన్నారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల కార్యకర్తల గ్రూపు ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ యుద్ధంలో ఇరాన్ 550 క్షిపణులు ప్రయోగించగా, వీటిల్లో చాలావాటిని గాల్లోనే ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్‌లో యుద్ధంవల్ల 28 మంది మరణించారు.

**ఐఎఇఎ అధిపతి గ్రాస్సీ బహిష్కరణ**

ఐఎఇఎ (అంతర్జాతీయ అణుశక్తిసంస్థ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీకి ఇరాన్ బహిష్కారం విధించింది. ఇంకెప్పటికీ ఆయనను ఇరాన్ దేశంలోకి ప్రవేశించనీయకూడదని ఆ దేశ పార్లమెంటు అధికారి ప్రకటించారు. ది. అమెరికాకు అనుకూలంగా వారి అడుగులకు మడుగులొత్తేవిధంగా ఐఎఇఎ కూడా వాస్తవాలు మరచి ప్రకటనలు చేసిందని, ఏకపక్ష విధానాలను అవలంబించిందని ఇరాన్ తప్పుపట్టింది. అదేవిధంగా ఇరాన్‌లోని అణు కేంద్రాలలో ఇకమీదట నిఘా కెమేరాలను ఏర్పాటు చేయకూడదనీ, వాటిని అనుమతించబోమనీ ఇరాన్ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ హమీద్ రెజీ హాజీ బాబాయ్ ఒక ప్రకటన చేశారు. ఇరాన్ అన్ని అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని యుద్ధానికి రెండు రోజుల ముందుగా గ్రాస్సీ ఒక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ పాలనా వ్యవస్థల నుండి అతి సున్నితమైన సమాచారాన్ని సేకరించినందుకుగాను గ్రాస్సీకి ఇరాన్ ఈ బహిష్కరణ విధించింది.

### వాణిజ్య వివాదాల పరిష్కారానికి
# డబ్ల్యుటిఓకు ప్రత్యామ్నాయ సంస్థ!

యూరప్ దేశాల మల్లగుల్లాలు





బ్రస్సెల్స్: అమెరికాతో వాణిజ్య చర్చలకు గడువుతేదీ దగ్గరపడుతున్నప్పటికీ యూరోపియన్ యూనియన్ నాయకుల మధ్య ఇంకా విభేదాలు పరిష్కారం కాలేదు. సుంకాలకు సంబంధించి ఇ.యు నాయకుల భిన్నాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. దిగుమతులలో ఆటోమొబైల్స్‌పై సుంకాలు వివాదాస్పదాంశంగానే ఉంది. ఐతే వాణిజ్య వివాదాలను పరిష్కరించడానికి డబ్ల్యుటిఓకు ప్రత్యామ్నాయంగా మరొక ప్రపంచ వాణిజ్య సంస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచన యూరప్ ముందుకు వచ్చింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ గురువారం నాటి బ్రస్సెల్స్ ఇ.యు కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదన చేసినట్లు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చెప్పారు. జపాన్,బ్రిటన్ సహా ఇతర ఆసియా ఆర్థిక వ్యవస్థలను కూడా ఏకం చేసి ఒక సిపిటిపిపి (ట్రాన్స్–పసిఫిక్ భాగస్వామ్యదేశాలతో సమగ్ర వాణిజ్య,ప్రగతిశీల ఒప్పందం) సభ్యదేశాలమధ్య వాణిజ్య కూటమి ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఒక కొత్త ఆలోచనను వోండర్‌లేయన్ అందరి ముందూ ఉంచారు. యూరప్‌లో వాణిజ్యం చేసేందుకు కొత్త ఆశలు పెంచుకుంటున్న చైనా కూడా బహుశా ఇలాంటి ఆలోచనలకు ఊతం ఇచ్చే అవకాశం ఉంది. 2016లో చేసిన సిపిటిపిపిని కొన్ని కారణాలవల్ల అమెరికా ఆమోదించలేదు.
పెంచిన సుంకాల అమలుకు ట్రంప్ ఇచ్చిన గడువు పది రోజులే ఉండటంతో యూరప్ వాణిజ్యానికి ఎలాంటి విఘాతం కలగకుండా తక్షణ ఒప్పందం చేసుకోవాలా? లేక మరింత భద్రతతో కూడిన ఒప్పందం చేసుకోవడానికి మరోమార్గాన్ని అవలంబించాలా? అని నాయకులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే అనేకసార్లు అమెరికా–యూరోపియన్ యూనియన్ మధ్య చర్చలు జరిగాయి. యూరప్ నుండి అమెరికాకు దిగుమతయ్యే షాంపైన్‌సహా అనేక వస్తువులపై ట్రంప్ భారీస్థాయిలో సుంకాలు వేశారు. ఐతే జూలై 9వ తేదీతో ట్రంప్ ఇచ్చిన గడువు ముగియనున్నది. ఇ.యు కౌన్సిల్ సమావేశంలో ఇ.యు నాయకులమధ్య అమెరికాతో వాణిజ్య చర్చలకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. యూరోపియన్ యూనియన్‌పై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన తర్వాత ఆ పెనుభారాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన చేశారు. ఈ విధంగా ట్రంప్ రెండుసార్లు టారిఫ్‌లను వాయిదా వేశారు. ట్రంప్ అనుసరిస్తున్న వైఖరివల్ల ట్రాన్స్–అట్లాంటిక్ మధ్య దూరం పెరిగి యూరప్ దేశాలలో అమెరికాపై విశ్వసనీయత తగ్గుముఖం పడుతున్నది. విపరీతంగా సుంకాలు పెంచడం, మళ్ళీ వాయిదా వేయడం, మారు ప్రకటనలు చేయడం గందరగోళంగా మారింది.

## మీకు ఒప్పందం కావాలా? అయితే.. ఖమేనీని గౌరవంగా సంబోధించండి

అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



టెహ్రాన్ : అమెరికాతో అణు ఒప్పంద చర్చలు జరపడానికి ఇరాన్ తాజా మెలిక పెట్టింది. ''మీకు అణు ఒప్పందం కావాలా? ఐతే మా నాయకుడు ఆయెతుల్లా సయ్యద్ అలీ ఖమేనీని గౌరవంగా సంబోధించండి, ఆయనకు మర్యాద ఇచ్చి మాట్లాడండి'' అని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాఘ్చి ఎక్స్ వేదికగా శనివారంనాడు ప్రకటించారు. ''అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సర్వోన్నత నాయకుడిపట్ల చాలా అమర్యాదకరంగా, అగౌరవంగా మాట్లాడుతున్నారు, ఆయనకు ఏ మాత్రం గౌరవం ఇవ్వకుండా మాట్లాడుతున్నారు, ఒప్పందం కావాలంటే సమాన గౌరవం ఉండాలి'' అని అరాఘ్చి తెగేసి చెప్పారు. ట్రంప్ స్వరంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక బలమైన ఒప్పందం కోరుకున్నప్పుడు గౌరవం ఉండాలి, రెండు దేశాలమధ్య పరస్పర గౌరవం, సమాన మర్యాదలుండాలన్నారు. వచ్చేవారం ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు ఉంటాయని ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. వెంటనే అరాఘ్చి కూడా ఒక ప్రకటన చేస్తూ ఇప్పట్లో అణు ఒప్పందంపై చర్చల ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. కానీ తాజాగా ఖమేనీని మర్యాదగా సం బోధిస్తే ఒప్పంద చర్చలకు అవకాశం ఉంటుందని కొత్త మెలిక పెట్టారు.యుద్ధ సమయంలో ఖమేనీ నేలమాళిగలో ఎక్కడ దాక్కున్నారో తనకు చాలా ఖచ్చితంగా తెలుసుననీ, ఇజ్రాయెలీ సైనిక దళాలు ఆయనను వెతికిపట్టుకుని అత్యంత అవమానకరమైన పద్ధతులలో, దారుణంగా చంపకుండా తానే అడ్డుకున్నానని ట్రంప్ శుక్రవారంనాడు చేసిన ప్రకటించారు. అదేవిధంగా ఇరాన్ గను కమితమీరినస్థాయిలో ఇంకా ఇంకా యురేనియం శుద్ధి కార్యక్రమాలను కొనసాగించినట్లయితే మరో మాట లేకుండా ఇరాన్‌పై బాంబులు కురిపిస్తామని కూడా ట్రంప్ చెప్పడంతో ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది.

## కెనడాతో వాణిజ్య చర్చలూ రద్దు చేసిన అమెరికా

వాషింగ్టన్ : కెనడాతో అన్నిరకాల వాణిజ్యచర్చలను అమెరికా రద్దు చేసింది. అమెరికా టెక్ కంపెనీలమీద డిజిటల్ టాక్స్ విధించినందుకుగాను ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉభయతారకంగా చర్చలకు వీలుగా ఈ పన్నును 30 రోజులు వాయిదా వేయాలని అమెరికా కోరినప్పటికీ, కెనడా తిరస్కరించింది. దీంతో వైట్‌హౌస్‌లో నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాస్సెట్ ఒక ప్రకటన చేస్తూ,ఈ విధంగా భారీ పన్నులు విధించిన తర్వాత అమెరికా కంపెనీలు ఇక కెనడాలో ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రత్యక్ష వాణిజ్య దాడికి తెరతీసేవిధంగా అమెరికా టెక్నాలజీ కంపెనీలపై డిజిటల్ పన్నును అమలు చేస్తున్నట్లు కెనడా ప్రకటించింది. అమెజాన్, గూగుల్, మెటా, ఊబెర్ తదితర కంపెనీలు ఈ డిజిటల్ టాక్స్ జాబితాలో ఉన్నాయి. అమెరికాపై దారుణమైన పన్నులు విధించినందువల్ల అన్ని వాణిజ్య చర్చలనూ తమ ప్రభుత్వం రద్దు చేసుకుందని ట్రంప్ చెప్పారు. యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న విధానాలను కెనడా కూడా కాపీ కొడుతోందని ఆయన విమర్శించారు. ఐతే ఈ పరిస్థితులు సంభవించడానికి ముందుగా కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, ట్రంప్ ఇద్దరూ జులై 16 నాటికి ఒక సురక్షితమైన ఒక కొత్త ఆర్థిక ఒప్పందం చేసుకోవాలని మాట ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంతలోనే ఈ పరిణామాలు సంభవించాయి.కార్నీ మే నెలలో వైట్‌హౌస్‌ను సందర్శించారు. గతవారం జి–7 సదస్సు నిమిత్తం కెనడాలోని ఆల్బెర్టాలో ట్రంప్ కూడా గతవారం పర్యటించారు. వాణిజ్య చర్చలు, ఇతర సంప్రదింపులకు 30 రోజులు గడువును ఆ ఇద్దరు నాయకులూ అంగీకరించారు కూడా.

## భారత్ ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

తీర్చడంలో దివంగత మాజీమంత్రి పి.జనర్ధన్ రెడ్డి (పిజెఆర్) కీలక పాత్ర పోషించారని అని కొనియాడారు. పిజెఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని తెలిపారు. పేదల నాయకుడిగా పిజెఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పిజెఆర్ అన్నారు. గతంలో పిజెఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్ల పాటు పిజెఆర్ శకం నడిచిందన్నారు. పిజెఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందన్నారు. హైటెక్ సిటీగా చెప్పుకునే ఈ ప్రాంతం అభివృద్ధి పథం వైపు నడుస్తూ ప్రపంచ దిగ్గజ కంపెనీలకు వేదికగా మారిన శేరిలింగంపల్లి, గచ్చిబౌలి ప్రాంతం గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఒక భాగమని, పిజెఆర్ కృషితోనే హైటెక్ సిటీ గచ్చిబౌలికి మంజూరైందన్నారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి పునాది వేస్తే చంద్రబాబు దాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారన్నారు. కాలక్రమంలో దీన్ని మహారాష్ట్రకు తరలించాలని కుట్రలు జరిగినా పిజెఆర్ అడ్డుపడ్డారని గుర్తు చేసుకున్నారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మాకు మెట్రో ఇవ్వరా?, ఏం పాపం చేశాం.. ఎందుకీ వివక్ష..**

తెలంగాణపై కేంద్రానికి ఎందుకీ ఈ వివక్ష అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. చెన్నై, బెంగళూరుకు మెట్రో ఇచ్చారని, తాము మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ అడిగితే కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. తమ నివేదకలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, ఏం పాపం చేశామో చెప్పాలని రేవంత్ రెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రజలు బిజెపికి 8 మంది ఎంపిలను ఇచ్చారన్నారు. కేంద్రం నుంచి బిజెపి నేతలు ఏం తెచ్చారో చెప్పగలరా అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. చిన్న చిన్న నగరాలు అద్భుతంగా మెట్రోను విస్తరించుకుంటున్నాయన్నారు. మా నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, మేం ఏ పాపం చేశామని, రెండో స్థానంలో ఉన్న మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయిందన్నారు. మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై అసహనం వ్యక్తం చేశారు. రేపు అమిత్ షా తెలంగాణకు వస్తున్నారని, మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. రాజకీయాలు వదిలేసి హైదరాబాద్ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లానని, ప్రధాని సహా అనేకమంది కేంద్ర మంత్రులను కలిశానని, కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదన్నారు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏం ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆలోచించుకోవాలన్నారు.



**హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు..**

భవిష్యత్ హైదరాబాద్ కోసం తమ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. ఢిల్లీలో కాలుష్యం, చెన్నైలో వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యల నుంచి పాఠాలు నేర్చుకొని హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని అన్నారు. ఇందులో భాగంగా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ బస్సుల స్థానంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించాలని ఆదేశించామని తెలిపారు. ఆటోలు కూడా సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వెర్షన్‌లోకి మారాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో అనేక నాలాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయని చెప్పారు. బతుకమ్మకుంటను కొందరు బిఆర్‌ఎస్ నేతలు కబ్జా చేస్తే తమ ప్రభుత్వం దానిని విడిపించిందన్నారు. కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా ద్వారా కూల్చివేసినట్లు స్పష్టం చేశారు. ఎన్ కన్వెన్షన్‌లో రెండెకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించి, సినినటుడు నాగార్జున నిజమైన హీరో అనిపించుకున్నారని ప్రశంసించారు. రంగారెడ్డి జిల్లాకు శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా చేశామని, రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.

**కంచె గచ్చిబౌలి భూముల విషయంలో తప్పుడు ప్రచారం..**

కంచె గచ్చిబౌలి భూముల విషయంలో తప్పుడు ప్రచారం చేశారని సిఎం రేవంత్ అన్నారు. కంచ గచ్చిబౌలిలో కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, పెట్టుబడులను అడ్డుకోవాలని బిఆర్‌ఎస్ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి కాలుష్యమే ఇపుడు యమపాశం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## భర్తీకి నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ మొత్తం 607 పోస్టుల భర్తీ చేయనుండగా మల్టీ జోన్–1లో 379 పోస్టులు .. మల్టీ జోన్ –2లో 228 పోస్టులు ఉన్నాయి. పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ జీతం యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నిబంధనల ప్రకారం రూ.68,900 నుంచి రూ.2,05,500 ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి http://mhsrb.telangana.gov.in వెబ్‌సైట్ లో జూలై 10వ తేదీ నుంచి 17 తేదీ సాయంత్రం 5 గంటల వరకు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

## బిఆర్‌ఎస్ శ్రేణులు దాడి

(మొదటి పేజీ తరువాయి)

అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులను చెదరగొట్టారు. పోలీసుల రాకను గమనించిన కొంతమంది ఆందోళన కారులు అక్కడి నుంచి పారిపోగా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి వివరాలు సేకరించారు.

**చంద్రబాబు ఖండన..**

మహాన్యూస్‌పై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. మీడియా సంస్థపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి తమ మద్దతు ప్రకటించారు.


**వ్యక్తిత్వాన్ని కించపరచవద్దు: కెటిఆర్**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.
కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'జర్నలిస్టుల ముసుగులో కొందరు దుర్మార్గులు గత కొన్ని నెలలుగా నా పైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు' అని ఆయన అన్నారు. ఇలాంటి వారి అభిప్రాయాలను, ఉనికిని తాను ఏమాత్రం ఖాతరు చేయనని ఆయన తేల్చి చెప్పారు.

**కాంగ్రెస్, బిజెపి నేతల ఖండన..**

హైదరాబాద్‌లోని మహాన్యూస్ కార్యాలయంపై దాడి ఘటన అనంతరం, శుక్రవారం పలువురు రాజకీయ ప్రముఖులు కార్యాలయాన్ని సందర్శించారు. వీరిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. వీరితో పాటు బిజెపి నాయకులు కూడా ఛానెల్‌కు మద్దతుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. అనంతరం, దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్, పగిలిపోయిన కిటికీల అద్దాలు, దెబ్బ తిన్న కార్లను ఆయన ఇతర నేతలతో కలిసి పరిశీలించారు. దాడి వల్ల జరిగిన నష్టం గురించి ఛానెల్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు, ఈ దాడి ఘటనపై పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రముఖ తెలుగు న్యూస్ ఛానెల్ 'మహా న్యూస్' కార్యాలయంపై జరిగిన దాడి ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఇది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గూండాల పనేనని, పత్రికా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నమేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఛానెల్‌ని సందర్శించిన టియుడబ్ల్యుజె



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఓ కథనాన్ని ప్రసారం చేసిన మహా న్యూస్ ఛానెల్‌పై బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు దాడి జరిపి, విధ్వంసం సృష్టించిన సంఘటనను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) తీవ్రంగా స్పందించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజెయు) జాతీయ కార్య వర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణలు జూబ్లీహిల్స్‌లోని మహా న్యూస్ ఛానెల్ కార్యాలయాన్ని సందర్శించి విధ్వంసం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం విరాహత్ అలీ మీడియాతో మాట్లాడుతూ, హింసకు దూరంగా, శాంతియుత పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు దురదృష్టకరమన్నారు. మీడియా సంస్థపై ఇనుప రాడ్లు, కర్రలు, బండరాళ్లతో హింసాత్మకంగా ఇలాంటి దాడులు జరపడం ఇది ప్రథమం అన్నారు. తెలంగాణ రాష్ట్రం మానవ హక్కుల పరిరక్షణలో, భావ ప్రకటన స్వేచ్ఛకు దేశంలో ఆదర్శంగా ఉండేలా చూడాలి కానీ, ఇలాంటి పాశవిక దాడులతో కాదని అన్నారు. ఈ సంఘటనను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## అంబేద్కర్ సమర్థించలే

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు సమర్థిస్తూ ఒకే రాజ్యాంగం కింద ఐక్య భారత దేశం అనే డాక్టర్ అంబేద్కర్ దార్శనికత నుండి సుప్రీంకోర్టు స్ఫూర్తి పొందిందన్నారు. ఆర్టికల్ 370ను రద్దు చేయాలనే కేంద్ర ం నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ బెంచ్‌లో బిఆర్. గవాయ్ ఒకరుగా ఉన్నారు. ఆర్టికల్ 370సవాల్ చేయబడి మా ముందు ఆ పిటిషన్ విచారణ జరుగుతోంది. నేను అప్పుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మాటలు గుర్తు చేసుకున్నాను. 'ఒకవేళ మనం దేశాన్ని ఐక్యంగా ఉంచాలనుకుంటే మనకు ఒకే ఒక్క రాజ్యాంగం అవసరం' అని డాక్టర్ అంబేద్కర్ కార్యక్రమానికి హాజరైన మరాఠీలను ఉద్దేశించి ప్రసంగించారు.2019 ఆగష్టు 5న జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలగించి దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించాలని కేంద్రం నిర్ణయించింది. సిజెఐ బిఆర్.గవాయ్ మాట్లాడుతూ రాజ్యాంగం చాలా సమాఖ్యవాదాన్ని కల్పిస్తుందని, యుద్ధ సమయాలలో దేశం సమైక్యంగా ఉండకపోవచ్చని డాక్టర్ అంబేద్కర్‌ను విమర్శించారని ఆయన చెప్పారు. అయితే రాజ్యాంగం సవాళ్లను ఎదుర్కొని, దేశాన్ని ఐక్యంగా ఉంచుతుందని ఆయన చెప్పారని భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఈ సందర్భంగా తెలియజేశారు. 'మన పొరుగుదేశాలలో పరిస్థితిని చూడండి. అది పాకిస్థాన్, బంగ్లాదేశ్ లేదా శ్రీలంక అయినా మన దేశం సవాళ్లను ఎదుర్కొన్నప్పుడల్లా అది ఐక్యంగా ఉంది' అని సిజెఐ గవాయ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ రాజ్యాంగ ప్రవేశిక పార్క్‌ను, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఆవిష్కరించడం తనకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిగా గవాయ్ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని ప్రశంసించారు. మనం ప్రవేశిక విలువలను అంగీకరిస్తే ఎప్పటికీ ఈ దేశంలోని 90శాతం సమస్యలు సమస్యలు పరిష్కారం అవుతాయని ఫడ్నవీస్ చెప్పారు.

## గుండు గీయించి వివస్త్రను చేసి..

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తూ.. ఆమెతో కలిసి పది రోజుల క్రితం అజ్ఞాతంగా వెళ్లిపోయినట్లుగా సమాచారం. ఈ వ్యవహారాన్ని తెలుసుకున్న మొదటి భార్య, తనకు జరిగిన అన్యాయాన్ని తల్లిదండ్రులకు వివరించేందుకు స్వగ్రామమైన తాటికాయలకు చేరుకుంది. ఆమె చెప్పిన విషయాలపై ఆగ్రహించిన కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు స్పందనగా మానవత్వాన్ని మరిచి ఘోరంగా వ్యవహరించారు.

**మంచానికి కట్టేసి వివస్త్రం.. జననాంగంపై జీడిపోసి హింస**

సుమారు ఐదు రోజుల క్రితం మహిళా దంపతులను తాటికాయల గ్రామానికి తీసుకువచ్చి ప్రజల ముందు పెట్టారు. గ్రామస్థుల సమక్షంలో వాళ్లిద్దరినీ విచక్షణారహితంగా దాడి చేశారు. మొదటగా ఇద్దరికీ అర గుండు గీయించి అవమానించగా.. అనంతరం బాధిత మహిళను మంచానికి కట్టేసి పూర్తిగా వివస్త్రను చేశారు. ఇంతటితో ఆగకుండా ఆమె జననాంగంపై పురాతన కాలంలో ఉపయోగించే జీడిని దారుణంగా పోసి శారీరకంగా హింసించారు. బాధిత మహిళ ఎంత వేడుకున్నా.. తప్పు చేశాను, క్షమించండి అని కేకలు వేసినా ఎవరూ కనికరించలేదు. గ్రామస్థులంతా కలిసి మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు.

**తీవ్ర రక్తస్రావం.. ఆ తర్వాత ఆచూకీ లేదు**

ఈ దాడిలో తీవ్ర గాయాలైన మహిళకు రక్తస్రావం ప్రారంభమయినా ఆమెకు చికిత్స కల్పించలేదు. అనంతరం ఆమెను, ఆమె భర్తను ఎక్కడికి తీసుకెళ్లారన్నది ఇప్పటివరకు తెలియరాలేదు. కుటుంబ సభ్యులు, పోలీసులకు గానీ వారి ఆచూకీ లభించలేదు. ప్రాణాలతో ఉన్నారా.. లేక ఏదైనా ప్రమాదం జరిగిందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

## దాడి హేయం

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ మీడియా స్వేచ్ఛపై తీవ్రమైన దాడి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డులో ఛానల్ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టులు పని చేస్తున్న సమయంలోనే బిఆర్‌ఎస్ నాయకులు రాళ్ళతో విధ్వంసానికి పాల్పడి బీభత్సం సృష్టించడం దుర్మార్గమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

**యాంకర్ స్వేచ్ఛ మృతికి సంతాపం :**

యాంకర్ కవయిత్రి స్వేచ్ఛ విషాద మరణం పట్ల కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అర్థాంతరంగా మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. స్వేచ్ఛ కుటుంబసభ్యులకు కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబికి చిక్కిన అవినీతి ఉద్యోగులు



ప్రజాపక్షం/సుల్తానాబాద్:పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఎసిబి అధికారులు నిత్యం దాడులు నిర్వహిస్తున్న కొందరి ఉద్యోగుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకుండా పోయింది. అక్రమ సంపాదనే ధ్యేయంగా వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్న బాధితులను పట్టిపీడిస్తున్నారు. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ పరిధిలో ఆర్నకొండ రాజు అనే వ్యక్తి తన ఇంటి నెంబర్ మంజూరుకై ఏడాది నుండి సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. సదరు బాధితుడు అవసరాన్ని ఆసరాగా చేసుకుని సుల్తానాబాద్ మున్సిపల్‌లో ఇన్‌ఛార్జిగా ఆర్ఐ విధులు నిర్వహిస్తున్న వినోద్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ బాధితుడి వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్ఐ వినోద్ బిల్ కలెక్టర్ విజయ్ చేష్టలకు విసిగి వేసారి పోయిన ప్రసాద్ ఎసిబిని ఆశ్రయించాడు. ఆర్ఐవినోద్, బిల్ విజయ్ ఇద్దరూ పూసాల రోడ్‌లో గల ప్రసాద్ ఫోటోషాప్‌లో ప్రసాద్ వద్ద నుండి రూ.5000/‌- డబ్బులు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# నీటి భద్రతే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతి నీటిపారుదల ప్రాజెక్టుకు పూర్తి సామర్థ్యంలో వినియోగించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, ప్రణాళిబద్ధంగా ముందుకు సాగుతున్నదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పశు సంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని జురాల ప్రాజెక్టు ర్యాలంపాడు రిజర్వాయర్‌లను సందర్శించి జురాల ప్రాజెక్టు ఏర్పడిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జురాల ప్రాజెక్టు సాంకేతికంగా పూర్తి భద్రంగా కొనసాగుతుందని తెలిపారు. 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పనిచేస్తున్నాయని తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్ సమస్య తలెత్తినప్పటికి, దానివల్ల ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. గతంలో ఎన్నో భారీ వరదలను జురాల డ్యామ్ విజయవంతంగా ఎదుర్కొందని, ఇప్పుడు కూడా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం జాగ్రత్తలు పాటిస్తుందని తెలిపారు. గత దశాబ్దకాలంలో తెలంగాణలో జరిగిన పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం గత పాత తప్పిదాలను సరిచేసే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. కేవలం 18 నెలల్లోనే ఇరిగేషన్ లో ఆపరేషన్ మెయింటెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జురాల డ్యాంపై నుండి భారీ వాహనాలు వెళ్లడాన్ని పూర్వంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికి, గత ప్రభుత్వ పాలనలో వాటిని పట్టించుకోలేదన్నారు. కానీ ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి, జురాల ఆవరణలో ఆల్టర్నేట్ రోడ్డు, వాహనాల వంతెన కోసం రూ.100కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. అంతేకాకుండా జురాల, మంజీరా, నాగార్జున సాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నింటికి రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే సాంకేతికంగా సమర్ధవంతంగా నిర్వహించ దం జరుగుతుందని తెలిపారు. జురాలకు అదనం గా గ్యాంట్రీ కోసం రూ.3.5కోట్లు నిధులు మంజూ రు చేస్తున్నట్లు తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగు టిఎంసిల వరకు పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం రెండు టిఎంసిల వరకు మాత్రమే నీరు నిల్వ అవుతుంది. మిగతా రెండు టీఎంసీల సామర్థ్యం అమలు అయితే రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందని అన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జురాల ప్రాజెక్టు ఎంత మాత్రం ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిన విశ్వసనీయ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. 2009 లో వచ్చిన భారీ వరదలు సమయంలోనూ రోజుకి 12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినప్పటికి, ప్రాజెక్టు ఎంతమాత్రం నష్టాన్ని ఎదుర్కొనలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఓ అండ్ ఏం.శ్రీనివాస్, డ్యామ్ సేఫ్టీ చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీలా, వనపర్తి చీఫ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణరెడ్డి, గద్వాల సూపరింటెండింగ్ ఇంజనీర్ రహీంఉద్దీన్, తదితరులు ఉన్నారు.

# త్వరలో సమగ్ర విత్తన సవరణ చట్టం

* రైతులు, విత్తన కంపెనీలు, అధికారులు, ఇతర రాష్ట్రాల వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు దాదాపు పూర్తి
* త్వరలో మంత్రివర్గానికి ముసాయిదా సమర్పణ



ప్రజాపక్షం/హైదరాబాద్: విత్తనం విత్తడం మొదలు... పంట చేతికి వచ్చే వరకు ఆరుగాలం కష్టపడుతున్న రైతు ఆదిలోనే మోస పోకుండా నాణ్యమైన విత్తనాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృఢచిత్తంతో ముందుకు సాగుతున్నది. అందులో భాగంగా రాష్ట్రంలో నకిలీ విత్తన కంపెనీలను కట్టడి చేసేందుకు నూతన సమగ్ర విత్తన చట్టం రూపకల్పన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రతి ఏటా నకిలీ విత్తనాలతో ఒకవైపు రైతులు, విత్తన కంపెనీల మోసాలతో మరోవైపు విత్తన ఉత్పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలకు సంబంధించి రైతు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో రైతు కమిషన్ క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విత్తన కంపెనీల మోసాలను వెలుగులోకి తెచ్చింది. నకిలీ విత్తన సంస్థలను ఆరికట్టేందుకు సమగ్ర చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నకిలీ విత్తానాల కంపెనీల మోసాలను అరికట్టేందుకు సమగ్ర విత్తన చట్టం ముసాయిదా రూపకల్పనకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి కన్వీనర్‌గా, విత్తన కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యు లు భూమి సునీల్, రైతు కమిషన్ సలహాదారు దొంతి నర్సింహ్మారెడ్డి తదితరులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ముసాయి దా రూపకల్పనకు పూర్తి స్థాయి కసరత్తు మొదలు పెట్టిన కమిటీ సాధ్యమైనంత తర్వలో రాష్ట్రంలో నూతన విత్తన సవరణ చట్టం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది.

విత్తన చట్టం ముసాయిదా డ్రాఫ్ట్‌లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, గద్వాల్, నిజామాబాద్ జిల్లాల్లో పర్యటించి ముసాయిదా కమిటీ వివిధ జిల్లాలోని గ్రామాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. అదేవిధంగా విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సైతం పలు సమావేశాలు నిర్వహిం చి సలహా, సూచనలు తీసుకుంది. అంతేకాకుండా విత్తన చట్టం రూప కల్పనలో భాగంగా హర్యానాలోపర్యటించిన విత్తన ముసాయిదా రూపకల్పన కమిటీ అక్కడ విత్తన చట్టం అమలవుతున్న తీరు ను, రైతుల అభిప్రాయాలు, అక్కడి చట్టంలోని అంశాలపై అధ్యయనం చేశారు.

ఇదే క్రమంలో ఇప్పటికే పలుమార్లు సమావేశమైన విత్తన చట్టం ముసాయిదా కమిటీ తెలంగాణలో సమగ్రమైన విత్తన చట్టం రూపకల్పనలో పొందపర్చాల్సిన అంశాలు, ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను ఇప్పటికే కొలిక్కి తీసుకువచ్చారు. అయితే డ్రాఫ్ట్ తయారీ మరింత పారదర్శకంగా ఉండేవిధంగా విత్తన రంగంలో అనుభవం ఉన్న వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలను మరిన్ని తీసుకుని వాటిని కూడా క్రోడీకరించుకుని తుది ముసాయిదాను సిద్ధం చేసింది. ఈ ముసాయిదాపై తుది చర్చల అనంతరం త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొంది అనంతరం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం తీసుకురానున్నది.

## కవితను కలవడంలో రాజకీయ ప్రాధాన్యం లేదు

### సిపిఐ ఎంపి సందోష్ కుమార్



ప్రజాపక్షం / హైదరాబాద్: బిఆర్ఎస్ మాజీ ఎంపి కవితను తాను కలవడంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, ఆమె ఆహ్వానంపై మర్యాద పూర్వకంగా కలిసిన ట్లు సిపిఐ రాజ్య సభ సభ్యులు పి.సందోష్ కుమార్ తెలిపారు. రాజకీయ, ఇతర అంశాలపై తమ మధ్య చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. తమ భేటీని రాజకీయంగా తప్పుగా అన్వయించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తనకు హైదరాబాద్‌లో అనేకమంది రాజకీయ మిత్రులున్నారని, వ్యక్తిగత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చానని, ఈ సందర్భంగా కవిత ఆహ్వానం మేరకు మర్యాద పూర్వకం గా వారి ఇంటికి వెళ్ళినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

## సింగరేణి ఉద్యోగి కుటుంబానికి రూ.1.2కోట్ల ప్రమాద బీమా చెక్కు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్:సింగరేణిలో అమలు జరుపుతున్న ఉచిత ప్రమాద బీమా పథకం కింద ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఒక కార్మికుని కుటుంబానికి రూ.1.20కోట్ల బీమా సొమ్ము చెక్కు ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అందజేశారు.

మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజాభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును మృతి చెందిన రామగుండం 1 ఏరియాకు చెందిన సపోర్టు మెన్ పెంద్రి రంజిత్ కుమార్ భార్య లతకు అందజేశారు. సింగరేణి కార్మికుడు పెంద్రి రంజిత్ కుమార్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేతన ఖాతా ఉంది. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి నామినీగా ఉన్న భార్య లతకు రూ.1.2 కోట్ల ప్రమాద బీమా కింద చెల్లించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ అనుకోని ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్లయితే అతని కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ పథకాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు. మృతుని కుటుంబానికి త్వరలో కారుణ్య నియామక పత్రాలు అందచేస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, రెడ్‌కో వైస్ చైర్మన్, ఎండి ఆనీలా, ఎస్‌బిఐ డిజిఎం నీలాక్షి సింగ్, రీజనల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్‌డిఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

## 44 మంది 'డిఎస్‌పిల బదిలీ'

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 44 మంది డిఎస్‌పిలను బదిలీ చేస్తూ శనివారం డిజిపి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | బదిలీ అయిన స్థానం |
|---|---|
| వై.నాగేశ్వర్‌రావు | సైబరాబాద్ సిసిఎస్ |
| ఆకుల చంద్రశేఖర్ | రాచకొండ ట్రాఫిక్ |
| సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి | కల్వకుర్తి |
| పల్లె వెంకటేశ్వర్లు | డిజిపి కార్యాలయం |
| కొంతం చంద్రశేఖర్‌రెడ్డి | మాదాపూర్ ట్రాఫిక్ |
| కందుల సత్యనారాయణ | డిజిపి కార్యాలయం |
| వి.కిరణ్‌కుమార్ | రామగుండం ఎస్‌బి |
| వై.నర్సింహ్మారెడ్డి | జిహెచ్‌ఎంసి |
| పద్మనాబుల శ్రీనివాస్ | డిజిపి కార్యాలయం |
| ఎన్.సి.రంగస్వామి | రాచకొండ ఎస్‌ఒటి |
| పి.సతీష్ | సిఐడి |
| కాపుగాని శ్రీనివాస్ | సంగారెడ్డి డిఎస్‌పి |
| జి.రానవీర్‌రెడ్డి | హైదరాబాద్ ఎస్‌బి |
| సిహెచ్.శ్రీనివాస్‌జి | కరీంనగర్ సిసిఆర్‌బి |
| జి.విజయ్‌కుమార్ | యాదగిరిగుట్ట |
| అనుమల శ్రీనివాస్ | హైదరాబాద్ ట్రాఫిక్ |
| ఎస్.సంపత్‌కుమార్ | రాచకొండ కమాండ్ కంట్రోల్ |
| ఎన్.ప్రవీందర్‌రావు | ఇంటెలిజెన్స్ |
| పి.రమేష్‌కుమార్ | నార్కోటిక్ బ్యూరో |
| కె.మనోజ్‌కుమార్ | సిఐడి |
| కె.శంకరయ్య | సైబర్ సెక్యూరిటీబ్యూరో |
| కె.రాంమోహన్‌రెడ్డి | హెచ్‌ఎండిఎ |
| ఎ.రవిందర్‌రెడ్డి | సైబరాబాద్ సైబర్ క్రైమ్ |
| బి.బిక్షపతి | ఇంటెలిజెన్స్ |
| జి.రాంమోహన్‌రెడ్డి | ఇంటెలిజెన్స్ |
| వి.సతీష్ | కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ |
| పి.శివభాస్కర్ | హైదరాబాద్ ఎస్‌బి |
| జె.నర్సిహులు | కరీంనగర్ సిసిఎస్ |
| కె.రాములు | హెచ్‌ఆర్‌సి |
| టి.మహేష్ | ఖమ్మం ఎస్‌బి |
| డి.దుర్గాప్రసాద్ | రాజన్నసిరిసిల్లా ఎస్‌బి |
| సర్దార్‌సింగ్ | సిఐడి |
| కె.సత్యనారాయణ | నిజామాబాద్ ఎస్‌బి |
| జి.శ్యామ్‌సుందర్ | మీర్‌చౌక్ |
| వెంకటేశ్వర్‌రావు | డిజిపి కార్యాలయం |
| భీమ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నల్గొండ ఎస్‌బి |
| పిల్లా రవిందర్‌రెడ్డి | రామగుండం సిసిఎస్ |
| జి.రవి | నల్గొండ డిసిఆర్‌బి |
| కె.పురుషోత్తంరెడ్డి | ఇంటెలిజెన్స్ |
| టి.సత్యనారాయణ | ఖమ్మం టాస్క్‌ఫోర్స్ |
| ఆర్.సత్యనారాయణరాజు | రాచకొండ పిడి సెల్ |
| ఎ.సూర్యనారాయణ | భూపాల్‌పల్లి (కాటారం) |
| బి.కిషన్‌కుమార్ | ఆసీఫ్‌నగర్ |
| బి.నందిరామ్ నాయక్ | డిజిపి కార్యాలయం |


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ)శాఖ

ఫారం - VI

(చట్టం 30/2013 యొక్క సెక్షన్-11(1) మరియు రూల్-19 ప్రకారం)

ప్రాథమిక నోటిఫికేషన్

భూ.సే.అ.& ఆర్.డి.ఓ.,కోరుట్లఫైల్.నెం.E/395/2025 తేది: 20.06.2025

జిల్లా కలెక్టర్, జగిత్యాల ఫైల్ నెం.G1/671/2025 తేది: 25.06.2025

జగిత్యాల జిల్లా, కోరుట్ల డివిజన్, ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామంలోని మొత్తం ఎ.2.38గు. భూమి, రుద్రంగి ట్యాంక్ (కలికోట సూరమ్మ చెరువు), శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-II ఫేజ్-I కలికోట సూరమ్మ చెరువు కట్ట పొడిగింపు చేయుట కొరకు మొత్తం ఎ.2.38గు. అవసరమున్నదని, తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు భావిస్తున్నారు.

సదరు భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస పునరుపాది కల్పనా చట్టం, 2013 లోని సెక్షన్-10-A(b) క్రింద ఇవ్వబడిన అధికారాల అమలులో, తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.యం.ఎస్.నెం.47, I&CAD (LA.R&R/A2) శాఖ, తేది: 25.07.2017 ద్వారా శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-II ఫేజ్-I మరియు కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజీలకు RFCTLA&RR చట్టం, 2013 యొక్క అధ్యాయం-II & III యొక్క దరఖాస్తును మినహాయించింది. I, II & III మంథని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరియు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిభందనల నుండి మినహాయింపు ఆదేశాలను జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: కలికోట మండలం: కథలాపూర్ జిల్లా: జగిత్యాల

| క్ర.సం. | సర్వే నం. | భూమి వివరణ | భూమి రకము తరి / ఖుష్కి | సేకరించవలసిన విస్తీర్ణము | ఆసక్తిగల వ్యక్తుల పేరు & వివరాలు | సరిహద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 90/1 | పట్టా | ఖుష్కి | 1.00 | మునిగంటి రాజ్ కుమార్ తండ్రి నడ్పన్న | 89 | 138 | 91 | 93 | |
| 2 | 91/1 | పట్టా | ఖుష్కి | 0.22½ | మునిగంటి రాజనర్సయ్య తండ్రి నర్సింలు | 90, 93 | 138 | 138 | 92 | |
| 3 | 91/2 | పట్టా | ఖుష్కి | 0.22½ | మునిగంటి రాజ్ కుమార్ తండ్రి నడ్పన్న | 90, 93 | 138 | 138 | 92 | |
| 4 | 92/3 | పట్టా | ఖుష్కి | 0.09 | గాధనవేణి మల్లేశం తండ్రి కొమురయ్య | 93 | 91 | 138 | 138 | |
| 5 | 92/1 | పట్టా | ఖుష్కి | 0.03 | మునికోట గంగారం తండ్రి హన్మయ్య | 93 | 91 | 138 | 138 | |
| 6 | 92/2 | పట్టా | ఖుష్కి | 0.03 | మునికోట కళావతి భర్త బ్రహ్మయ్య | 93 | 91 | 138 | 138 | |
| 7 | 93/2 | పట్టా | ఖుష్కి | 0.09 | మార్కం మల్లేష్ తండ్రి నర్సయ్య | 94, 96 | 90, 91 | 92 | 98 | |
| 8 | 93/1 | పట్టా | ఖుష్కి | 0.09 | మార్కంహన్మాండ్లు తండ్రి నర్సయ్య | 94, 96 | 90, 91 | 92 | 98 | |
| మొత్తం విస్తీర్ణం | | | | 2.38 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్దమైన పరిహారాన్ని పొందే హక్కు భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస పునారుపాది కల్పనా చట్టం, 2013లోని సెక్షన్ 11(1) (చట్టం, 30/2013) ప్రకారం సంబందిత భూ యజమానులకు తెలియచేయుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్, జగిత్యాల / భూసేకరణ అధికారి &రెవెన్యుడివిజినల్ అధికారి, కోరుట్ల వారి కార్యాలయములో ఉంచనైనది. సంబందిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

6 X 25

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు భూసేకరణ అధికారి & రెవెన్యు డివిజినల్ అధికారి, కోరుట్ల గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబందిత సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదేని ప్రదేశంలో ప్రవేశించి సర్వేజరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని తవ్వడానికి లేదా భూ స్వరూపం తెలుసుకొనుటకుబోర్ వెయ్యడానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సదరు సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, జగిత్యాల గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబందించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్టుకు సంబందించిన చర్యలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయనైనది.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఏలాంటి సంబందం ఉన్న వ్యక్తులైన భూసేకరణపై సెక్షన్-15 ప్రకారం అభ్యంతరాలు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో జిల్లా కలెక్టరు, జగిత్యాల / భూసేకరణ అధికారి & రెవెన్యు డివిజినల్ అధికారి, కోరుట్లగారి ముందు వారి అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోరుట్ల | సం/- అదనపు కలెక్టర్ జగిత్యాల | సం/- జిల్లా కలెక్టర్ జగిత్యాల

DIPR RO NO. 322/LA/PP/Advt/Pub/2025-26


# ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఆయిల్ ఫామ్ పంటల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని, రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు.శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల మున్సిపాలిటీ పరిధి దేవుని ఎర్రవల్లి గ్రామంలో పామాయిల్ మెగా ప్లాంటేషన్ తోటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు వైవిధ్యమైనటువంటి ఆయిల్ పామ్ పంటలను ఎక్కువ సంఖ్యలో వేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకోసం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నామని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎన్ని ఎకరాలు సాగుచేసినా ఇస్తామని తెలిపారు.రైతుకు మొక్కల దగ్గరి నుంచి, మార్కెటింగ్ వరకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ మేరకు ప్రతి జిల్లాకు ఆయిల్ ప్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

అనంతరం మంత్రి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి పొలంలో ఫామాయిల్ మొక్కలను నాటి, రైతులకు యూరియాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా, జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.సురేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విజయనగరం ఉగ్ర కేసు ఎన్ఐఎకు బదిలీ



ప్రజాపక్షం/హైదరాబాద్:ఇటీవల సచలయం రేపిన విజనగరంలో వెలుగు చూసిన ఉగ్ర కేసు శనివారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) హైదరాబాద్‌కు బదిలీ చేశారు. గత నెలలో వెలుగుచూసిన ఈ కేసులో విజనగరంకు చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యిద్ సమీర్ లను విజయనగరం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో వీరిద్దరు హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో బాంబు దాడులకు కుట్ర పన్నినట్లు, అందుకు కావాల్సిన నిధులను హవాలా ద్వారా వచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నిందితులు విశాఖపట్నం జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. సిరాజ్ తండ్రి పోలీసు శాఖలో ఎస్ఐగా పనిచేస్తున్నాడు. సిరాజ్, సమీర్‌లకు చెందిన బ్యాంక్ ఖాతాలను విజయనగరం పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో మరికొందరు అనుమానితులను కూడా విచారించారు. అయితే ఇది ఉగ్ర కేసు అవ్వడంతో కేసును ఎన్ఐఎకు బదిలీ చేశారు. విశాఖపట్నం జైలులో ఉన్న ఈ ఇద్దరు ఉగ్రవాదులను విచారణ నిమిత్తం త్వరలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఎన్ఐఎ అధికారులు విచారించనున్నారు. ఇందుకోసం విజయనగరం కోర్టులో కస్టడీ పిటిషన్ కూడా ఒకటి రెండు రోజు ల్లో ఎన్ఐఎ అధికారులు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### హరీష్‌రావుపై చనగాని దయాకర్ విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్:నిరుద్యోగ యువతను మళ్లీ రెచ్చగొట్టి, ఓట్లు పొందాలని బిఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి హరీష్‌రావు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ళు పాలించి ఉద్యోగాలు భర్తీ చేయకుండా మోసం చేయడం పట్ల మొదట క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేండ్లు పాలించి, నిరుద్యోగులను నిలువునా ముంచి, నేడు రాజకీయ డ్రామాలు అడడం సిగ్గుచేటని విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలను తప్పకుండా తిప్పి కొడతామని ఆయన హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగమాడిందని, చివరకు వారు ఆత్మహత్యలకు పాల్పడానికి కారణమైందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగుల గురించి కానీ, ఉద్యోగాల భర్తీ గురించి బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు.

# అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ తన వద్దే పెట్టుకున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు?. విద్యారంగ సమస్యలు సంబంధిత అధికారులకు చెప్పినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సిఎం తన వద్ద విద్యాశాఖ పెట్టుకుని సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహించడం లేదన్నారు. విద్యార్థులకు 5లక్షల భరోసా కార్డు, ప్రతి విద్యార్థికి ఎలక్ట్రిక్ స్కూటీ, ప్రతి విద్యార్థి ఇంటింటికీ ఉచిత ఇంటర్నెట్, విద్యా జ్యోతి పథకం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. కెజీ పాఠశాల నుంచి ప్రైవేట్ యూనివర్సిటీ వరకు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తాము అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలు ఒకేసారి విడుదల చేస్తామన్న సిఎం రేవంత్‌రెడ్డి నేడు విద్యార్థుల జీవితాలతో, బడ్జెట్ కళాశాల టీచింగ్ స్టాఫ్ కుటుంబాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వ పాఠశాల కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, కెజిబివి, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత పాటించేలా ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీం నియమించి నిత్యం తనిఖీలు నిర్వహించాలని, పెరిగే నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు మరింత పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?

### జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: జిల్లా పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని జాగృతి అధ్యక్షురాలు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మీడియాతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ పసుపు బోర్డుకు పదేపదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపి అరవింద్ హోంమంత్రికి చెప్పకపోవచ్చన్నారు. నిజామాబాద్ లోనే పసుపునకు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు. కాబట్టే మొన్నటి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. జిల్లా రైతులు సంతోషపడేలా అమిత్‌షా మద్దతు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్‌ఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com, సెల్ నెం. 7331186858

NIT No. 13/SE/SLPZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 28.06.2025

పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, సర్కిల్-20లో ఎంపిపి స్కూల్ భవనం నిర్మాణం (01 ఐటమ్). అంచనా విలువ / ఇసివి: రూ.200.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 30.06.2025న మ.1.00గం.ల నుండి 07.07.2025న మ.1.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎస్ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7331186858.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 4341-PP/CL/ADVT/1/2025-26, Date: 28-06-2025



hmda
హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, చీఫ్ ఇంజనీర్ కార్యాలయం.
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038

NIT No. HMDA/DEV/CE/14/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025

"ప్యారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట్ వద్ద ఓఆర్ఆర్ జంక్షన్ రాజీవ్ రహదారి (SH-01) (కి.మీ 0/00-18/300) మరియు ప్యారడైజ్ ఇన్ నుండి డైరీ ఫామ్ రోడ్ (NH-44)) (కి.మీ 0/00-4/200) వరకు ఎలివేటెడ్ కారిడార్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే ప్రభావిత డిఫెన్స్ బౌండరీ గోడలు, ప్రహరి గోడ మరియు ఫెన్సింగ్ నిర్మాణ పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి". బిడ్ల సమర్పణకు చివరి తేదీ: 10.07.2025. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.inని సందర్శించండి.

సం/- చీఫ్ ఇంజనీర్, హెచ్‌ఎండిఎ.

DIPR R.O. No. : 4355-PP/CL/ADVT/1/2025-26, Date: 28-06-2025





## ఏనుగు పిల్ల.. అరటి పండ్లు..




రెండు పెద్ద ఏనుగుల మధ్యలో జాగ్రత్తగా నడుస్తున్న ఓ ఏనుగు పిల్ల హఠాత్తుగా వేగాన్ని తగ్గించి, పక్కనే ఒక తోపుడు బండిపై అరటిపండ్లను ఒడిసి పడుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఐఎఫ్ఎస్ మాజీ అధికారిణి సుశాంతా నందా తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసిన వీడియో గున్న ఏనుగు అరటి పండ్లను తీసుకోవడం స్పష్టంగా కనిపిస్తున్నది. అరటి పండ్ల వ్యాపారి, పక్కనే ఉన్న ఒక మహిళ తొలుత భయపడ్డారు. తర్వాత ఏనుగు పిల్లను చూసి ముచ్చటపడుతూ, అరటి పండ్లను అందించారు. ఆ ఏనుగు పిల్ల దర్జాగా వాటిని తీసుకొని, తనదారిన తాను వెళ్లింది. ఈ ఘటనలపై కొంత మంది సరదగా రియాక్ట్ అవుతుండగా, మరికొంత మంది అటవీ ప్రాంతాలను విచక్షణారహితంగా కొట్టివేయడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగు పిల్ల కాకుండా, పెద్ద ఏనుగులే వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రామీలు, పట్టణాలు... చివరికి నగరాల్లోకి కూడా వణ్యప్రాణులు చొరబడే దుస్థితి నెలకొనడాన్ని ప్రభుత్వాల వైఫల్యంగా విమర్శిస్తున్నారు. అది కూడా నిజమే.

## డ్రెస్ కోడా.. స్కూల్ యూనిఫామా?



ఇదెక్కడి విడ్డూరం అంటూ, పేరు తెలియని కంపెనీపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడిట్'లో దర్శనమిచ్చిన ఓ స్క్రీన్‌షాట్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. తన స్నేహితుడికి ఓ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని స్క్రీన్ షాట్‌ను షేర్ చేసిన వ్యక్తి పేర్కొన్నాడు. అయితే, ఆ కంపెనీ పేరునుగానీ, అది ఎక్కడ ఉన్న విషయాన్నిగానీ ప్రస్తావించలేదు. కానీ, అందులో పేర్కొన్న విషయాలు చర్చనీయాంశమయ్యాయి. మహిళా ఉద్యోగస్తులంతా తప్పనిసరిగా చున్నీ వేసుకొని, దానికి పిన్నులు తప్పక పెట్టుకోవాలని ఆ కంపెనీ షరతుల్లో ఉంది. అదే విధంగా, జుట్టుకు కనీసం రబ్బర్ బ్యాండ్ పెట్టుకోవాలని స్పష్టం చేసింది. అలాగే, పురుషులు టీ షర్టులు వేసుకోవడానికి వీల్లేదని నిబంధన విధించింది. జీన్స్ ప్యాంట్‌ను అనుమతించినప్పటికీ, చొక్కాని ఇన్‌షర్ట్ చేసుకొని తీరాలని తేల్చిచెప్పింది. కాగా, డ్రెస్‌కోడ్ పేరుతో స్కూల్ యూనిఫామ్ ప్రవేశపెడుతున్నారంటూ కొంత మంది నెటిజన్లు విమర్శిస్తుండగా, పనిచేసే ప్రాంతాలను గౌరవించాలని, ఇష్టానుసారంగా రావడం అక్కడి సానుకూల వాతావరణాన్ని దెబ్బతీస్తుందని మరికొందరు వాదిస్తున్నారు. ఎలాంటి బట్టలు వేసుకోవాలి.. జట్టు ఏ విధంగా ఉండాలి అనే విషయాల్లోనూ యాజమాన్యాల జోక్యం అనవసరమని కొందరి అభిప్రాయం. వర్క్ ప్లేస్ అన్నతర్వాత కొంతైనా డిసెన్సీ అవసరమని ఇంకొందరి నమ్మకం. ఏదిఏమైనా, ఒక కంపెనీ ఈ విధంగా డ్రెస్, అప్పీయరెన్స్ కోడ్ విధించడంపై సర్వత్రా చర్చ కొనసాగుతున్నది.

## కుక్కలతో వాకింగ్ ప్రమాదకరం!



కుక్కలను తీసుకొని వాకింగ్‌కు వెళ్లడం చాలా మందికి అలవాటు. అయితే, అవి హఠాత్తుగా పరుగులు తీసినప్పుడు లేదా ఇష్టం వచ్చినట్టు నడుస్తున్నప్పుడు, దానిని పట్టుకున్న వారు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతుంటారు. ఇలాంటి గాయాలకు చికిత్స తప్పనిసరి అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి చికిత్స విలువ 269.62 కోట్ల రూపాయలు. అమెరికా, సింగపూర్ సంస్థలు నిర్వహించిన అధ్యయనం ప్రకారం, ఏటా కనీసం ఐదు లక్షల మంది కుక్కలను వాకింగ్‌కు తీసుకెళుతూ గాయపడుతున్నారు. వీరిలో మూడు వంతుల మంది మహిళలే. 65 లేదా అంతకంటే ఎక్కువ వయసుగల వారు 31 శాతం. కాబట్టి, కుక్కలతో వాకింగ్‌కు వెళ్లడం ఎంత ప్రమోదమైనదో, అంత ప్రమాదకరమైనది కూడా. ఇక కుక్కలు వెంటపడినప్పుడు కిందపడడం, దాడిలో తీవ్రంగా గాయపడడం తరచు జరుగుతునే ఉంటాయి. వాకింగ్ సమయంలో జరుగుతున్న ప్రమాదాలకు దాదాపు సమానమైన సంఖ్యలో ఇలాంటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఏ విధంగా చూసినా కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే, ఆసుపత్రులపాలుకావడం ఖాయం.

## అనుకోని ఆవిష్కరణ



అనుకోకుండా వచ్చిపడే ప్రమాదాలేకాదు... ఒక్కోసారి ఊహించని మంచి కూడా జరుగుతుంది. ఇందుకు సిరియన్ కాంట్రాక్టర్ చేసిన ఓ గొప్ప ఆవిష్కరణే నిదర్శనం. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోని మారత్ అల్‌నుమాన్‌లో, ఒక శిథిలమైన ఇంటిని పూర్తిగా తొలగించి, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు సిరియన్ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టాడు. అలెప్పో–డెమాస్కస్ నగరాల మధ్య ఈ ప్రాంతం ఉంది. దెబ్బతిన్న భవనానికి ఆనుకొని కనిపించిన ఒక గొయ్యి అతని దృష్టిని ఆకర్షించింది. అక్కడ తవ్వి చూసినప్పుడు, బైజాంటైన్ కాలానికి చెందిన సమాధుల సముదాయం ఒకటి కన్పించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని పురవస్తు శాఖ అధికారులకు చెప్పాడు. వారు అక్కడ పూర్తిస్థాయిలో తవ్వకాలు జరిపి, ఆ సమాధులు కనీసం 1,500 సంవత్సరాల క్రితం నాటివని ప్రకటించారు. అక్కడ లభించిన కుండలు, గాజు ముక్కలు, ఎముకలు, ఇతర వస్తువుల ఆధారంగా వారు ఈ నిర్ణయానికి వచ్చారు. సిరియాలోని స్మారక చిహ్నాల్లో కనీసం మూడో వంతు ఇడ్లిబ్‌లోనే ఉండడం విశేషం. అక్కడ ఇప్పటి వరకూ ఒక పురాతన నగరంతోపాటు, 800 చారిత్రక ప్రదేశాలను గుర్తించారు. తాజా ఆవిష్కరణ మాత్రం ఎవరూ ఊహించకుండానే జరిగింది. అయినప్పటికీ, చరిత్ర పరిశోధకులకు కావాల్సినంత సమాచారాన్ని అందిస్తున్నది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# ఎస్‌సిఒలో భారత్ దౌత్యవైఫల్యం

ప్రజాపక్షం 29-06-2025, ఆదివారం

పహల్గామ్‌లో టూరిస్టులపై టెర్రరిస్టు హత్యాకాండ, పాకిస్థాన్ నుంచి సీమాంతర ఉగ్రవాదం పాత్రగూర్చి వివరించి మన దేశ వైఖరికి సానుకూల అభిప్రాయం రూపొందించటానికై మోదీ ప్రభుత్వం అరడజను 'అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలను' 32 దేశాలకు పంపింది. కాని తను సభ్యునిగా ఉన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సభ్య దేశాలను విస్మరించింది. దీని దుష్ఫలితం జూన్ 25, 26 తేదీల్లో చైనాలోని క్వింగ్డావోలో ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశం సంయుక్త ప్రకటన ముసాయిదాలో వ్యక్తమైంది. పహల్గామ్‌లో టెర్రరిస్టుదాడి ప్రస్తావనలేని ముసాయిదా ప్రకటనను మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సబబుగానే తిరస్కరించారు, సంతకం చేయటానికి నిరాకరించారు, పహల్గాం ప్రస్తావనలేకపోగా 'బెలూచీస్థాన్‌లో అలజడులు' ఆ ప్రకటనలో చోటు చేసుకోవటం భారత్‌కు పుండు మీద కారం చల్లినట్లయింది. అంటే టెర్రరిజానికి అడ్డాగా ఉన్న, టెర్రరిజాన్ని ఆర్థికంగా, శిక్షణ, ఆయుధాల పరంగా ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ వాదన (బెలూచిస్థాన్‌లో తిరుగుబాటుదారులకు భారత్ అండదం డలనే ఆరోపణ) అందులో చోటుచేసుకుంది. ఏతీర్మానమైనా ఏకాభిప్రాయంతో ఆమోదించబడాలన్న నియమాన్ని 10 దేశాలతో కూడిన ఎస్‌సిఒ పాటిస్తున్నందున, భారత్ వ్యతిరేకించిన కారణంగా సంయుక్త ప్రకటన లేకుండా నే సమావేశం ముగిసింది. ఇది తీవ్రమైన దౌ త్యం వైఫల్యం, భారత్ ఏకాకి అయింది. ప్ర భుత్వం పునరాలోచించాలి. దిద్దుబాటు చర్య లు తీసుకోవాలి. ఒక దేశం –పాకిస్థాన్ అభ్యంతరం చెప్పటం వల్లనే పహల్గాం దాడి ముసాయిదా ప్రకటనలో చోటు చేసుకోలేదని చెప్పబడుతున్నది. మన ప్రభుత్వం సీమాంతర ఉగ్రవాదంపై ధ్వజమెత్తుతున్నా పాకిస్థాన్‌కు ప్రపంచం బ్యాంకు రుణాన్ని అడ్డుకోలేకపోయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో వాణిజ్యం ఆశ చూపి భారత్ – పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ సాధించానని అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికి 18సార్లు పునరుద్ఘాటించారు. ఎవరి జోక్యం లేదని ప్రధాని మోదీ ఎట్టకేలకు ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు చెప్పినా ఆయన పదే పదే అదే అంటున్నారంటే మోదీ ప్రభుత్వ బలహీనతపై ఆయన జూదమాడుతున్నారు. ఇదిలా ఉండ గా ట్రంప్ ఏకంగా పాకిస్థాన్ సైన్యాధిపతి , స్వయం ప్రకటిత ఫీల్డ్ మార్షల్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో విందు ఇచ్చారు. మన బాధ ప్ర పంచ బాధ కాదని ఈ ఉదంతాలు తెలియజేస్తున్నాయి. టెర్రరిజం అది ఏరూపంలో ఉన్నా – టెర్రరిస్టులపై , దానికి మద్దతు ఇచ్చే, ప్రోత్సహించే, ఆర్థిక తోడ్పాటు ఇచ్చేవారిపై ప్రపంచం ఏకోన్ముఖంగా పోరాటం చేయాలని, ద్వంద ప్రమాణాలు పనికిరావని కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ వేదికలపై మోదీ విజ్ఞప్తులు చేస్తున్నారు. కానీ టెర్రరిజం పట్ల ఎవరి అభిప్రాయాలు, అవసరాలు వారివి. అంతర్జాతీయ వ్యవహారాల్లో తమ ప్రయోజనాలను బట్టి అమెరికా టెర్రరిజాన్ని ఖండిస్తుంటుంది లేదా బలపరుస్తుంటుంది. ఇప్పు డు గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్నది బరితెగించిన టెర్రరిజం కాదా? మోదీ ప్రభుత్వం సైతం దాన్ని ఖండించిన పాపాన పోలేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో చైనా పాకిస్థాన్‌కు అండగా ఉందనో, చైనా ఆయుధాలను పాకిస్థాన్ ఉపయోగించిందనో చైనా పట్ల వ్యతిరేకత పెంచుకుంటే ఏమిలాభం? దక్షిణ చైనా సముద్రంపై చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవటం కోసం అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్‌లో భారత్ చేరలేదా? భూగోళ రాజకీయాల్లో ఎవరి ప్రయోజనాలు వారివి? అంతమాత్రాన ఎవర్నీ శత్రువులుగా నిందించకూడదు. మన దేశ వైఖరిని నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తూనే ఉండాలి. ఎస్‌సిఒలో ప్రస్తుత సభ్యులు:చైనా, రష్యా, ఇండియా, పాకిస్థాన్, ఇరాన్, బెలారుస్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్. కాగా ఇరాన్ ఎస్‌సిఒ సభ్యదేశమైనప్పటికీ దానిపై ఇజ్రాయిల్, అమెరికా బాంబుదాడులను అది ఖండించకపోవటం గమనార్హం. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించే తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ నుంచి భారత్ గైరుహాజరైనప్పుడే అది పూర్వ ప్రతిష్ఠను కోల్పోయింది. ఇంతటితో అయిపోలేదు. ఈ సంవత్సరాంతంలో చైనాలోని తియాన్‌జిన్‌లో ఎస్‌సిఒ శిఖరాగ్ర సభ ఉంది. అంతకు ముందు జులై 6న బ్రిక్స్ శిఖరాగ్ర సభ బ్రెజిల్‌లో ఉంది. ఈ రెండింటిలో ప్రధాని మోదీ పాల్గొంటారు. దేశాల అధినేతలతో సంభాషిస్తారు. టెర్రరిజంపై విస్తృతమైన ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు కొనసాగించవచ్చు.

# మోంకడాపై దాడికి 72 ఏళ్లు : క్యూబన్ విప్లవంలో మలుపు

అమెరికా ఖండంలో ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలో క్యూబా విప్లవం పలు విధాల చరిత్రకెక్కింది. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎన్ని ఆంక్షలు కొనసాగిస్తున్నా, బెదిరింపులకు పాల్పడుతున్నా క్యూబాలో 67 సంవత్సరాలుగా సోషలిజం దిశగా సమాజ పునర్నిర్మాణం జరుగుతోంది. క్యూబా విప్లవ చరిత్ర అమెరికా ఖండానికే కాదు భూగోళంమీది విప్లవ, ప్రగతిశీల శక్తులందరికీ స్ఫూర్తిదాయకం. క్యూబా విప్లవ చరిత్రలో మోంకడా బ్యారక్స్ (మిలటరీ స్థావరం)పై కాస్ట్రో సోదరుల నాయకత్వంలో 1953 జులై 26న జరిగిన దాడి విఫలమైనా అది చరిత్రను మలుపుతిప్పిన సంఘటన.

సూక్ష్మంగా చరిత్రలోకి తొంగిచూస్తే – ఫుల్‌జెన్సియో బాటిస్టా 1952 నుంచి 1959 వరకు డిక్టేటర్‌గా పరిపాలన సాగించారు. ఆ పాలనలో క్యూబా అన్ని రకాల నేరాలు, అవినీతికి ఆలవాలమైంది. 1952లో సైనిక తిరుగుబాటుద్వారా అధికారంలోకి వచ్చిన బాటిస్టా చేబట్టిన తొలి చర్య, సమాజ ప్రజాస్వామిక వ్యవస్థను రద్దు చేసి అధికారాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. ప్రజలు ఎంతో కాలం సహించలేదు, తిరుగుబాటు చేశారు. 1958–59లో అతన్ని అధికారంనుంచి తొలగించారు. ఆ ప్రజావెల్లువ సాయుధపరమైనది, రాజకీయమైనది కూడా. దాని నాయకుడు యువ లాయర్ ఫైడల్ కాస్ట్రో.

1953 జులై 26న మోంకడా బ్యారక్స్‌పై దాడి విఫలమైనాక, ఫైడల్ కాస్ట్రో, ఆయన గ్రూపును అరెస్టు చేశారు. వారు నిర్బంధంలో ఉండగానే "ఎం–26–7 (జులై 26వ తేదీ ఉద్యమాన్ని ఆ విధంగా పిలుస్తారు) ఏర్పడింది. కేసు విచారణలో కాస్ట్రో అనర్గళంగా 2 గంటలపాటు మాట్లాడారు. జనామోదంకోసం బాటిస్టా మోంకడా బ్యారక్‌పై దాడిలో సజీవంగా ఉన్నవారందరికీ క్షమాభిక్ష ప్రకటించాడు. కాస్ట్రో సోదరులు (ఫైడల్, రాల్) అజ్ఞాత జీవితంలోకి వెళ్లిపోయారు. మెక్సికో వెళ్లిపోయిన వారు తమ వ్యూహాలు పటిష్ఠం చేసుకుని 1956లో క్యూబా తిరిగి వచ్చారు. వారిని మెక్సికోలో కలుసుకున్న చేగువేరా కూడా వారితోపాటు వచ్చారు. కాస్ట్రో సోదరులు, చేగువేరా ప్రయాణిస్తున్న గ్రాన్మా ఓడపై బాటిస్టా సైనికులు దాడి చేశారు. వారు తప్పించుకుని సీర్రా మీస్ట్రా చేరుకున్నారు. అక్కడ వారు "ఎం–26–7" తిరుగుబాటు దళాలను పునః సమీకరించుకుని, పట్టణ ప్రాంతాల్లో విద్రోహకృత్యాలు చేస్తూ, రహస్యంగా రిక్రూట్‌మెంట్ చేబట్టారు. బాటిస్టాను వ్యతిరేకిస్తున్న అతిపెద్ద, అత్యంత శక్తిమంతంగా ఉండిన పాపులర్ సోషలిస్ట్ పార్టీ కాలక్రమంలో ప్రభావం కోల్పోతున్నది. దాని శ్రేణులను 26 జులై ఉద్యమం ఆకర్షించింది. బాటిస్టాపై అడపాదడపా తిరుగుబాట్లు జరుగుతుండగా, తిరుగుబాటు శక్తులు గెరిల్లా యోధుల స్థితినుంచి సుశిక్షితులైన సైన్యంగా తయారై బాటిస్టు సైన్యంతో తలపడుతున్నారు. బాటిస్టాను అధికారం నుంచి తొలగించాక, పాపులర్ సోషలిస్టు పార్టీ, జులై 26 ఉద్య మం, 13 మార్చి రివల్యూషనరీ డైరెక్టరేట్‌లతో కూ డిన సంకీర్ణం పరిపాలన చేబట్టింది. జులై 26 ఉద్యమ తిరుగుబాటు దారులు అంతిమంగా డిసెంబర్ 31, 1958 రోజున బాటిస్టాను కూలదోశారు, ఆయన దేశం వదిలి పారిపోయాడు.



కాస్ట్రో విప్లవశక్తులకు అత్యంత ముఖ్యమైన నాయకునిగా ఎదిగారు. అటుతర్వాత జులై 26 ఉద్యమం అనధికార ప్రభుత్వం అయింది. బాటిస్టా ను తొలగించాక కాస్ట్రో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడై అధికారాన్ని పటిష్ఠం చేసుకున్నా రు. అది దేశీయంగా, అంతర్జాతీయంగా ఉద్రిక్తతల కు దారితీసింది. 26 జులై 1953ను క్యూబాలో విప్లవదినంగా పాటిస్తారు. ఆ విధంగా ఏర్పడిన పార్టీ మార్క్సిస్టు–లెనినిస్టు పంథాలో సంస్కరణపొంది 1965 అక్టోబర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా గా అవతరించింది. కాస్ట్రో దాని ప్రధానకార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

క్యూబాలో ప్రారంభమైన విప్లవ క్రమానికి దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రాముఖ్యతగల పర్యవసానాలున్నాయి. ప్రత్యేకించి క్యూబా – అమెరికా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సర్దుబాటుకు క్యూబా ప్రయత్నాలు ఫలించలేదు. అంతేగాక క్యూబా విప్లవం అనేక లాటిన్ అమెరికా దేశాల్లో గాఢమైన ప్రకంపనలు సృష్టించింది. అది ప్రతిఘటనకు నమూనాగా మాత్రమేగాక విజయవంతమైన విప్లవం ఎలా ఉండాలో బ్లూప్రింట్ అయింది. లాటిన్ అమెరికా విప్లవానికి క్యూబా సైద్ధాంతిక, వ్యూహాత్మక ఉత్తేజమైంది. అదేసమయంలో, అసమ్మతి రూపంలో వ్యక్తీకరణ పొందుతున్న నూతనోత్తేజంపై అమెరికాస్‌లోని పలు పచ్చిమితవాద ప్రభుత్వాలు విరుచుకుపడ్డాయి. "మరో క్యూబాను నిరోధించటం" వాటి ఆశ.



విప్లవం తర్వాత కాస్ట్రో ప్రభుత్వం జాతీయకరణ కార్యక్రమం చేబట్టింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో మీడియా ఏర్పాటుచేసింది. రాజకీయ అధికారాన్ని పటిష్ఠం చేసుకుంది. దేశ ఆర్థిక వ్యవస్థను, పౌరసమాజాన్ని పరివర్తన గావించింది. క్యూబా జనాభాలోని సంపన్నులను, అమెరికాను దూరం పెట్టింది. ఈ ఆర్థిక పరివర్తనను సహించలేని క్యూబన్ సంపన్నులు అమెరికాకు వలసవెళ్లిపోయారు. విదేశాల్లో – ఆఫ్రికాలో, అమెరికాస్‌లో, ఆగ్నేయాసియాలో, మధ్యప్రాచ్యం వివాదాల్లో క్యూబా జోక్యానికి కూ డా విప్లవం నాంది పలికింది. క్యూబా విప్లవ ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ అమెరికా 1959–1965 మధ్య ప్రధానంగా ఎస్కాంబ్రె పర్వతాల్లో అనేక తిరుగుబాట్లు ప్రోత్సహించింది.

**చే గువేరా:** ఎర్నెస్టో చే గువేరా దోహదాలను ప్రస్తావించనిదే క్యూబన్ విప్లవగాథ సంపూర్ణం కాదు. చే 1928, జూన్ 14న జన్మించారు. క్యూబా విప్లవంలో, సోషలిజం నిర్మాణానికి అనంతరం జరిగిన కృషిలో చే కీలకమైన పాత్ర పోషించారు. మార్క్సిస్టు భావాలు జీర్ణించుకున్న చే గువేరా క్యూబా విప్లవానంతరం సోషలిజం దిశగా దేశాన్ని మరల్చటానికి నిర్దిష్టమైన విధానాలు అభివృద్ధి చేశారు. అమలు జరిపారు. అర్థవలస పరాధీనత నుంచి విముక్తి పొందిన క్యూబాను ఒక స్వతంత్ర రాజ్యంగా సోషలిస్టు శిబిరంలో సమైక్యం చేసేందుకు గాఢమైన వ్యవస్థాగత మార్పులు ప్రవేశపెట్టారు. మార్క్సిజానికి ఆయన విలక్షణమైన దోహదాలను – సోషలిస్టు పరివర్తన దశలో రాజకీయ అర్థశాస్త్రంపై ఆయన ప్రత్యేక దృష్టి, సోషలిస్టు నిర్మాణం ద్వారా "కొత్త మానవుణ్ణి" రూపొందించటానికున్న ప్రాముఖ్యత, ఆయన 'ఫొకో' థియరీ (పేద దేశాలకు విప్లవ వ్యూహం)లో చూడవచ్చు.

చే గువేరాలోని విప్లవోత్సాహం ఆయన్ను ఆఫ్రికా దేశం కాంగోకు తీసుకెళ్లింది. అక్కడ కార్యక్ర మం అంతిమంగా విఫలమై క్యూబా తిరిగి వచ్చారు. త్వరలోనే క్యూబా నుంచి బొలివియా వెళ్లారు. చే బోలీవియాలో ఉన్నట్లు తెలుసుకున్న బోలీవియా ప్రభుత్వం అతన్ని సజీవంగా లేదా శవంగా పట్టుకునేందుకు ప్రత్యేక ఆర్మీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌లో అమెరికన్ సిఐఎ కూడా బొలీవియాకు సహాయపడింది. చే, కొద్దిమం ది ఆయన అనుచరులు బొలీవియా నుంచి బయటకు వెళ్లబోతుండగా, సిఐఎ సహాయంతో బొలీవియా సైనిక యూనిట్ అడవిలో వారిని చుట్టుముట్టింది. చే బృందం సైన్యంతో తీవ్రంగా తలపడింది. కాల్పుల్లో చే గాయపడ్డారు. ఆయన తుపాకీ కూడా పనిచేయలేదు. బొలీవియా సైనికులు వారి సమీపానికి వచ్చారు. 1967 అక్టోబర్ 9న ఆయన్ను పట్టుకుని తుపాకీ తూటాలు దించారు. "పిరికి పందలారా! కాల్చండి.. మీరు మనిషిని మాత్రమే చంపగలరు". అవే చే గువేరా ప్రసిద్ధమైన చివరి మాటలు..

– కృష్ణ ఝా
అసోసియేట్ ఎడిటర్, న్యూఏజ్

# బంతి బిజెపి కోర్టులోకి..





## రాజధాని సందడి

– బొమ్మగాని కిరణ్‌కుమార్

ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి బంతి బిజెపి కోర్టులోకి చేరింది. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలుగంటున్న రాష్ట్ర బిజెపి నాయకులపై గురుతర బాధ్యత నిలబడింది. బిజెపి యేతర ప్రభుత్వం కొలువై ఉన్న తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్య అంశాలలో ప్రదర్శిస్తున్న వివక్ష. అందుకు తాజా ఉదాహరణ, మూడు రోజుల క్రితం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పూణె మెట్రో రైలు రెండవ దశకు ఆమోదముద్ర వేసి, ఎంతో కాలంగా రెండవ దశ విస్తరణ కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్ మెట్రోకు మాత్రం నిరాశ మిగల్చడమే. సుమారు కోటిన్నర జనాభా కలిగి, నిత్య వలసలతో మరింత పెరిగిపోతున్న హైదరాబాద్ మహానగర జనాభాలో సగాని కన్నా కొద్ది ఎక్కువ మంది ఉంటారు పూణెలో. దేశంలోని అత్యధిక జనాభా కలిగిన మొదటి పది నగరాలలో పూణె కంటే రెండు, మూడు స్థానాలలో హైదరాబాద్ ముందున్నది. అంతమాత్రాన పూణెలో మెట్రో విస్తరణకు అభ్యంతర పెట్టాల్సిన అవసరం లేదు. కానీ, హైదరాబాద్ నగరంపై ఎందుకు వివక్ష అనేది ప్రశ్న. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో ప్రముఖ నాయకుడిగా వెలుగొందిన పి.జనార్ధన్‌రెడ్డి(పిజెఆర్) పేరిట కొత్త ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు లేవనెత్తడం సమంజసమే. దేశంలోనే మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి వెళ్ళడం వెనుక బిజెపి వివక్ష లేదా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో సగం మంది ఎంపిలను బిజెపికి ఇచ్చిన తెలంగాణ ప్రజలకు ప్రధాని మోదీ ఏమిచ్చారో చెప్పాలని తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నేరుగానే అడిగారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎక్కడి రావడానికైనా సిద్ధమైనని కూడా ఆఫర్ చేశారు. దీంతో బంతి బిజెపి కోర్టులోకి వెళ్ళినట్లయింది. హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాలలోని లోక్‌సభ స్థానాలలో సికిందరాబాద్, చేవెళ్ళ, మల్కాజ్‌గిరిలో బిజెపినే గెలిచింది. వాటి పరిధిలోని మెట్రో విస్తరణను ఎందుకు చేపట్టడం లేదనే ప్రశ్న ఆ పార్టీ నేతలకు సహజంగానే ఎదురవుతుంది. దీనికి తోడు మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్ అనుమతులను గు రించి కూడా ప్ర స్తావించారు ము ఖ్యమంత్రి. ఇవన్నీ బిజెపిని ఇరుకునపెట్టేవే. రాష్ట్రానికి రొటీన్‌గా దక్కాల్సిన నిధులే తప్ప బిజెపి ఎం పిలు అదనంగా చెప్పుకో దగ్గ ఘనతను రాష్ట్రానికి ఏమి సాధించారని ప్రజల మదిలో కూడా మెదులుతుంది. అంతేగాక, తెలంగాణకు కొత్త రైల్వే లైన్‌లు పదకొండేళ్ళలో పెద్దగా దక్కిందేమి లేదు. ఇదే కాదు, విమానాశ్రయాల విషయం లో కూడా అడుగు ముందుకు పడడం లేదనే మాటలూ వినవస్తున్నాయి. మరీ ముఖ్యంగా పొరుగున ఎన్‌డిఏ ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ వైపు అన్ని రకాలుగా మొగ్గు చూపుతూ, తెలంగాణ పట్ల నిర్దయగా వ్యవహరించడం ప్రజల దృష్టికి చేరకపోదు.

### బుల్లెట్ రైలుపైనే మక్కువ

ఇదే సమయంలో సంపన్నులకు ఉపయోగపడే బుల్లెట్ రైలుపై కేంద్ర ప్రభుత్వం మక్కువ ప్రదర్శించడం కూడా చర్చనీయాంశమైంది. ఇటీవల ఆర్‌టిఐ యాక్టివిస్టు, సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ బుల్లెట్ రైలుకు సంబంధించి ఆర్‌టిఐ దరఖాస్తు చేసుకోవడం ద్వారా లభించిన సమాచారంలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. ముంబాయి నుంచి అహ్మదాబాద్ నగరాల నడుమ బుల్లెట్ రైలు నడపడం కోసం రూ.1.08 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. నాలుగేళ్ళలో పూర్తి చేస్తామని 2017లో శంకుస్థాపన చేసిన బుల్లెట్ రైల్వే లైనుకు ఇప్పటి వరకు రూ.69,495 కోట్లు విడుదల చేయగా,గుజరాత్ ప్రభుత్వం రూ.5వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దీనిని చేపట్టిన నేషనల్ హైస్పీడ్ రైల్వే కార్పొరేషన్ డిపిఆర్ లేకుండానే కేవలం ఫీజిబులిటీ రిపోర్టు (సాధ్యాసాధ్యాల నివేదిక) ఆధారంగానే దీనిని మొదలెట్టిందని చెబుతున్నారు రవికుమార్. బుల్లెట్ రైలు సాధ్యాసాధ్యాల నివేదిక ప్రకారం ముంబాయి–సూరత్–వడోదర–అహ్మదాబాద్ మధ్య విమానాల్లో రోజుకు 8170 మంది ప్రయాణికులు, రైలు మొదటి, రెండవ తరగతుల ఎసిలో 679, బెంజి బస్సుల్లో 782 మంది ప్రయాణించే సౌకర్యం ఉన్నది. అంటే మొత్తంగా 9631 నిత్యం రాకపోకలు చేస్తారు. కాగా, బుల్లెట్ రైలు కోసం 1.05 లక్షల కోట్లు కేటాయించగా, పూర్తయ్యే నాటికి వ్యయం రూ.1.50 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ఇది పూర్తయ్యేనాటికి 20 వేలు, 2050 నాటికి 50 వేల మంది ప్రయాణం చేయవచ్చునని అంచనా. ఇందులో ప్రయాణం సామాన్యులకు సాధ్యం కాదు. అలాంటి వారికి ఉపయోగపడే మెట్రో రైలు విషయంలో, అదీ ప్రత్యేకించి హైదరాబాద్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందనే వాదనను తప్పని నిరూపించే సదవకాశం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రం నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిల చేతుల్లో ఉంది. వారి స్పందన ఎలా ఉంటుంతో కాలమే చెప్పాలి.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆవును చంపిందన్న కోపంతో పులిపై విషప్రయోగం..



**న్యూఢిల్లీ :** కర్ణాటక-కేరళ సరిహద్దుల్లో ఐదు పులులు మరణించాయి. మలై మహదేశ్వర వైల్ లైఫ్ డివిజన్‌లో తల్లి పులి, నాలుగు కూనలు మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయం వెల్లడైంది. ఆవును పులి చంపిందన్న కోపంతో ఓ వ్యక్తి పులికి విషం పెట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ముదురాజు అనే వ్యక్తికి చెందిన ఆవును ఇటీవలే పులి వేటాడి చంపింది. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న ఆవును పులి చంపడంతో ముదురాజు కోపంతో రగిలిపోయాడు. ఎలాగైనా పులి పని పట్టాలని పథకం వేశాడు. మరో ఇద్దరితో కలిసి చనిపోయిన తన ఆవు కళేబరంలో విషం చల్లి.. పులికి ఎర వేశాడు. విషం పెట్టిన ఆవు కళేబరాన్ని తిని పులి, దాని నాలుగు కూనలు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముదురాజుతోపాటు ఆయనకు సహరించిన నాగరాజు, కోనప్పని పోలీసులు అరెస్ట్ చేశారు.

## న్యాయవిద్యార్థి అనికేత్‌ను
# తక్షణమే విడుదల చేయండి

సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ
బేతుల్ జిల్లా మెజిస్ట్రేట్ జారీచేసిన డిటెన్షన్ ఆదేశాన్ని తప్పుపట్టిన 'సుప్రీమ్'

**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లో ఒక న్యాయవిద్యార్థిని జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేసిన తర్వాత నిర్బంధించడంపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది 'పూర్తిగా సమర్థించలేనిది' అని వ్యాఖ్యానించింది. న్యాయవిద్యార్థి అన్ను అలియాస్ అనికేత్‌ను తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్ విచారణ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా మెజిస్ట్రేట్ 2024 సంవత్సరం జులై 11న జారీ చేసిన డిటెన్షన్ ఆర్డర్‌ను తప్పుపట్టింది. ఈ కేసులో వివరణాత్మక సహేతుకమైన ఆదేశాన్ని జారీ చేసింది. పిటిషనర్ అన్ను బెతుల్‌లోని యూనివర్సిటీ క్యాంపస్ వద్ద ఒకరితో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు అయ్యింది. అన్ను ఒక ప్రొఫెసర్‌తో ఘర్షణకు దిగారని ఆరోపణలను ఎదుర్కొన్నాడు. అన్నుకు వ్యతిరేకంగాఎఫ్ఐఆర్‌లో ఆయనపై హత్యానేరం, ఇతర సంబంధిత నేరాలు నమోదయ్యాయి. ఆయన జైలులో ఉన్న సమయంలో జాతీయ భద్రతా చట్టం కింద ఒక డిటెన్షన్ ఆర్డర్ జారీ అయింది. ఆ తర్వాత ఆ ఆర్డర్ ధృవీకరించబడింది. అప్పటినుంచి ప్రతీ మూడు నెలలకు ఒకసారి అన్ను డిటెన్షన్ పొడిగించబడింది. '2024 జులై 11 నాటి నుంచి మొదటి డిటెన్షన్ ఆర్డర్‌ను పరిశీలించిన అనంతరం అప్పీలెంట్‌ను 1980జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3(2) కింద ప్రివెంటివ్ డిటెన్షన్‌లోకి తీసుకున్న విషయాన్ని మేం కనుగొన్నాం. కాగా1980జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (2) అవసరాలు సంతృప్తిపర్చేలా లేవన్న అభిప్రాయానికి వచ్చాం. అందువల్ల అప్పీలెంట్ ప్రివెంటివ్ డిటెన్షన్ పూర్తిగా సమర్థించలేనిది' అని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఆదేశం జారీచేసింది. ఏ ఇతర కారణాల పరంగా చూసినా న్యాయవిద్యార్థి ప్రివెంటివ్ డిటెన్షన్ సమర్థనీయంగా లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అప్పీలెంట్ అయిన న్యాయవిద్యార్థి అన్ను ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా తనకు తాను నిర్ణయించడం, ఇతర క్రిమినల్ కేసులలో అప్పీలెంట్ నిర్బంధం వాస్తవపరిస్థితులను పరిగణనలోనికి తీసుకోకపోవడం,అతడిని రెగ్యులర్ క్రిమినల్ ప్రొసీడింగ్‌లో నిర్బంధించడానికి బదులు ప్రివెంటివ్ డిటెన్షన్‌లోకి ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందనేవి ఏమాత్రం ఆలోచించలేదని ధర్మాసనం పేర్కొంది. 'కాబట్టి కేసు వాస్తవాలు పరిశీలిస్తే ప్రస్తుతం భోపాల్‌లోని సెంట్రల్ జైలులో ఉన్న అప్పీలెంట్ మరే ఇతర క్రిమినల్ కేసులలో అవసరం లేకపోతే వెంటనే కస్టడీ నుంచి విడుదల చేయాలని మేం ఆదేశిస్తున్నాం. పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని క్రిమినల్ అప్పీల్‌ను పరిష్కరించబడుతుంది. సహేతుకమైన ఉత్తర్వును అనుసరిస్తుంది' అని ధర్మాసనం తెలిపింది. న్యాయవిద్యార్థి అయిన అన్ను అలియాస్ అనికేత్‌ను 2024 జులై 11న జారీచేసిన మొదటి ప్రివెంటివ్ డిటెన్షన్ ఆర్డర్‌ను పరిగణనలోనికి తీసుకున్నారని, ఆ తర్వాత ఈ డిటెన్షన్ ఆర్డర్‌ను నాలుగుసార్లు పొడిగించారని, చివరి పొడిగింపు ఉత్తర్వు ప్రకారం అతగి పొడిగింపు ఉత్తర్వు 2025 జులై 12న ఉన్నదని ధర్మాసనం తెలియజేసింది. జాతీయ భద్రతా చట్టం 1980లోని నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఆన్‌రికార్డు మెటీరియల్ లో ప్రస్తుత క్రిమినల్ కేసు సహా 9 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ప్రివెంటివ్ డిటెన్షన్ సమర్థించడానికి చట్ట విరుద్ధంగా ఉదహరించారని కోర్టు కనుగొన్నదని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుత క్రిమినల్ కేసు న్యాయవిద్యార్థి అన్నుపై గత సంవత్సరం మోపబడిందని, అయితే అతనికి 2025 జనవ రి 28న బెయిల్ మంజూరైందని అత్యున్నత న్యాయస్థానం గమనించింది. ఫిబ్రవరి 25న అన్ను తండ్రి దా ఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు రద్దుచేసింది. పిటిషనర్ చాలా కాలంగా అనేక క్రిమినల్ కేసులలో నేరచరితను కలిగి ఉన్నాడని, ప్రజాశాంతికి భంగం కలిగించే అలవాటుగా మారిన నేరస్థుడని హైకోర్టు అతడి హెబియస్ కార్పస్ పిటిషన్‌ను రద్దు చేయడానికి గల కారణమని తెలిపింది.



## 'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

జూలై 1న పదవీ బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ :** రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) కొత్త చీఫ్‌గా పంజాబ్ క్యాడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పాటు పదవీకాలంలో కొనసాగుతారు. ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుంది. దీంతో జూలై 1న పరాగ్ జైన్ కొత్త చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు. పస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ (ఎఆర్‌సి) అధిపతిగా సేవలందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో జైన్ కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్ మిలటరీ కదలికలు, ఉగ్ర స్థావరాలు వంటి కీలక ఇంటెలిజెన్స్ సమాచారం సేకరణలో ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. పంజాబ్ క్యాడర్ 1989 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన పరాగ్ జైన్‌కు వ్యూహాత్మక ఇంటెలిజెన్స్ వర్క్, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్‌లో విశేషానుభవం ఉంది. ప్రస్తుతం 'రా'లో ఆయన రెండవ మోస్ట్ సీనియర్‌గా ఉన్నారు. 'రా'లో 15 ఏళ్లుగా అంకిత సేవలందిస్తూ.. భారతదేశ కౌంటర్ టెర్రరిజం ఆర్కిటెక్చర్‌గా కీలక భూమిక పోషిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్‌లో సైతం పరాగ్ తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. దీనికి ముందు చండీగఢ్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా కూడా పని చేశారు. గ్లోబల్ ఇంటెలిజెన్స్ అనుభవం కూడా జైన్‌కు విశేషంగా ఉంది. కెనడాలోని అట్టావాలో ర్యాడికల్ సిక్కు వేర్పాటువాద నెట్‌వర్క్‌ను ట్రాక్ చేయడంలోనూ కీలక పాత్ర పోషించారు. శ్రీలంకలోనూ దౌత్య ప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.


## బిహార్ ఓటరు జాబితాలో ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం

భారత పౌరులు మాత్రమే ఓటు వేయవచ్చు : ఇసి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ప్రారంభమైందని, భారత పౌరులు మాత్రమే ఓటు వేయవచ్చని చెప్పే రాజ్యాంగ నిబంధనను గుర్తుచేస్తుందని ఎన్నికల సంఘం శనివారం తెలిపింది. భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని, అన్ని పౌరులు, రాజకీయ పార్టీలు, భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగాన్ని అనుసరిస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ ఇంటెన్సివ్ సవరణ వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించడంతో ఇసి స్పందించింది. ఆర్టికల్ 326 ఓటరుగా మారడానికి అర్హతను నిర్దేశిస్తుందని, 18 ఏళ్లు పైబడిన భారతీయ పౌరులు, ఆ నియోజకవర్గంలో నివసించే సాధారణ నివాసితులు మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండటానికి అర్హులు అని పోల్ అథారిటీ గుర్తు చేసింది. ఈ ప్రక్రియ రాష్ట్ర యంత్రాంగాన్ని ఉపయోగించి ఓటర్లను ఉద్దేశపూర్వకంగా మినహాయించే ప్రమాదాన్ని పొంచి ఉందని అనేక ప్రతిపక్ష పార్టీలు పేర్కొన్నాయి. బిహార్‌తో ప్రారంభమయ్యే ఆరు రాష్ట్రాల్లో విదేశీ అక్రమ వలసదారులను వారి జన్మస్థలాన్ని తనిఖీ చేయడం ద్వారా తొలగించడానికి పోల్ అథారిటీ ఈ సంవత్సరం ఓటర్ల జాబితాలను ఇంటెన్సివ్ సమీక్ష నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం బిహార్‌లో ఎన్నికలు జరగనుండగా, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సహా అక్రమ విదేశీ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, తరువాత ఇతర రాష్ట్రాలకు విస్తరించనున్న ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది. అన్ని రాజకీయ పార్టీల 'పూర్తి భాగస్వామ్యం'తో ప్రతి ఓటరు అర్హతను ధృవీకరించడానికి బిహార్‌లో ప్రత్యేక సవరణ ఇప్పటికేవిజయవంతంగా ప్రారంభమైందని ఇసి తెలిపింది. పోల్ ప్యానెల్‌లో ఇప్పటికే దాదాపు 78,000 మంది బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) ఉన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల కోసం 20,000 మందికి పైగా నియమిస్తున్నట్లు ఇసి తెలిపింది. స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ సమయంలో లక్ష మందికి పైగా వలంటీర్లు నిజమైన ఓటర్లకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, వికలాంగులు, పేదలు, ఇతర దుర్బల వర్గాలకు సహాయం చేయనున్నారు. అన్ని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు ఇప్పటికే 1,54,977 మంది బూత్ స్థాయి ఏజెంట్లను (బిఎల్ఎలు) నియమించాయి. బిఎల్ఎలు పార్టీ కార్యకర్తలు, ఓటర్ల జాబితా సవరణ లేదా బోరొటేషన్ సమయంలో బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటారు. బిహార్‌లోని 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రతి నియోజకవర్గంలో 7,89,69,844 మంది ఓటర్లకు కొత్త గణన ఫారమ్‌ల ముద్రణ, ఇంటింటికీ పంపిణీ ఇప్పటికే ప్రారంభమైందని ఇసి తెలిపింది.

## గుండిచాకు చేరిన పూరి జగన్నాథ రథయాత్ర



**పూరి :** ఒడిశాలోని పూరిలో జగన్నాథ రథయాత్ర కొనసాగుతోంది. శనివారం బలభద్రుడు, దేవి సుభద్ర, జగన్నాథుడి రథాలు గుండిచా ఆలయానికి చేరుకున్నాయి. 2.6 కి.మీ దూరంలో ఉన్న 12వ శతాబ్దపు జగన్నాథ ఆలయం నుండి బయలుదేరిన తర్వాత ప్రతి సంవత్సరం గుండిచాకు వెళ్తారు. ఈ ఆలయం దేవతల అత్తగారి స్థలంగా పరిగణించబడుతుంది. కాగా, తొమ్మిది రోజుల తర్వాత వారు ప్రధాన ఆలయానికి తిరిగి వెళ్తారు. 'బహుద యాత్ర' అని పిలువబడే తిరుగు ప్రయాణం ఈ సంవత్సరం జూలై 5న జరుగుతుంది. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం 'జై జగన్నాథ్', 'హరి బోల్' మంత్రాల మధ్య భక్తులు మూడు రథాలను లాగడం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం నాటికి రథాలు గుండిచా ఆలయానికి చేరుకోవాల్సి ఉంది. కానీ బలభద్రుడి తలద్వాజ రథం మలుపు తిరుగుతున్నప్పుడు ఇరుక్కుపోయి, మిగిలిన రెండు ముందుకు సాగకుండా నిరోధించడంతో వాటిని గ్రాండ్ రోడ్‌లో ఆపాల్సి వచ్చింది. సాంప్రదాయం ప్రకారం, ముందుగా 'తలద్వాజ' ప్రదక్షిణలు చేస్తారు, తరువాత దేవి సుభద్ర 'దర్పదాలన్', జగన్నాథుని 'నందిఘోష' చేస్తారు. దేవతలతో కూడిన రథాలను రాత్రంతా గట్టి భద్రత మధ్య రోడ్డుపైనే ఉంచారు. పట్టణంలో రాత్రంతా గడిపిన వేలాది మంది భక్తులు, గోంగూరాలు, శంఖాల శబ్దాల మధ్య రథం లాగడంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయశాఖమంత్రి పృథివీరాజ్ హరిచందన్, ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, డిజిపి వైబి ఖురానియా, ఇతర సీనియర్ అధికారులు జగన్నాథుని 'నందిఘోష'ను లాగుతూ కనిపించారు. రథాలు గమ్య స్థానానికి చేరుకున్న తర్వాత, వాటిని గుండిచా ఆలయం వెలుపల నిలిపి ఉంచారు. ఆదివారం ఉత్సవ ఊరేగింపుతో దేవతలను ఆలయం లోపలికి తీసుకువెళతారు. రథయాత్ర నిర్వహించినందుకు భక్తులతో సహా ఇతరులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన ప్రధాన నిర్వాహకుడు అరబింద పాధీ తెలిపారు. అయితే రథాల భద్రత, జనసమూహాన్ని నియంత్రించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిజిపి వైబి ఖురానియా తెలిపారు. శనివారం రథయాత్ర సందర్భంగా అస్వస్థతకు గురైన 600 మందికి పైగా భక్తులు పూరీలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందారు. వారిలో చాలా మంది తోపుడు కారణంగా గాయపడగా, 200 మందికి పైగా వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితుల్లో స్పృహ కోల్పోయారు. శుక్రవారం వార్షిక రథయాత్రలో పది లక్షల మంది భక్తులు పాల్గొన్నారని, శనివారం పవిత్ర పట్టణంలో దాదాపు 5 లక్షల మంది ఉన్నారని, తేలికపాటి వర్షం ఉన్నప్పటికీ శనివారం వాతావరణం అనుకూలంగా ఉందని అధికారులు తెలిపారు. ఒడిశా పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళం, ఎన్ఎస్‌జి, ఇతరులకు చెందిన దాదాపు 10,000 మంది సిబ్బందిని మోహరించడంతో పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య రథయాత్ర జరుగుతోంది. రథయాత్ర సజావుగా సాగడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారని, జనసమూహంపై నిఘా ఉంచడానికి 275కి పైగా ఎఐ ఎనేబుల్డ్ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు.

## కాల్పుల విరమణకు చేరువలో గాజా

అయినా ఇజ్రాయెల్ దాడి 49 మంది మృతి

**డైర్ అల్ బలాహ్ :** వచ్చేవారం కాల్పుల విరమణ జరిగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన తరుణంలో కూడా గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ ఆగలేదు. శనివారంనాడు జరిగిన తాజా దాడుల్లో 49 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు ప్రతిరోజూ అమాయకులైన పాలస్తినా ప్రజలను ఇజ్రాయెల్ సైనిక దళాలు కాల్చి చంపుతున్నాయి. ఆహార సహాయ కేంద్రాలవద్ద ఆకలితో ఆహారం కోసం వేచి ఉన్న ప్రజా సమూహాలనే అనేక వారాలుగా ప్రతిరోజూ ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరుపుతూ సగటున 15 మందిని పొట్టన పెట్టుకుంటున్నది. ఆహార కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలపై కాల్పులు జరపాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు ఉన్నట్లు కొందరు ఐ డి ఎఫ్ సైనికులు అంగీకరించారు. ఒక ఇంటర్వ్యూలో వారు ఈ విషయం అంగీకరించారు. మార్చి రెండో తేదీ నుండీ గాజాలోకి ఆహార సరఫరాలను ఐ డి ఎఫ్ నిలిపివేసింది. అప్పటి నుండీ లక్షలమంది ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారు. కాల్పుల్లో మరణిస్తున్నారు. ప్రపంచ దే శాల ఒత్తిడి మేరకు నెలరోజులుగా పరిమితంగా గా జా ప్రజలకు ఆహార సరఫరా చేస్తున్నారు.ఆహార సరఫరా కేంద్రాల సంఖ్యను కూడా ఇప్పుడు తగ్గించేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతిదాడి 13 మంది మృతి



**పెషావర్ :** పాకిస్థాన్‌లో అంతర్గత వేర్పాటువాద తిరుగుబాటు జరుగుతున్న ఖైబర్ పఖ్తూంఖ్వాలో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 13 మంది మరణించారు. ఉత్తర వజిరిస్థాన్ జిల్లా ఖద్దీ ప్రాంతంలో శనివారం ఉదయం బాంబ్ డిస్పోజల్ యూనిట్‌కు చెందిన అంత్యశక్తిమంతమైన గనుల్లో ఉపయోగిం చే వాహనాన్ని ఆత్మాహుతి బాంబు ఢీకొట్టింది. ఆత్మాహుతికి సిద్ధపడిన వ్యక్తి పేలుడు పదార్థాలున్న వాహనంతో వేగంగా వచ్చి బాంబ్ డిస్పోజనల్ యూనిట్ వాహనాన్ని ఢీకొట్టడంతో భారీ విస్ఫోటనం జరిగిం ది. ఈ పేలుడుతో 24 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో సాధారణ మహిళలు, పిల్లలు ఉన్నారు. వీరిలో చాలామంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.



### వివాహ ప్రతిపాదన తిరస్కారంతో...
## సామూహిక అత్యాచారం

కోల్‌కతాలోని లా కాలేజీ విద్యార్థిని కేసులో పోలీసుల అనుమానం

**కోల్‌కతా :** కోల్‌కతాలోని లా కాలేజీ విద్యార్థిని కేసులో పోలీసులు ఘటన తీరును వివరించారు. ప్రధాన నిందితుడి వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో ఆమెపై తీవ్ర ఆగ్రహంతోనే సామూహిక అత్యాచారం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నట్లు ఓ అధికారి శనివారం తెలిపారు. ఈ నేరం మొత్తం ముందస్తు ప్రణాళికతో జరిగిందా లేదా అని తెలుసుకోవడానికి కూడా పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. బాధితురాలి వద్ద ప్రధాన నిందితుడి వివాహ ప్రతిపాదనను తీసుకురాగా, అందుకు ఆమె తిరిస్కంచినట్లు తెలుస్తుందని, దీంతో ప్రతీకారం పెంచుకున్న నిందితుడు బాధితురాలుపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లుగా కనిపిస్తుందన్నారు. అయితే ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన నేరమా లేదా అకస్మాత్తుగా జరిగిందా అనేది నిరూపించాల్సిన అవసరం ఉందని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. ఆ మహిళ తనకు ఒక బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని, అతనితో సంతోషంగా ఉన్నానని, అతన్ని మోసం చేయనని ముగ్గురు నిందితులకు వివరించిందన్నారు. ఆ ముగ్గురూ తన ప్రియుడిని చంపేస్తామని, ప్రధాన నిందితుడిని ప్రతిఘటించడం కొనసాగిస్తే ఆమె తల్లిదండ్రులపై తప్పుడు కేసులు నమోదు చేస్తామని బెదిరించారని ఆమె ఆరోపించిందన్నారు. 'ప్రతి కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ముగ్గురు నిందితులు, బాధితురాలి కాల్ వివరాలను కూడా పరిశీలిస్తున్నాము' అని ఆ అధికారి పేర్కొన్నారు. లా కాలేజీ విద్యార్థిని తనపై సామూహిక అత్యాచారం జరిగిందనే ఆరోపణను వైద్య పరీక్షల్లో ధృవీకరించారు. సౌత్ కలకత్తా లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జూన్ 25 సాయంత్రం ఆ సంస్థ లోపల ఒక పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్ విద్యార్థులు తనపై సామూహిక అత్యాచారం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

**సెక్యూరిటీ గార్డ్ అరెస్టు**

లా కాలేజీలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనలో శనివారం పోలీసులు సెక్యూరిటీ గార్డును అరెస్టు చేశారు. దీనితో, కళాశాల ఆవరణలోని గార్డు గదిలో జరిగిన ఘటనలో మొత్తం అరెస్టుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. విచారణ కోసం పోలీసులు అదుపులోకి తీసుకున్న గార్డును ఆ తరువాత అరెస్టు చేసినట్లు ఒక అధికారి తెలిపారు. 'సెక్యూరిటీ గార్డు సమాధానాలు అసంబద్ధంగా ఉన్నట్లు విచారణలో తేలగా అతన్ని శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారన్నారు. అతని వైఖరి కళాశాలలో ఏర్పాటు చేసిన సిసిటివిలో రికార్డయిందన్నారు. గార్డు తన విధిని నిర్వర్తించడంలో విఫలమయ్యాడని, ఆ సమయంలో అతను ఒంటరిగా విధుల్లో ఉన్నాడా లేదా అని తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని అధికారి తెలిపారు. అత్యాచారం కేసులో ముగ్గురు నిందితులను నేరం చేయకుండా ఆపడానికి గార్డు తన సమాధానాలతో విభేదిస్తున్నాడని, అలాగే, అతను తన గది నుండి ఎందుకు, ఎవరి సూచనల మేరకు బయటకు వెళ్లాడనే దానిపై సమాధానం చెప్పాలని, ఇది కూడా నేరంలో ఒక రకమైన ప్రమేయం' అని అధికారి తెలిపారు.

**మరో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేశారు.**

**అత్యవసర చర్య తీసుకోండి : ఎన్‌సిడబ్ల్యు**

దక్షిణ కోల్‌కతా గ్యాంగ్ రేప్ కేసులో అత్యవసర చర్య తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్‌సిడబ్ల్యు లేఖ రాసింది. హక్కుల సంఘం సభ్యులు, బాధితారులు, ఆమె కుటుంబ సభ్యుల మధ్య బేటీకి రాష్ట్ర పోలీసుల సహకారం కావాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేసింది. ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ విజయ రహత్కర్ ఈ ఘటనను తీవ్రమైనదిగా అభివర్ణించారు. ఇది ప్రజల మనస్సాక్షిని కదిలించిందన్నారు. శుక్రవారం మహిళా హక్కుల ప్యానెల్ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. బాధితురాలి భద్రత, గౌరవం, శ్రేయస్సు పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధితురాలి, ఆమె కుటుంబాన్ని కలవడానికి నియమించిన ఎన్‌సిడబ్ల్యు సభ్యురాలు అర్చన ముజుందార్‌తో రాష్ట్ర పోలీసులు పూర్తిగా సహకరించాలని రహత్కర్ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఆదేశించారు.

బాధితురాలి తక్షణ, గోప్యమైన అంతర్గత వైద్య పరీక్షను కూడా కమిషన్ కోరింది. మూడు రోజుల్లోగా ఎన్‌సిడబ్ల్యుకి అంతర్గత, బాహ్య వైద్య నివేదికలను సమర్పించాలని కోరింది. అంతే కాకుండా, బాధితురాలు, ఆమె కుటుంబానికి పటిష్ట భద్రత కల్పించాలని కమిషన్ రాష్ట్రాన్ని కోరింది.


WARANGAL URBAN CO-OPERATIVE BANK LTD.,
WARANGAL
BALANCE SHEET AS ON 31ST MARCH 2025
Form 'A'

| | Schedule | As on 31.03.2025 | As on 31.03.2024 |
|---|---|---|---|
| I. Capital & Liabilities | | | |
| Capital | 1 | 5,06,92,065.00 | 4,65,93,275.00 |
| Reserves & Surplus | 2 | 20,95,06,927.00 | 18,55,05,772.96 |
| Deposits | 3 | 2,19,02,49,371.88 | 1,91,55,40,383.33 |
| Borrowings | 4 | - | - |
| Other Liabilities & Provisions | 5 | 3,26,54,405.80 | 3,67,22,317.41 |
| | Total | 2,48,31,02,769.68 | 2,18,43,61,748.70 |
| II. Assets | | | |
| Cash bank & Balance with RBI | 6 | 6,67,16,004.00 | 6,80,31,513.00 |
| Balance with Banks & Money at Call & Short notice | 7 | 31,99,70,905.98 | 27,54,71,629.79 |
| Investments | 8 | 45,12,56,303.00 | 41,17,19,748.00 |
| Advances | 9 | 1,54,12,17,763.12 | 1,36,16,72,083.40 |
| Fixed Assets | 10 | 4,03,24,718.35 | 1,56,75,879.40 |
| Other Assets | 11 | 6,36,17,075.23 | 5,17,90,895.11 |
| | Total | 2,48,31,02,769.68 | 2,18,43,61,748.70 |
| Contingent Liabilities | 12 | | |
| Bank Guarantees | | 65,92,500.00 | 63,62,500.00 |
| Bills for Collection DEAF A/c with RBI | | 8,32,383.61 | 8,30,905.71 |
| Significant Accounting Policies | 18 | | |
| Notes to Accounts | 19 | | |

The Schedules referred to above form an integral part of the accounts.

PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31st MARCH 2025
Form 'B'

| | Schedule | As on 31.03.2025 | As on 31.03.2024 |
|---|---|---|---|
| I Income | | | |
| Interest earned | 13 | 22,86,51,619.96 | 20,85,92,083.21 |
| Other Income | 14 | 1,13,22,326.50 | 70,49,987.03 |
| | Total | 23,99,73,946.46 | 21,56,42,070.24 |
| II Expenditure | | | |
| Interest Expended | 15 | 14,56,89,723.56 | 12,52,93,260.04 |
| Operating Expenses | 16 | 6,30,78,329.47 | 5,40,39,073.21 |
| Provisions & contingencies & Write off | 17 | 89,51,849.89 | 1,26,59,750.10 |
| | Total | 21,77,19,902.92 | 19,19,92,083.35 |
| III. Profit/Loss | | | |
| Net Profit/Loss (-) for the year | | 2,22,54,043.54 | 2,36,49,986.89 |
| Profit/Loss (-) brought forward | | 2,36,49,992.89 | 2,68,47,084.52 |
| | Total | 4,59,04,036.43 | 5,04,97,071.41 |
| IV. Appropriations | | | |
| Transfer to statutory reserves | | 1,09,89,027.89 | 1,20,81,181.00 |
| Transfer to other reserves | | 70,94,997.00 | 1,47,65,897.52 |
| Transfer to proposed dividend | | 55,65,962.00 | - |
| Balance carried over to balance sheet | | 2,22,54,049.54 | 2,36,49,992.89 |
| | Total | 4,59,04,036.43 | 5,04,97,071.41 |

Significant Accounting Policies and Notes to accounts,
The Schedules referred to above form an integral part of the accounts.

Sd/-
P.V. Narayana Rao & Associates
(Statutory Auditor)

Sd/-
M. Satyanarayana Rao
(Chief Executive Officer(I/c))

## ఎసిబికి చిక్కిన ధరణి ఆపరేటర్ విజేతరెడ్డి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి జగదీష్ చందర్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన తోట రాంబాబు అనే రైతు పొలం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న అనంతరం తన వ్యవసాయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రొసిడెంట్ పేపర్స్ కోసం కార్యాలయానికి వెళ్లగా అక్కడ పనిచేస్తున్న భూభారతి ఆపరేటర్ విజేతరెడ్డి రూ.20వేలు లంచం అడగ్గ, రైతు రూ.12వేలకు ఒప్పందం చేసుకున్నారు. సదరు వ్యక్తి ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో ఏసిబి అధికారులు హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో మెరుపు దాడులు నిర్వహించడం జరిగింది. రైతు తోట రాంబాబు నుండి లంచం తీసుకుంటున్న భూభారతి ఆపరేటర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందని తెలిపారు.



## రూ.20 వేలు ఆర్థిక సాయం



ప్రజాపక్షం/మునుగోడు: మండలంలోని ఎలగలగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అశోక్, కచలాపురం గ్రామానికి చెందిన నీరుడు సత్తయ్యలు మృతి చెందారు. శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అశోక్,సత్తయ్యల మృతదేహాలపై పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎలగలగూడెం సిపిఐ గ్రామ శాఖ తరపున ఈదులకంటి అశోక్ కుటుంబ సభ్యులకు రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం , తీర్పారి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సురిగి చలపతి పాల్గొన్నారు.



## పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని డిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించి సామాజిక న్యాయం పాటించి ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి,మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

అదనపు కలెక్టర్ పి.రాంబాబు



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ రూమ్‌లో ఉన్న బియ్యం, అలాగే స్టాక్ రిజిస్టర్ వివరాలు పరిశీలించార. తదుపరి సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఉన్న టిజిఎస్‌డబ్ల్యూ ఆర్ ఈఐఎస్‌లో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపును సందర్శించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ జాగ్రత్తగా చేయాలని సూచించార. విద్యార్థులకు మద్యాహ్న భోజనంలో భాగంగా వండిన అన్నం నాణ్యత అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు నాగమణి, టిజిఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు యాదయ్య, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ శ్రీధర్, జడ్పిహెచ్‌ఎస్ జూనియర్ అసిస్టెంట్లు సోమలక్ష్మి , పాతిమా, సుల్తాన పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిష్కరించాలి




ప్రజాపక్షం/యాదాద్రి : భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిస్పోజల్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శనివారం భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును భూ భారతిలో నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు నోటీసు జారీ చేసి విచారణ చేసిన అనంతరం భూ సమస్య దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించి ఫైల్ ఎప్పటికపుడు డిస్పోజ్ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, భూ సంబంధిత సమస్యలు మార్పులు, చేర్పులు పాత రికార్డుల ఆధారంగానే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/మోటకొండూర్ : అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని, సిపిఐ శ్రేణులకు ప్రత్యేక కోటా కేటాయించి నిర్మాణానికి సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు కోరారు. శనివారం యాదగిరిగుట్ట నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి అంచెలంచెలుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పని చేసి అధిక స్థానాలు గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మోటకొండూర్ మండల కార్యదర్శి గాదెగాని మానిక్యం సిపిఐ కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, పల్లే వెంకన్న, నల్ల రాములు, నాయకులు బోలగాని అశోక్, మారబోయిన ఇమ్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారస్తుల పట్ల జాగ్రత్త

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : జిల్లాలో రైతులను, అమాయక ప్రజలను టార్గెట్ చేసుకొని కొందరు మోసగాళ్లు షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు అంటూ అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వడ్డీ ఆశకు పోతే అసలుకే ఎసరు అవుతుందని జిల్లాలో ఎవరైనా అమాయక ప్రజలను, రైతులను అధిక వడ్డీ ఇస్తామని మభ్యపెట్టీ వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది ప్రజలు ఇండ్ల భూములు, వ్యవసాయ భూములు, బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చి మరి అక్రమ వ్యాపారాలకు అధిక వడ్డీ ఆశకు డబ్బులు ఇస్తున్నారని వారు మొదటగా కొంత మొత్తంలో ఇస్తూ ఆశ చూపించి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వగానే మోసాలకు గురి చేస్తారని అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎవరైనా ఫైనాన్స్ వ్యాపారాలు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## చట్టం రైతు చుట్టం కావాలనే సంకల్పంతో

# సాగు న్యాయయాత్ర

వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**2400 కి.మీ యాత్రలో 800 గ్రామాలు పర్యటన 10వేల మంది రైతులను కలుస్తాం**



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : చట్టం రైతు చుట్టం కావాలనే సంకల్పంతో సాగు న్యాయయాత్ర చేస్తున్నట్లు, రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా భూభారతి చట్టం అమలు జరుగుతున్నట్లు భూ యజమానులు రైతులకు చట్టం పట్ల పూర్తి అవగాహన కల్పించేందుకు నడుం బిగించి యాత్ర చేస్తున్నట్లు వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలో టూరిజం పార్కులో ఆయన భూభారతి రూపకర్త వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్ తో కలిసి సాగు న్యాయ యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టూరిజం పార్కులోని భూదానోద్యమ పితామహుడు వినోబా భావే ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించి వినోబా మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ భూమి సునీల్ మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల భూ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే భూభారతి సృష్టికర్త భూమి సునిల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా బృహత్తర ప్రణాళికతో రూపొందించిన భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఉద్దేశంతో యాత్ర చేపడుతున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు.అక్టోబర్ నెల 2వ తేదీ వరకు సాగనున్న సాగు న్యాయ యాత్ర పేరిట భూమీ సునీల్ సారధ్యంలో లీఫ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఉన్న చట్టాలు ఉపయోగించుకునే విధానాలను రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అతి కీలక నిర్ణయాల్లో భూభారతి చట్టం ఒకటని చెప్పారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో తీసుకువచ్చిన చట్టం పూర్తిగా లోప బహిష్టంగా ఉందని రైతులే కాకుండా భూమి కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2400 కి మీ యాత్రలో 800 గ్రామాలు తిరిగి 10వేల మంది రైతులను కలిసి భూభారత్ చట్టాల వివరాలను వివరించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్, వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి లీఫ్ సంస్థ సభ్యులు అభిలాష్ రెడ్డి, జీవన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాక మల్లేష్ యాదవ్, మాజీ డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

**వ్యవసాయ చట్టాలపై అవగాహన సాగు న్యాయయాత్ర**

ప్రజాపక్షం/చౌటుప్పల్ : రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించడం కొరకే సాగు న్యాయాయాత్రను శనివారం భూదాన్ పోచంపల్లి లిప్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారభించామని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ చైర్మన్ ఎం.కోదండరాం, భూమి సునీల్‌తో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన భూమికి సాగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి ముత్యాలు, భువనగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికి రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి**

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : భూమిసాగు యాత్రలో భాగంగా తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, భూమి సునీల్‌తో కలిసి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూమి సాగుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర ఉద్దేశమని రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురంలోని 255 సర్వే నెంబర్లలో గత ప్రభుత్వం తమకు అసైన్డ్ పట్టాలను ఇచ్చారని ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల గ్రూపును ఉద్యోగం సాధించిన వ్యవసాయ శాఖ అధికారి వర్షిత్ రెడ్డిని వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు సెక్రెటరీ గోవింద్, ఓఎస్‌డి శ్రీహరి పాల్గొన్నారు.

# 2.784 కిలోల గంజాయిపట్టివేత

నలుగురు అరెస్టు : కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/కోదాడరూరల్: చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో పోలీసులు తనిఖీ చేసి 2.784 కిలోల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకుని, నలుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. చింతలపాలెం మండలంలోని గాంధీనగర్‌తండా ముడావత్ అశోక్, అదే మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్‌రెడ్డి, వేమల నాగరాజు, కేతావరపు సాయి లు అనే ఐదుగురు స్నేహితులు గత మూడు సంవత్సరాలుగా గంజాయికి బానిసలయ్యారు. వీరు తాగడంతో పాటు అక్రమంగా అధిక డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతరామరాజు జిల్లా సీలేరు గ్రామానికి ఈ నెల 21వ తేదీన వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి నుండి ఐదు కిలోల గంజాయిని, కిలో రూ.2500 చొప్పున వీరు కొనుగోలు చేశారు. ఇందులో ముడావత్ అశోక్ అలియాస్ భుక్య అశోక్ మూడు కేజీల గంజాయి, కేతావరపు సాయి రెండు కేజీలు కొనుగోలు చేశారు. ఈనెల 23వ తేదీని దొండపాడు గ్రామానికి వచ్చి వారు కొనుగోలు చేసిన గంజాయిని బొడ్డు బసవయ్య కాలనీలో ఉన్న మధిర లక్ష్మారెడ్డికి చెందిన ఇంటిఖాళీ స్థలంలో గాబు కింద దాచారు. తిరిగి వీరు ఉదయం అక్కడకు చేరుకుని పంచుకున్నారు. అదే సమయంలో స్పెషల్ టాస్క్‌పోర్సు, కోదాడ రూరల్ సిఐ రజితారెడ్డి , ఎస్‌ఐ సందీప్‌రెడ్డి లు తమ సిబ్బందితో వెళ్లి ముడావత్ అశోక్, కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్ రెడ్డి, వేముల నాగరాజు లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 2.784 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. దీని విలువ రూ.69600 ఉటుందని చెప్పారు. మరో నేరస్తుడు కేతావరపు సాయి రెండు కిలోల గంజాయితో పోలీసులకు దొరకకుండా పరారైనట్లు తెలిపారు. గంజాయితో పాటు స్కూటి, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి వారిని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ రజితారెడ్డి, ఎస్‌ఐ సందీప్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లింగరాజు, కానిస్టేబుల్ ఐనా భాస్కర్, అమృతయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సూర్యాపేటలో సుపారి గ్యాంగ్ హల్చల్

పట్టుకుని పోలీసులకు సమాచారం చేరవేత

అదుపులోకి తీసుకుని విచారణ

ఒకరిని హత్య చేసేందుకు స్కెచ్ వేసినట్లు బహిర్గతం




ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ సుపారి గ్యాంగ్ శుక్రవారం రాత్రి కారులో హల్చల్ చేసింది. మద్యాన్ని పీకలదాక సేవించి కారులో హల్చల్ చేస్తుండగా స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం చేరవేశారు. కారులో ఉన్న ఐదుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కారును తనిఖీ చేయడంతో కర్రలు, ఖాళీ బీరుసీసాలు దొరికాయి. అనంతరం విచారించగా మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన పచ్చారి వెంకటేశ్వర్లు పట్టణంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న మహేంద్ర ట్రాక్టర్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. నల్లగొండకు చెందిన వంగాల కిరణ్ గౌడ్ ఆ గ్రామంలో క్రషర్‌మిల్లు ఉంది. దాని పక్కనే వెంకటేశ్వర్లుకు మూడు ఎకరాల భూమి ఉండగా, దీని విషయంలో గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతుంది. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లును హత్య చేసేందుకు నార్కట్‌పల్లి మండలంలోని యల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడి శివప్రసాద్, బొడ్డుపల్లి స్వామి, బరిగెల శివశంకర్ అలియాస్ శివాజీ, మాదగిని రమేష్, చంద్ లకు లక్ష రూపాయలు ఇచ్చి సుపారి కుదర్చుకున్నాడు. ఈ క్రమంలోనే వారు కారులో సూర్యాపేటకు వచ్చినట్లు పోలీస్ విచారణలో తేలింది. ఇదే విషయాన్ని శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. విచారణ అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసును త్వరితగతిన చేధించిన పట్టణ ఎస్‌ఐ లు సైదులు, ఎం.ఆంజనేయులు లను అభినందించారు.

## చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవడానికి అవసరమయ్యే మాస్టర్ ప్లాన్ పై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన స్టేటస్‌ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, వాన నీటి కాలువలు, మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్లు, పార్కుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, నూతన మున్సిపల్ పరిపాలన భవనము, షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్మాణాల అభివృద్ధి తో పాటు సమగ్ర అభివృద్ధి పై ఫోకస్ పెట్టారు. వర్షాకాలంలో లక్కారం చెరువు నుండి వచ్చే వర్షపు వరద నీటి మళ్లింపు ఎటువైపు చేపట్టాలనే అంశంపై స్థానిక నాయకులు పలు సూచనలు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించిన తాగునీటి కేటాయింపుల ప్రకారం మాత్రమే ఇప్పటికీ తాగునీరు వస్తుందని, కానీ ఇటీవల గుణాత్మకంగా జనాభా పెరగడంతో ఆ త్రాగునీరు సరిపోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకొచ్చారు. ప్రస్తుతం లక్ష జనాభా నివసిస్తున్న చౌటుప్పల్ పట్టణానికి, అదేవిధంగా మరో 30 సంవత్సరాల భవిష్యత్తుకు సరిపడే విధంగా త్రాగునీరు అందించడానికి శివన్న గూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకురావడానికి డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని రాజ్ గోపాల్ రెడ్డి తెలిపారు. . ఈ సమీక్ష సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, డిఈ మనోరమ, చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నమన్వయ కమిటీ సమావేశం

ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి.ముక్తిదా, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వి.మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి యం.ఉ్రషీ, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు లక్ష్మి నారాయణ, చౌటుప్పల్ ఎసిపి మధుసూదన్ రెడ్డి, యాదగిరిగుట్ట, ఎసిపి శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కోర్టులో పెండింగులో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారం, నాన్ బెయిలబుల్ వారంట్ల తామీలు మొదలగు అంశాలపై చర్చించి తగిన సూచనలు చేశారు. తదుపరి భువనగిరిలోని సబ్ జైలును న్యాయమూర్తులు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు ఖైదీలతో ముఖాముఖి జరిపి న్యాయ సహాయంపై వారిని విచారించి, ఎవరికైనా న్యాయ సహాయం కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించి మాధక ద్రవ్య నిషేధ చట్టం క్రింద ఉన్న ముద్దాయిలను ఉద్దేశిస్తూ మాధక ద్రవ్యాలకు బానిసలుగా కావటం, వ్యాపారం చేయటం నేరమని, ఇట్టి నేరాలకు పాల్పడినవరు చట్టం నుండి తప్పించుకోలేరని తెలియచేసి, జైలులో వారికి కల్పిస్తున్న వసతులు, జైలులో ఏర్పాటుచేసిన ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును సమీక్షంచారు.



## ప్రభుత్వ పాఠశాలను ప్రభుత్వ విప్ ఆకస్మిక తనిఖీ

మధ్యాహ్న భోజన ప్రక్రియ సరిగ్గా లేదని ఇన్‌చార్జిపై మండిపాటు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాటశాలల్లో తనిఖీ చేస్తు, విద్యార్థులతో మాట్లాడుతున్న క్రమంలో తమకు వడ్డించే భోజనంలో కూరలు మంచిగా వండటం లేదని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే వంట మనుషులను, ఇంచార్జ్‌ను మందలించి విద్యార్థుల బోజనాల్లో నాణ్యతలు పాటించాలని మందలించారు. మధ్యాహ్న భోజనం ఇంచార్జి ఎవరు అని అడుగగా అక్కడకి వచ్చిన టీచర్‌ను బీర్ల అయిలయ్య కూరలు సరిగా లేవని మండిపడ్డ క్రమంలో, ఆ టీచర్ వినూత్నమైన రీతిలో, వేలు చుపుతూ ఎమ్మెల్యే కు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి, ఆ టీచర్ దురుసుగా మాట్లాడిందని మండిపడ్డారు. దురుసుగా మాట్లాడిన టీచర్ పై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్లాస్ రూమ్ లో విద్యార్థులతో మాట్లాడి టీచర్లు రెగ్యులర్‌గా వస్తున్నారా, చదువు ఎలా చెపుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఉపాధ్యాయులు తెలుపగా, సొంత నిధులతో వాటి మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులకు సూచించారు.

## బ్లూకోట్స్, కోర్టు డ్యూటీ విధులపై సిబ్బందికి శిక్షణ : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట: ప్రజా ఫిర్యాదులపై, సంఘటనలపై త్వరితగతిన స్పందించి బాధితులకు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ద్వారా పోలీస్‌శాఖపై మరింత నమ్మకం పెరుగుతుందని, సిబ్బంది పారదర్శకంగా పనిచేస్తూ జవాబుదారితనంగా ఉండాలని, అధికారులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్‌స్టేషన్ బ్లూకోట్స్ సిబ్బందికి, కోర్టు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ లో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీస్ పని విభాగాల నిర్వహణ, పనిలో సామార్థ్యం పెంపోందించడంలో భాగంగా సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. డయల్ 100 సమాచారాన్ని నేరుగా చేరవేయడం జరుగుతుందని, వెంటనే సంబంధిత బ్లూకోట్స్ సిబ్బంది త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకోవడం, అక్కడి పరిస్థితులను అధికారులకు చేరవేయడం చేయాలని అన్నారు. ఫిర్యాదుల నిర్వహణలో పారదర్శకంగా ఉండాలని, సమాచారాన్ని అనవసరంగా ఇతర వ్యక్తులకు ఎవ్వవద్దు అని అదేశించారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు దృష్టికి తేవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, బిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, ఐటికోర్ ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్, టెక్నికల్ సిబ్బంది, బ్లూకోట్స్, కోర్టు డ్యూటి సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ క్షేమమే ఆశయం

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా మనోపాడు మండలం అన్ని గ్రామాలలో నివసించే బాల బాలికలను మహిళ శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యం నుండి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ మాట్లాడుతూ బాల బాలికలు చిన్న వయసు నుండి లక్ష్యం పెట్టుకొని చదవాలని సూచించారు. ఆడపిల్లల పై సోదరాబావం తో ఉండాలని తెలిపారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ చట్టంలొ బాల బాలికలకు సమానమైన రక్షణ లభిస్తుంది. సమస్య లైంగిక వేధింపులు, కుటుంబ సభ్యులు, ఇతర వ్యక్తుల చేతుల్లో బాలలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. కాబట్టి ఎవరైనా మట్టుకన్నప్పుడు ఏది సురక్షితం ఏది ఆసురక్షతం అనే విషయం తెలుసుకోవాలి. బాలల ఎవరి నుంటైనా ఇలాంటి వేధింపులకు గురవుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 లేదా 1098 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి వారి పై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని చెప్పారు. అయితే ఇలా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీ కి లేదా 1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## నావంతు సహకారం అందిస్తా : ఆర్మూర్ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం /నందిపేట్:**శ్రీ వెంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణం కొరకు తన వంతు సహకారం అందిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో శనివారం ఆలయ పునరుద్ధరణకు శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యేను గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు.



కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటి, ఆలయ కమిటి, గ్రామస్తులు, బిజెపి నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

## ప్రతీ శనివారం విగ్రహాల శుభ్రత ; మంత్రి జూపల్లి పిలుపు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :**ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్మల్ పర్యటనలో కొన్ని ఆసక్తికరమైన,ఆలోచన కరమైన విషయాలతో ప్రసంగం కొనసాగింది.మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో,పట్టణాల్లో నెలకొల్పినా జాతీయ నాయకుల,స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు కేవలం ఉత్సవాల సమయంలో మాత్రమే కీర్తించబడుతున్నాయని మిగతా సమయాల్లో వాటిని ఎవరు శుభ్రం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశా రు.ఇకపై ప్రతి శనివారం విగ్రహాలను శుభ్రపరిచి నుదిటిన బొట్టు పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ విషయంపై స్పందించిన దిలావర్పూర్ మండల కాల్వ గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే అమలు చేసారు.





## వంట కార్మికులకు పనిభద్రత కల్పించాలి

### ఎండిఎం జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** పంట కార్మికులకు పనిభద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు అన్నారు. జూలై 9న నిర్వహించే సమ్మె నోటీసు డీఈఓకు అందజేశారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ ఎండిఎం కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పిస్తూ వారికి గ్రాట్యుటీ, పెన్షన్, ఇయస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ప్రైవేటు సంస్థలకు ఇవ్వరాదని ప్రతి పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వంట కార్మికులకు పెన్షన్ రూ 9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు రాంబాయి, శశికల, శ్రీదేవి, పుష్ప పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:**దిలావర్‌పూర్ మండలంలోని గ్రామంలో శనివారం వారం అయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఉద్యాన,పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో,ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఈ కొనుగోళ్లు జరిగాయి.కంపెనీ ఏరియా మేనేజర్ ఆడెపు శేఖర్,కలెక్షన్ మేనేజర్ అడేపు శేఖర్,కలెక్షన్ సెంటర్ ఇన్‌చార్జ్ ప్రశాంత్ పర్యవేక్షించారు.ఆయిల్ ఫామ్ గెలలను రైతుల ట్రాక్టర్ల నుండి నేరుగా లారీల్లోకి డంప్ చేసుకున్నారు.ప్రస్తుతం ఆయిల్ ఫామ్ ధర టన్నుకు 18.500 పలుకుతోంది.ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. కొత్తగా ఆయిల్ ఫామ్ సాగు చేయాలనుకునే రైతులకు ప్రభు త్వ ం రాయితీలు అందిస్తోంది.ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఎకో టూరిజం పాయింట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం /నందిపేట్ ;**డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి చిన్నయానం గ్రామాలలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఏకో టూరిజం పాయింట్‌ను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరిశీలించారు. అనువైన స్థలాన్ని అటవీశాఖ అధికారులు ఆయన చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ హోటల్, రిసార్ట్‌లను నిర్మిస్తారో అటవీశాఖ అధికారులను అడిగారు. పర్యాటకులకు ఇబ్బంది కాకుండా చూడాలన్నారు. వీటి నిర్మాణానికి నిధులు ఉన్నాయని, మూడు వాహనాలు మంజూరు చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటి ఉన్నారు.

## గ్రూప్ బి,సి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచన

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్:**కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల గ్రూప్ బి, సి కేటగిరీ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఈ నెల 9న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకోవడానికి జూలై 4 చివరి తేదీ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటయ్యాయని, అర్హులైన అభ్యర్థులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సర్చ్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్:**శాంతి భ ద్రతల పరిరక్షణ కోసం కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నామని కాగజ్ నగర్ డి ఎఎస్‌పి రామానుజం తెలిపారు. శ నివార ం కాగజ్ నగర్ పట్టణంలోని సంఘం బస్తి కాలనీలో జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు డిఎస్‌పి రామానుజం ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సం దర్భంగా సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నిల్వ ఉం చిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా డి ఎస్‌పి రామానుజం మాట్లాడుతూ, “కొత్త వ్యక్తుల విషయాలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అ నుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం అందించాలి. చట్టవిరుద్ధ కా ర్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ సా మరస్యంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి” అని పే ర్కొన్నారు. పట్టణ సిఐ , రూరల్ సిఐ , టౌన్ ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని అరెస్ట్ చెయ్యాలి

### తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:**మహాన్యూస్ టీవీ కార్యాలయంపై దాడి చేసిన బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి డిమాండ్ చేశారు. శంకర్ దయాల్ చారి మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించేది లేదని, బావ స్వేచ్ఛ ప్రకటనను హరించే విధంగా భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు, నాయకులు చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జర్నలిస్ట్ ఫడరేషన్ అధ్యక్షుడు వికాస్, సీనియర్ జర్నలిస్టులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల లబ్ధి

# అర్హులందరికీ చేరేలా చర్యలు

### ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు









**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రొహిబిషన్,ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక,పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరిగిందని,దశలవార్య తెలిపారు.జిల్లాలో రైతు భరోసా పథకం 100 శాతం అమలైందని వెల్లడించారు.అలాగే,పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువులు,విత్తనాలు సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా,వేగవంతంగా అమలు చేయనున్నట్లు వివరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో అన్ని ప్రభుత్వ పథకాలను అర్హులైన పేద ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అన్ని పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు.జిల్లాలో వికలాంగుల సౌకర్యార్థం అలిమ్కో సంస్థ ద్వారా రూ.1.21 కోట్లు విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు.ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 2632 మంది విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరారు.వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం 1,62,414, మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది.పప్రజల భూ సమస్యల పరిష్కారానికి,ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభాజాతి చట్టం అమలులో భాగంగా గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వన మహోత్సవం సందర్భంగా దాదాపు 65 లక్షల మొక్కల నాటేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.అనంతరం,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు.అలాగే మహిళా సంఘాలకు రూ.133 కోట్ల రుణాల చెక ను అందజేశారు.డ్రగ్స్,వైద్య ఆరోగ్యశాఖ పోస్టర్లను ఆవిష్కరించారు.అలాగే దివ్యాంగులకు ట్రై సైకిళ్లు మంత్రులు,ప్రజాప్రతినిధులు,కలెక్టర్లు కలిసి పంపిణీ చేశారు.అంతకుముందు కలెక్టరేట ప్రాంగణం లో ఫుడ్ వెస్టేజ్ కంపోస్టింగ్ యంత్రాన్ని రిబ్బన్ కత్తిరించి మంత్రి ప్రారంభించారు.ఈ సమావేవంలో నిర్మల్ ముధోల్,ఖానాపూర్ ల శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి,పవార్ రామారావు పటేల్,వెడ్మ బొజ్జు పటేల్,గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ,జిల్లా ఎస్పీ జానకి షర్మిల,అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,ఉన్నత అధికారులు,ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,పలు పథకాలు లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజానికి ప్రజలంతా కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :**అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగ,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శివాజీ చౌక్ నందు జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు సాగింది.అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని,మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను రక్షించటం,వారికి సరైన దిశానిర్దేశం చేయటం ద్వారా దేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దవచ్చన్నారు.మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజాన్ని నాశనం చేస్తోందని,ప్రతి ఒక్కరు వీటి నిర్మూలనకు సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల తయారీ ,నిల్వ, అమ్మకం,వినియోగం చట్టపరంగా నేరమని గుర్తుచేశారు.దీనికి సంబంధించి ఎవరైనా 1908 హెల్ప్‌లైన్ నంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.మాదకద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అందరి సూచనలు,సహకారాలు స్వాగతిస్తామని చెప్పారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో డీఅడిక్షన్ సెంటర్ ద్వారా బాధితుల వైద్య సహాయం అందిస్తున్నట్టు తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,ఎంతో మంది యువకుల భవిష్యత్తును ఇవి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో కలిసి కలెక్టర్ మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందాలు ప్రజల్లో మాదకద్రవ్యాలపై చైతన్యం కలిగించే ప్రదర్శనలు ఇచ్చారు.ప్రత్యేకంగా రూపొందించిన పాటల ద్వారా మాదకద్రవ్యాల హానిని చాటిచెప్పారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఇఓ పి.రామారావు,ఎక్సైజ్ అధికారి ఎం.ఎ.రజాక్,డిఎంహెచ్ఓ రాజేందర్,డిపిఓ శ్రీనివాస్,డిపిఆర్ఓ విష్ణువర్ధన్,డిఆర్డిఓ నాగవర్ధన్,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సిడిపిఓలు ,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,మెప్మాపిడిసుభాష్,ఐకెపి మహిళలు,విద్యార్థులు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు

### నిర్మాణంలో ఉన్న తాగునీటి పథకాలు వేగంగా పూర్తి చేయాలి


### జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:**నీటిపారుదల ,మిషన్ భగీరథ ,పబ్లిక్ హెల్త్ ,మున్సిపల్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తాగునీటి సమస్యలు లేకుండా అన్ని ఆవాస ప్రాంతాలకు తాగు నీరు.సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని మంజీరా బ్యారేజీ ,సింగూరు ప్రాజెక్టు నుండి హైదరాబాద్ మెట్రో వర్క్స్ కు సరఫరా అవుతున్న తాగునీటి వివరాలను మంజీరా బ్యారేజ్ పరిస్థితి నారింజ వాగు,సింగూరు పరివాహక ప్రాంతం వివరాలు నూతనంగా చేపట్టిన చెరువుల కుంటల నిర్మాణం పనులు పురోగతి తాగునీటి సరఫరాపై నీటిపారుదల శాఖ మిషన్ భగీరథ పబ్లిక్ హెల్త్ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బ్యారేజీల నీటి మట్టాలు ఎంత ఉన్నాయి. నీటి పరపరా కొనసాగే పరిస్థితి మిషన్ భగీరథ నీరు సరపరా అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఝురాసంఘం న్యాల్కల్ మండలాలలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకుల సంక్షేమ పాఠశాలలో వసతి గృహాలు అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు సరఫరా మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లీకేజీలకు అవసరమైన మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని అదికారులకు సూచించారు. జిల్లాలోని ప్రజలకు అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ కుళాయిల ద్వారా నాణ్యమైన త్రాగునీరు అందిలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మురుగు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధులు వల్ల కలిగే సమస్యలను ప్రజలకు వివరించి అవసరమైన జాగ్రత్త చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ ,డిఈరఘువీర్, ఎఎ పాషా ఇఇ పబ్లిక్ హెల్త్ కృష్ణ మోహన్ ,నీటి పారుదల శాఖ అధికారులు మున్సిపల్ ఇంజనీర్ అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పన

### రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం....



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మౌళిక సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం అన్నా రు. శనివారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా క్టర్ హరీష్‌రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సులేమాన్, టిజిఎంఐడిసి ఈఈ నరసింహరావులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, త్వరలో విద్యాబోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టులలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవడం జరుగుతు ందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం ఉన్న మేరకు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మాణం కొనసాగుతున్న మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై ఆమ్ ఆద్మీ పార్టీ దృష్టి





**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు దృష్టిలో ఉంచుకొని,ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నిర్మల్ జిల్లాలో తమ కార్యకలాపాలను ముమ్మరం చేసింది.శనివారం రోజున జరిగిన పత్రికా సమావేశంలో,ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా విభాగం స్థానిక సంస్థల ఎన్నికల పోస్టర్‌ను విడుదల చేసింది.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లాలో నిజాయితీ సమర్థవంతమైన పాలనను అందించడమే తమ లక్ష్యంగా ముందుకు వస్తోందని ప్రకటించింది.అవినీతికి తావులేని,పారదర్శకమైన పాలన ద్వారా నిర్మల్ జిల్లాను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో,మున్సిపాలిటీలు,ఎంపిటిసి,జెడ్‌పిటిసి స్థానాలతో సహా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు సమర్థవంతమైన,నిజాయితీగల అభ్యర్థుల కోసం సభ్యత్వ నమోదును ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.నిర్మల్ జిల్లాలోని ప్రతి మున్సిపల్ వ్యవస్థ,మండల పరిషత్,జిల్లా పరిషత్‌ను అవినీతి రహితంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆప్ నాయకులు స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను నేరుగా ఆలకించి,వారి భాగస్వామ్యంతోనే పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్,సోఫి ఇలియాజ్,బీ.శ్రీనివాస్,వినోద్,హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు

### నిజామాబాద్ నగరానికి 10 కి.మీ. వరకు పూర్తిగా పోలీసుల అధీనంలోకి

### బందోబస్తు నిర్వహణ కోసం 1300 మందితో ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :**కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా కేంద్ర బలగాలతో సమన్వయం చేసుకుంటు ఆక్టోపస్, గ్రేహౌండ్స్, స్నైపర్ టీమ్స్‌తో భారీ బందోబస్తు ఏర్పాట్లు, పటిష్టమైన నిఘా వ్యవస్థ, బైనాక్యూలర్‌తో అనుక్షణం పర్యవేక్షణలో నిజామాబాద్ నగరాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశామని పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య తెలిపారు. ఆదివారం ప్రారంభోత్సవం చేయనున్న కేంద్ర పసుపు బోర్డు కార్యాలయానికి, మాజీ ఎమ్మెల్సీ, స్వర్గీయ డి. శ్రీనివాస్ విగ్రహావిష్కరణకు విచ్చేస్తున్న అమిత్‌షా కేంద్ర హోం శాఖ మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షిస్తు కమిషనర్ మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా కేంద్ర బలగాలతో సమన్వయం చేసుకుంటు రాష్ట్రంలోని ప్రత్యేక బలగాలైన రెండు ఆక్టోపస్ టీమ్‌లు, గ్రే హౌండ్స్ టీములు, స్నైపర్ టీములతో పాటు, నిజామాబాద్ జిల్లాలోని స్పెషల్ పార్టీ టీమ్‌లు, బిడి టీమ్స్, డాగ్ స్క్వాడ్స్‌లతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లు, కల్వర్టులు, రోడ్లు తదితర ప్రదేశాలలో చెక్‌చేసి ఏరియా డామినేషన్ చేయడం జరిగిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంచేస్తు 10 కి.మీ.ల వరకు పూర్తిగా పోలీసులు తమ అధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, చుట్టుపక్కల ప్రతీ ఇంట్లో ఎవరిని కొత్తవారిని రానివ్వద్దని తెలియజేయడం జరిగిందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనబడితే వెంటనే డయల్ 100 లేదా మీ స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్లా, నిర్మల్, మెదక్, సిద్దిపేట్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుండి పోలీసు సిబ్బంది, టిఎస్ఎస్‌పి బెటాలియన్ పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహణ కోసం దాదాపు 1300 మందితో ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ పర్యటన సందర్భంగా మొదటి నుండి చివరి వరకు దారిపొడవున సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాట్లు, బైనాక్యూలర్లతో పర్యవేక్షణ, పాత నేరస్తులపై నిఘా పటిష్ట పర్చడం జరిగింది.

## హెడ్‌కానిస్టేబుల్ వేణుకు సిపి ప్రశంస




ప్రజాపక్షం/చొప్పదండి:కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి ఉత్తమ ప్రతిభ కనభరిచిన పోలీసు సిబ్బందిని కరీంనగర్ సిపి గౌష్ ఆలం అభినందించారు. ఈ మేరకు చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ కనభరిచిన హెడ్ కానిస్టేబుల్ వేణుకు సిపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణును ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. చొప్పదండి పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ వేణుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రపంచం గర్వించదగ్గ మేధావి పివి నరసింహారావు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రావు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రపంచం గర్వించదగ్గ మేధావి మాజీ ప్రధాని పివి నరసింహరావు అనిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్ నాయక్ దామోదర్ రావు కొనియాడారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణల సృష్టి కర్తగా భారతదేశంలో పేరు భావించారని కరీంనగర్ జిల్లా పేరు నిలబెట్టారని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సాయిరీ మహేందర్, మినుపాల ప్రకాష్ రావు, దామోదర్ రావు, పన్నాల రాములు, బిరుదు కృష్ణ, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, మేకల పోశం తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లో గ్రామీణాభివృద్ధి, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాకు ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని , ఎన్ ఆర్ ఇజిఎస్ ద్వారా గుర్తించిన వివిధ ప్రాంతాలోల ఫిట్టింగ్, ప్లాంటింగ్ చేయాలను సూచించారు. ప్లాంటింగ్ చేయగానే టీజీఎఫ్ ఎంఎస్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ద్యానవన శాఖలో 1335 ఎకరాల టార్గెట్ కి గాను ఇప్పటికి 428 రైతులు 748 ఎకరాలోల పలు రకాల తోటల పెంపకం కి ఐడెంటిపై చేసినట్లు మిగతా టార్గెట్ సైతం ఆగస్టులోపు పూర్తి చేయాలని సూచించారు. ఎన్ ఆర్ఇజిఎస్ కూలీల శాతం పెంచాలని, నిర్మాణం చేపట్టిన సిసి రోడ్డు, డ్రైనేజీలూ, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు ఇంజనీరింగ్ అధికారులు తరుచు పర్యవేక్షణ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ తాగు నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలని, మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకులు సకాలంలో తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఎల్లప్పుడూ నీటి షాంపిల్స్‌ని ల్యాబ్‌కు పంపించాలని నీరు శుభ్రంగా ఉంటే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎక్కువ శాతం అరికట్టవచ్చని అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్త, డ్రైనేజీ పొంగడం లాంటిది ఉన్నట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పిసి ఇఒ రమేశ్, డిఆర్‌డిఒ జయదేవ్ ఆర్య, డిపిఒ దేవకీదేవి, పంచాయతీరాజ్ ఇఇలు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు తదితరులు ఉన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు తరువాతే ఎన్నికలు జరపాలి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ కోరారు. శనివారం కరీంనగర్‌లోని బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే స్థానిక సంస్థల ఎన్నికలపై తొందర పాటు నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. బిసిలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళితే చేతులు కాల్చుకోవడం తప్పదని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మాణించి బిల్లు రాష్ట్రపతి దగ్గరకు రెండు నెలలు గడిచినా స్పష్టత రాలేదన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలవాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బిసిల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, విధ్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, బోని ప్రశాంత్, నాగుల కిరణ్ తదితరులున్నారు.

## 12లోపు నైపుణ్య శిక్షణ కోసం ఎంబిసి అభ్యర్థులు దరఖాస్తు

జిల్లా బిసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబిసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బిసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబిసి నిరుద్యోగ యువతీ యువకుల కు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం 4 రోజుల పాటు హైదరాబాద్ లో అందించడం జరుగుతుందని అన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, టిఎ, వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులకు 21 నుంచి 30 సంవత్సరాల వయసు లోపు ఉండాలని , ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని , ఎంబిసి 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమం అందుతుందని, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు ఉండాలని అన్నారు. ఆసక్తి అర్హత కల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 12 లోపు tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొని, ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రం విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు జత చేసి పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఉన్న బిసి అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14 లోపు సమర్పించాలని, నిరుద్యోగ ఎంబీసీ యువతీ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 30న అమరజీవి మాదిరెడ్డి భాస్కర్ రావు 34 వర్ధతి సభ

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మాజీ ఉప ప్రధాన కార్యదర్శి అమరజీవి మాదిరెడ్డి భాస్కర్ రావు 34 వర్ధంతి సందర్భంగా జూన్ 30 న గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సాయంత్రం 4 గంటలకు స్మారక సభ జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సిపిఐ, ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ

ప్రజాపక్షం/శంకరపట్నం:శంకరపట్నం మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఆహార పధార్థాలు, వంట రూమును తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విధ్యార్థులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/ పెద్దపల్లి ప్రతినిధి : మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రిగ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి శివ కిరణ్ గార్డెన్స్‌లో 4 మండలాల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ, పౌరసరఫరాల శాఖ, సింగరేణి , జాతీయ రహదారుల భూ సేకరణ, వైద్య శాఖ, మిషన్ భగీరథ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యా శాఖ, నీటి పారుదల శాఖ పని తీరు సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో రైతులకు ఎరువులు విత్తనాలు స్టాక్ కొడుతూ ఉందని దుష్ప్రచారం జరుగుతుందని, మన దగ్గర అవసరానికి మించి స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉందని ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను, పీక్ డిమాండ్ దృష్టిలో ఉంచుకొని మంథని ప్రాంతంలో అవసరమైన సబ్‌స్టేషన్, అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గంగదేవిపల్లిలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు వారం రోజులలో శంకుస్థాపన చేయాలని, మచ్చుపేటలో 132 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంథని పట్టణంలో విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గులు (ఫ్లక్చువేషన్) జరుగుతుందని, దీనిని వెంటనే ఎస్ఇ ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కరించాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్ వారిగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా పరిష్కరించాలని, రాబోయే 3 నెలల పాటు విద్యుత్ సరఫరా చాలా కీలకమని, అధికారులు అప్రమత్తం ఉండాలని మంత్రి తెలిపారు. సన్న బియ్యం సరఫరాకు సంబంధించి ప్రజలలో స్పందన తెలుసుకోవాలని అన్నారు. మంథని పరిధిలో నూతనంగా 1417రేషన్ కార్డులు జారీ చేశామని, 12 వేల 559 సభ్యులకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో ఎక్కడ కోతలకు ఆస్కారం ఉండడానికి వీలు లేదని అన్నారు. మంథని ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద రేషన్ షాపు వద్ద చిన్న సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. రేషన్ షాపులకు ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని అన్నారు. మంథని ఆసుపత్రికి వచ్చే రోగులను అధికంగా గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ పద్ధతి వెంటనే మార్చుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులను తప్పనిసరిగా అటెండ్ కావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంథని ఆసుపత్రిలో బయో మెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలని అన్నారు. ఆసుపత్రి పని తీరుపై ప్రత్యేకంగా వచ్చే నెల సమావేశం ఉంటుందని, పని తీరు ఇంప్రూవ్ కావాలని అన్నారు. మంథని ప్రాంతంలో వైద్య శాఖ పరిధిలో సబ్ సెంటర్ల నిర్మాణ పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని మంత్రి డి.ఎం.హెచ్.ఓ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... సుందిళ్ళ గ్రామంలో సింగరేణి మైనింగ్ లీజు భూముల పరిహారం అర్హులకు అం దించేందుకు ఎంజాయ్ మెంట్ సర్వే చేశామని, గ్రామ సభ నిర్వహించి అర్హులైన వారికి మాత్రమే పరిహారం అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం

నేర సమీక్షలో కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై, అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం మోపాలని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పోలీసులను ఆదేశించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం సిపి గౌష్ ఆలం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ భూములు, రిజిస్ట్రేషన్ల విషయంలో చట్టాలకనుగుణంగా నిందితుల పై కేసులు నమోదు చేయాలన్నారు. చిట్‌ఫండ్ మోసాలు సైతం ఎక్కువగా నమోదవుతున్నందున వాటిపై ప్రత్యేక దృష్టిసారించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేయాలన్నారు. పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సరైన పద్ధతిలో అమలు చేయాలని ఆదేశించారు. సిఐలు పోలీస్ స్టేషన్లను సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్ల వారీగా ఏసిపిలు ప్రతి నెల నేర సమీక్షలు నిర్వహించాలన్నారు. సిసిసి ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శాంతిభద్రతల సమస్యలను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీస్‌స్టేషన్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్షించి వాటికి గల కారణాలను తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. డివిజన్‌ను సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్‌కు ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను ఇంచార్జిగా నియమించాలన్నారు. తిరిగి సెక్టార్‌లను రెండు మూడు గ్రామాలతో కలిపి సబ సెక్టార్లుగా విభజించి వాటికి పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించాలని ఆదేశించారు. సమావేశంలో డిసిపి వెంకటరమణ, ఏసిపిలు వెంకటస్వామి (టౌన్), హుజురాబాద్ ఎసిపి వి.మాధవి, యాదగిరి స్వామి (ట్రాఫిక్), శ్రీనివాస్ (ఎస్‌బి), వేణుగోపాల్ (సిటిసి) లతో పాటు కమిషనరేట్‌లోని అన్ని విభాగాల పోలీస్ స్టేషన్ల, సర్కిల్‌లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, హెడ్ క్వార్టర్స్‌లోని అన్ని విభాగాల రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే సత్యం



ప్రజాపక్షం/గంగాధర:చొప్పదండి నియోజకవర్గ ప్రజలపై తనకు ఉన్న మమకారాన్ని మరొకసారి చాటుకున్నా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. గంగాధర మండలం మధురానగర్ గ్రామానికి చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కుమార్తె అనారోగ్యంతో బాధపడగా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. చికిత్స నిమిత్తం దాదాపు రూ.6 లక్షల వరకు ఖర్చయ్యింది. చికిత్స అనంతరం శ్రీనివాస్ సిఎం సహాయనిధి కింద ఆర్థిక సహాయం కోసం ధరఖాస్తు చేసుకున్నారు. శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక శ్రద్ధ వహించి సిఎం సహాయనిధి కింద రూ.2లక్షల 40వేల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శ్రీనివాస్‌కు చెక్కును అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

## లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక : మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలను కళ్యాణలక్ష్మీ షాదీ ముబారక్ చెక్కుల ను అర్హులైన లబ్దిదారులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌తో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలిసి పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూర్ పత్రాలు పొందిన లబ్దిదారులు సత్వరమే నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి లక్ష్మ ణ్‌కుమార్ తెలిపారు. విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూర్ చేస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, సిమెంట్ సీల్డ్ ధరలు తగ్గించేలా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇండ్ల మంజూర్ పత్రాలు అందుకున్న లబ్దిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టాలని సూచించారు. బేస్‌మెంట్ ఇతర దశ పూర్తి కాగానే గ్రామాల్లో గ్రామ పంచాయితీ కార్యదర్శి మున్సిపాలిటీల్లో వార్డ్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లాలని , వారు ఆన్‌లైన్ నిర్మాణ దశను తెలియజేసి ప్రభుత్వం నుండి బిల్లులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు 191 అర్హులైన లబ్దిదారులకు అందజేశారు. కళ్యాణలక్ష్మీ షాదీ ముబారక్ 17 చెక్కులను అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో ధర్మపురి, మల్యాల సీఐలు రాం నరసింహరెడ్డి, నీలం రవి, కృష్ణసాగర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది తో బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి మధుసూధన్, తహసీల్దార్ మాజీద్, ఎంపీడీవో అఫ్జల్ మియా, సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్, నిశాంత్‌రెడ్డి, నర్సాగౌడ్, వివేకానంద, కర్ర విక్రమ్‌రెడ్డి, ఎన్నం కిషన్‌రెడ్డి, గట్టు గంగారామ్, హౌసింగ్ పీడీ ప్రసాద్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు

## పివి వేసిన పునాదులతోనే అభివృద్ధి వైపు భారత్

ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యానారాయణ




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు జయంతి సంధర్బంగా శనివారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా ఆర్టీఎ మెంబర్ పడాల రాహుల్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన చైర్మన్ మడుపు మోహన్‌లతో పాటు నాయకులతో కలిసి పివి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసంధర్బంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బహు బాషా కోవిదునిగా, ఆర్థిక సంస్కరణల రూపకర్తగా ఈ దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థిక కష్టాలలో కూరుకుపోయిన ఈ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించేలా ప్రణాళికలు రూపొందించి ముందుచూపుతో పివి నరసింహారావు చేసి పునాదులతో నేడు ఈ దేశం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోతు శ్రావణ్ నాయక్, ఆకుల ఉదయ్, సలీముద్దీన్, చర్ల పద్మ, దన్ను సింగ్, బొబ్బిలి విక్టర్, నెల్లి నరేష్, మునిగంటి అనిల్, పెద్దిగారి తిరుపతి, సయ్యద్ జమాలుద్దీన్, కుర్ర పోచయ్య, తోట అంజయ్య, షబానా మహ్మద్ అనీఫ్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, మాదాసు శ్రీనివాస్, మూల జైపాల్, జొన్నల రమేష్, శ్రీరాముల రమేష్, కూన దామోదర్, సుదర్శన్ కొలగాని అనిల్, అందె శంకర్, తీట్ల ఈశ్వరి, మొరంపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు తదితరులున్నారు.

## విద్యార్థులు చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : విద్యార్థులు చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షమంథని మండలం రామయ్యపల్లి గ్రామంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెసిడెన్షియల్ పాఠశాలలో డార్మెంటరీ రూమ్, కిచెన్, జూనియర్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించారు. రెసిడెన్షియల్ పాఠశాలలోని రైస్ స్టాక్, కూరగాయలను తనిఖీ చేసిన కలెక్టర్ నీట్‌గా మేయింటేన్ చేస్తున్న సిబ్బందిని అభినందించారు. విద్యార్థులతో కలెక్టర్ ఇం టారాక్ట్ అయ్యారు. విద్య బోధన ఎలా జరుగుతుంది, హాస్టల్‌లో భోజనం నాణ్యత, వసతులు ఉన్నాయా, పారిశుద్ధ్యం ఎలా ఉంటుంది, వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువుకోవాలని, విద్య ద్వారా జీవితంలో మంచి మార్పులు సాధ్యం అవుతాయని, గొప్ప స్థాయికి చేరుకునేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారాన్ని స్వీకరించాలని, ప్రతిరోజు కొంత వ్యాయామం చేయాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



ప్రజాపక్షం/వీర్నపల్లి:పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం రోజున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, మెస్ చార్జీలు, ఎగ్స్ బిల్లులతో పాటు గౌరవ వేతనం రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కిరాణ షాపులలో అప్పులు చేసి పాఠశాలలకి కావలసిన సరుకులు తెచ్చి వండుతున్నారని, తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరుగుతున్నా, బిల్లులు మాత్రం రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పెండింగ్ బిల్లులు విడుదల చేసి, కనీస వేతనం పదివేల రూపాయలు అమలు చేసి, పూర్తి స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని లేని యెడల కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు జాలపెల్లి మనోజ్ కుమార్, కార్మికులు లక్ష్మి , రాజవ్వ, ఎరవేణి భూదవ్వ, భారతి, దేవవ్వ, లక్ష్మి , గంగవ్వలు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం సుల్తానాబాద్ మ ండల కేంద్రంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో సుల్తానాబాద్ మండలం, పట్టణనికి సంబందించిన నూతన రేషన్ కార్డ్స్ 605 మంది లబ్ధిదారులకు,33 మంది లబ్ధిదారులకు 33,03,828 /రూపాయల కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు,105 మంది లబ్ధిదారులకు 41,37,000/ రూపాయల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే విజయ రమణారావు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ గత పది ఏళ్ల కాలంలో ఏ ఒక్క పేదవాడికి కూడా ఎలాంటి సంక్షేమ ఫలం అందలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బషీర్, ఎంపిడిఒ దివ్యదర్శన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు,పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షులు చిలుక సతీష్, సింగల్ విండో చెర్మన్, శ్రీగిరి శ్రీనివాస్, సైరి మహేందర్, బిరుదు కృష్ణ, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు పన్నాల రాములు, స్థానిక లు మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఎంపిటిసిలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల ప్రజలు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## కుటిల రాజకీయాలకు తెరలేపిన బిజెపి

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్:మతం, కులం పేరుతో లబ్ధి పొందాలని కుటిల రాజకీయాలు చేయడం బిజెపికి వెన్నతో పెట్టిన విద్య అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నిన్నటి వరకు కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ ఒక్క రూపాయి తేలేదన్న వ్యక్తి నేడు బండి సంజయ్ అభివృద్ధి ప్రదాత అని మాట్లాడడం చూస్తే ఊసరవెల్లులు సిగ్గుపడుతున్నాయని ఎద్దేవా చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డుల పునర్విభజన ప్రక్రియలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ జోక్యం చేసుకోలేదన్నారు. పచ్చ కామెర్ల వ్యాధి ఉన్నోళ్లకు లోకమంతా పచ్చగా కనిపించినట్లు గతంలో వీరి హయాంలో జరిగినట్లే ఇప్పుడు జరిగినట్లు భ్రమ పడుతున్నారని విమర్శించారు. అనవసర ఆరోపణలు చేసి లబ్ధిపొందాలని చూస్తే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఊసరవెల్లుల మాటలు ప్రజలు నమ్ముతారనుకుంటే అది పొరపాటని, ఎన్నికలొస్తున్నాయంటే చాలు బిజెపి కుటిల రాజకీయాలకు తెరలేపుతుందని నరేందర్ రెడ్డి విమర్శించారు. సమావేశంలో శ్రావణ్ నాయక్, జిడి రమేష్, దన్నా సింగ్, దండి రవీందర్, ఆస్థాపురం రమేష్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, బషీర్, భారీ, సాయిరాం ,రాజ్ కుమార్, షభాన, అంజయ్య తదితరులున్నారు.

# క్రీడ

## చెన్నైలో హాకీ వరల్డ్ కప్..

### ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్థాన్



‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇరుదేశాల మధ్య క్రికెట్ కాదు కదా.. ఇతర ఏ ఆట కూడా సాధ్యంకాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దాయాదిల మ్యాచ్ చూసే అవకాశం అభిమానులకు లభించింది. పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌లో భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉండడమే అందుకు కారణం. తమిళనాడులోని చెన్నై, మధుర వేదికగా జరుగనున్న హాకీ వరల్డ్ కప్ షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లోని లసాన్నేలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రమ్ డ్రా తీశారు. అందులో.. గ్రూప్ బీలో ఇండియా, పాకిస్థాన్ టీమ్‌లతో పాటు చిలీ, స్విట్జర్లాండ్‌లకు చోటు దక్కింది. భారత్ ఆతిథ్యమిస్తున్న పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్ చెన్నైలో నవంబర్ 28న ప్రారంభం కానుంది. డిసెంబర్ 10 వరకూ జరగునున్న ఈ మెగా టోర్నీలో మొత్తం 24 జట్లు పోటీపడనున్నాయి. ఈ టీమ్‌లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఏలో జర్మనీ, దక్షిణాఫ్రికా, కెనడా, ఐర్లాండ్ జట్లు ఉండగా.. గ్రూప్ సీలో అర్జెంటీనా, న్యూజిలాండ జపాన్, చైనా పోటీ పడుతున్నాయి. గ్రూప్ డీలో స్పెయిన్, బెల్జియం, ఈజిప్ట్, నమీబియా ఉన్నాయి. గ్రూప్ ఈ నుంచి నెదర్లాండ్స్ మలేషియా, ఇంగ్లాండ్ ఆస్ట్రియాలు .. గ్రూప్ ఎఫ్ నుంచి ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కొరియా, బంగ్లాదేశ్‌లు బరిలోకి దిగనున్నాయి.



**ఇది మూడోసారి..**

మనదేశంలో పురుషుల హాకీ జూనియర్ వరల్డ్ కప్ నిర్వహించడం ఇది మూడోసారి. 2016లో లక్నో, 2021లో భువనేశ్వర్ నగరాల్లో వరల్డ్ పోటీలు విజయవంతం అయినందున తమ రాష్ట్రంలోనూ ఘనంగా జరిపేందుకు తమిళనాడు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది. వరల్డ్ కప్ టోర్నీ ప్రచారం నిమిత్తం జూన్ 19 రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ లోగోను ఆవిష్కరించారు.

## మెరుపు సెంచరీ..

### చరిత్ర సృష్టించిన 19 ఏళ్ల కుర్రాడు!



అంతర్జాతీయ క్రికెట్‌లో మరో స్టార్ అవతరించాడు. 19 ఏళ్లకే మెరుపు సెంచరీతో చరిత్ర సృష్టించాడు దక్షిణాఫ్రికా క్రికెటర్ లుహాన్ డ్రె ప్రిటోరియస్. శనివారం జింబాబ్వేతో తొలి టెస్టులో టెస్టులో అరంగేట్రం చేసిన ప్రిటోరియస్.. శతకంతో చెలరేగాడు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను ఉతికేసిన ఈ యంగ్ స్టర్ 61 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. బులావయాలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో సుడిగాలి ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్న ప్రిటోరియస్.. గ్రేమ్ పొలాక్‌ను నెట్టేశాడు. తమదేశం తరపున చిన్న వయసులోనే మూడంకెల స్కోర్ చేసిన ఆటగాడిగా గుర్తింపు సాధించాడు. టీమ్ పరంగా చూస్తే.. మొదటి మ్యాచ్‌లోనే వంద కొట్టిన ఏడో సఫారీ క్రికెటర్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు దక్కించుకున్నాడీ చిచ్చరపిడుగు. ఈరోజుకు అంటే జూన్ 28 నాటికి ప్రిటోరియస్ వయసు 19 ఏళ్ల 93 రోజులు మాత్రమే. ప్రిటోరియస్ కంటే ముందు తొలి టెస్టులోనే సెంచరీ బాదిన సఫారీలు ఐదుగురు. విల్లగోబై, కొట్జీ, రుడాల్ఫ్, బారీ రిచర్డ్స్, జాక్వెస్ రుడాల్ఫ్‌లు తమ మొదటి మ్యాచ్‌లోనే వందతో మురిసిపోయారు.

**ఐదో స్థానంలో క్రీజులోకి**

అండర్ 19 క్రికెట్‌లో తన బ్యాటింగ్ విన్యాసాలతో అలరించిన ప్రిటోరియస్ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. జింబాబ్వే పర్యటనకు ఎంపికైన అతడు తొలి మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన అతడు.. ఐదో స్థానంలో క్రీజులోకి వెళ్లాడు. అప్పటికి 25 పరుగులకే 3 వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఒత్తిడిని తట్టుకుంటూ ప్రిటోరియస్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. నాలుగో బంతికే సిక్సర్ బాదిన అతడు.. ఆ తర్వాత జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 54 బంతుల్లోనే అర్ధ శతకం బాదాడు. ఫిఫ్టీ తర్వాత కూడా దూకుడుగా ఆడి112 బంతుల్లోనే రెండు సిక్సర్లు, ఏడు ఫోర్లతో శతకానికి చేరువయ్యాడీ హిట్టర్. దక్షిణాఫ్రికా తరఫున వేగవంతమైన సెంచరీ బాదిన ప్రిటోరియస్ పలు రికార్డులు బద్దలు కొట్టాడు. అరంగేట్రంలోనే వేగవంతమైన శతకవీరుడిగా అవతరించాడు. ఇంతకుముందు ఈ రికార్డు స్టియాన్ వాన్ జైల్ పేరుతో ఉండేది. 2014లో వెస్టిండీస్‌పై స్టియాన్ 129 బంతుల్లో మూడంకెల స్కోర్ సాధించాడు. 2010లో అల్విరో పీటర్సన్ భారత్‌పై 160 బంతుల్లోనే శతకగర్జన చేశాడు.

## మంధాన హాఫ్ సెంచరీ..

### స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగిన షఫాలీ



ఇంగ్లాండ్ పర్యటనలో భారత మహిళల జట్టు తొలి పరీక్షకు సిద్ధమైంది. ఐదు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య జట్టుతో టీమిండియా మొదటి మ్యాచ్ ఆడుతోంది. నాటింగ్‌హమ్‌లోని ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన ఇంగ్లండ కెప్టెన్ నాట్‌సీవర్ బ్రంట్ బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌తో భారత డాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మ పునరాగమనం చేయనుంది.
నాటింగ్‌హమ్‌లోని ట్రెంట్‌బ్రిడ్జిల్ జరుగుతున్న తొలి టీ20లో స్మృతి మంధాన(55 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడుతోంది. తొలి ఓవర్ నుంచే దూకుడుగా ఆడుతున్న మంధాన 27 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసింది. అలిసే క్యాప్సలే బౌలింగ్‌లో బౌండరీతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. ఆమెకు టీ20ల్లో ఇది 31వ ఫిఫ్టీ కావడం విశేషం. మరో ఎండ్‌లో ధనాధన్ ఆడుతున్న షఫాలీ వర్మ(20)ను అర్లాట్ వెనక్కి పంపింది. పెద్ద షాట్‌కు యత్నించిన ఆమె ఎకిల్‌స్టోన్ చేతికి చిక్కింది. దాంతో, 77 వద్ద టీమిండియా తొలి వికెట్ కోల్పోయింది. క్రీజులోకి వచ్చీరాగానే హర్లీన్ డియోల్ (20 నాటౌట్) బౌండరీతో తన ఉద్దేశాన్ని చాటింది. ఆ తర్వాత లిన్సే స్మిత్‌కు చుక్కలు చూపించిన డియోల్ మూడు ఫోర్లు కొట్టింది. అంతే.. స్కోర్ 90 దాటింది. 10 ఓవర్లకు భారత జట్టు వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది.

# స్పోర్ట్స్ ఫోకస్



### డిఫెండింగ్ చాంపియన్స్

గత ఏడాది జులై 1 నుంచి 14 వరకు జరిగిన వింబుల్డన్ గ్రాండ్ శ్లామ్‌లో టైటిళ్లు గెలిచిన క్రీడాకారులు...

**పురుషుల సింగిల్స్:** కార్లస్ అల్కరాజ్ (ఫైనల్‌లో నొవాక్ జొకొవిచ్‌పై విజయం)
**మహిళల సింగిల్స్:** బార్బొరా క్రెజిసికొవా (ఫైనల్‌లో జాస్మిన్ పవొలినిని ఓడించింది)
**పురుషుల డబుల్స్:** హారీ హెలియోవరా, హెన్రీ పాటెన్ (ఫైనల్‌లో వీరు తుది పోరులో మాక్స్ ప్యూర్సెల్, జోర్డాన్ థాంప్సన్ జోడీపై గెలిచారు)
**మహిళల డబుల్స్:** కాథెరిన సినియాకొవా, టేలర్ టౌన్‌సెండ్ (ఫైనల్‌లో వీరు గాబ్రియేలా డబ్రోవ్‌స్కీ, ఎరిన్ కౌట్లిఫె జోడీని ఓడించారు)
**మిక్స్‌డ్ డబుల్స్:** జన్ జీలెన్‌స్కీ, హీచ్ సు వెయ్ (వీరు ఫైనల్‌లో సాంటియాగో గొంజాలెజ్, గులియానా ఆల్మోస్ జోడీపై విజయం సాధించారు).

## ‘టెన్నిస్ మహారాణి’ వింబుల్డన్!




ప్రపంచ టెన్నిస్‌లో గ్రాండ్ శ్లామ్ టోర్నీలకు ఎంతో ప్రత్యేకత ఉంటే, వాటిలో వింబుల్డన్‌కు మరింత విశేష స్థానం ఉంది. అందుకే, వింబుల్డన్‌ను ‘టెన్నిస్ మహారాణి’గా పేర్కొంటారు. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్ టోర్నీలను గ్రాండ్ శ్లామ్‌గా వ్యవహరిస్తారు. వీటిలో అత్యంత సంప్రదాయ పద్ధతిలో కొనసాగే వింబుల్డన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈనెల 30వ తేదీ నుంచి జులై 13 వరకు జరిగే ఈ మెగా టోర్నీని ప్రత్యక్షంగా లేదా ఇతరత్రా మాధ్యమాల ద్వారా పరోక్షంగా తిలకించడానికి కోట్లాది మంది అభిమానులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి వరకూ 137 ఎపిసోడ్స్ పూర్తికాగా, ఇది 138వ టోర్నీ. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన టెన్నిస్ చాంపియన్‌షిప్‌గా మాత్రమే కాదు.... అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌గా కూడా దీనికి గుర్తింపు ఉంది. ఒక రకంగా అనధికార టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌గా పేర్కోవచ్చు. వింబుల్డన్‌లో టైటిల్ మాట ఎలావున్నా, కనీసం ఈ టోర్నీ ఆడే అవకాశాన్ని జీవితంలో ఒక్కసారి దక్కించుకున్నా చాలని టెన్నిస్ ర్యాకెట్ పట్టుకున్న ప్రతి ఒక్కరూ భావిస్తారు. దీనికి ఉన్న క్రేజీ అలాంటిది. ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్లబ్‌లో, 1877లో ప్రారంభమైన ఈ టోర్నమెంట్ 1922 నుండి ప్రస్తుత మైదానంలోకి మారింది. నిరంతరం అభివృద్ధి చెందుతున్నది. మొత్తం 19 కోర్టులు ఉంటే, మొదటి కోర్ట్ సీటింగ్ కెపాసిటీ 11,500. పచ్చిక (గ్రాస్)పై ఆడే ఏకైక గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ ఇదే. అత్యంత సంప్రదాయబద్ధంగా, టెన్నిస్ విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ఈ టోర్నమెంట్‌కు ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ కూడా ఉంది. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తెల్లటి డ్రెస్ మాత్రమే వేసుకోవాలి. తలకు కట్టుకునే హెడ్ బ్యాండ్ నుంచి కాళ్లకు వేసుకునే బూట్ల వరకూ ‘వైట్ డ్రెస్ కోడ్’ను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. టెన్నిస్‌కు ఉన్న గౌరవం, ఆటగాళ్ల మధ్య పరస్పర మర్యాద, శాంతికి తెలుపుతనాన్ని చిహ్నంగా భావిస్తారు.



ఇది గ్రాస్ కోర్ట్ చాంపియన్‌షిప్ కావడంతో, ముందుగానే గడ్డిని పెంచి, పోటీల ప్రారంభానికి నాలుగు వారాల ముందు 8 మిల్లీ మీటర్ల ఎత్తుకు కత్తిరిస్తారు. మ్యాచ్‌ల సమయంలో గ్రౌండ్ సిబ్బంది ప్రతి రోజూ లైన్లను తిరిగి పెయింట్ చేస్తారు. టోర్నీ ముగిసే వరకూ పచ్చిక ఎత్తు 8 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. టోర్నమెంట్ ముగిసిన వారం రోజుల తర్వాత, వచ్చే ఏడాది గడ్డి కోసం సన్నాహాలు ప్రారంభమవుతాయి. వింబుల్డన్ గ్రాస్ కోర్ట్ కావడంతో, అత్యధిక శాతం టోర్నీలు ఇతరత్రా ప్రాంతాల్లో జరుగుతాయి. క్లే కోర్ట్, హార్డ్ కోర్ట్‌లపై అత్యధిక శాతం టోర్నీలు నిర్వహిస్తారు. కాబట్టి వింబుల్డన్‌లోని ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో కోర్టులన్నీ ఏడాది పొడవునా, దాదాపు ఖాళీగానే ఉంటాయి. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న ఈ టోర్నమెంట్‌ను పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ పోటీలుగల ఈవెంట్‌గా నిర్వహిస్తారు.

## ఫెదరర్ ‘ది గ్రేట్’



వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో రోజర్ ఫెదరర్ నెలకొల్పి రికార్డును అధిగమించడం అసాధ్యం కాకపోయినప్పటికీ, సులభ సాధ్యం మాత్రం కాదు. కెరీర్‌లో అతను మొత్తం 8 పర్యాయాలు వింబుల్డన్ టైటిల్ స్వీకరించాడు. వీటిలో ఐదు పర్యాయాలు వరుస టైటిళ్లు కావడం విశేషం. ఈ రెండూ వింబుల్డన్ రికార్డులే. సింగిల్స్ విభాగంలో ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన ఆటగాడిగానూ ఫెదరర్ పేరు రికార్డు పుస్తకాల్లో ఉంది. అతను మొత్తం 105 పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచాడు. ఎక్కువ సమయం కొనసాగిన సింగిల్స్ ఫైనల్ 2019లో జరిగింది. 4 గంటల 57 నిమిషాలు టైటిల్ కోసం నొవాక్ జొకొవిచ్‌తో ఫెదరర్ తీవ్రంగా పోరాడాడు. టైటిల్ అందుకోలేకపోయినా, అత్యంత సుదీర్ఘమైన ఫైనల్ ఆడిన ఆటగాడిగా మరో రికార్డును అందుకున్నాడు. కాగా, వింబుల్డన్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతగా నిలిచిన నలుగురిలో ఫెదరర్ ఒకడు. జోన్ బోర్గ్ (1972/ 1976), పాట్ కాష్ (1982/ 1987), స్టెఫాన్ ఎడ్బర్గ్ (1983/ 1988) ఈ ఘనతను అందుకోగా, ఫెదరర్ 1988లో జూనియర్స్, 2003లో మొదటిసారి సీనియర్స్ విభాగాల్లో వింబుల్డన్ టైటిల్ గెల్చుకున్నాడు.

## తిరుగులేని.. నవ్రతిలోవా



ఒకప్పుడు టెన్నిస్ సామ్రాజాన్ని ఏలిన మార్టినా నవ్రతిలోవా, వింబుల్డన్‌లో అత్యధిక పర్యాయాలు మహిళల సింగిల్స్ టైటిళ్లు అందుకున్న క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పి మంది. ఓపెన్ ఎరాలో ఆమె తొమ్మిది టైటిళ్లు సాధించింది. అంతకు ముందు అమెచూర్ కాలంలో హెలెన్ విల్స్ 8 టైటిళ్లతో నెలకొల్పిన రికార్డును నవ్రతిలోవా అధిగమించడమేగా, ఓపెన్ ఎరాలోనూ మరెవరూ అందుకోలేని రీతిలో అత్యధిక టైటిళ్లు సంపాదించింది. అంతేకాదు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలతో కలిసి ఎక్కువ టైటిళ్లు కైవసం చేసుకున్న రికార్డును బిల్లీ జీన్ కింగ్‌తో పంచుకుంటున్నది. వీరిద్దరూ చెరి 20 టైటిళ్లు అందుకున్నారు. వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో ఎక్కువ మ్యాచ్‌లు (120) గెల్చుకున్న క్రీడాకారిణిగా కూడా ఆమె రికార్డు నెలకొల్పింది. ఈ పోటీల్లో ఎక్కువ మ్యాచ్‌లు (326) ఆడిన క్రీడాకారిణి కూడా నవ్రతిలోవాయే కావడం గమనార్హం.

## వామపక్ష లౌకిక శక్తులు ఏకం కావాలి

**కామ్రేడ్స్ ఆయుధాలు వీడి రండి.. బిజెపికి వ్యతిరేకంగా పోరాడుదాం**

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి**




**ప్రజాపక్షం/సంస్థాన్‌నారాయణపురం:** బిజెపిని నిలువరించేందుకే కాంగ్రెస్ అన్ని పార్టీలతో కలిసి కేంద్రంలో యూపీఏ కూటమి ఏర్పాటు చేసిందని శుక్రవారం జరిగిన సిపిఐ మండల 15వ మహాసభలలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. శ్రీలంకలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో అక్కడి ప్రజలు కమ్యూనిస్టు పార్టీకే పట్టం కట్టారని మాట్లాడారు. రెండు రాష్ట్రాల మద్దతుతో బిజెపి కేంద్రంలో అధికారానికి రాగాలిగారని, అధికారంలోకి వచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన అధికార అహంకారంతో అమిత్ షా కగార్ పేరుతో మావోయిస్టులను ,అమాయక ఆదివాసులను పొట్టన పెట్టుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతి లోకి వచ్చి వామపక్ష పార్టీలో చేరి బిజెపి వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని కోరారు. సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. ఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క దయాకర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, మంచాల జంగయ్య, కందుల లింగమ్మ, పల్లె మల్లారెడ్డి, పందుల యాదగిరి, కొండూరు విప్లవ్, శనిగల నరేష్, మారగొని నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలి : తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** రానున్న స్థానిక సం స్థలఎన్నికల్లో కమ్యూ నిస్టులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహా య కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పార్టీ ముఖ్యుల సమావేశం శనిగరపు రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, నకిర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, ఆదరి రమేష్, మద్రి శ్రీనివాస్, కొంగల రామచంద్రారెడ్డి, తిరుమల, మద్రి విజయ్, బొంత మల్లయ్య, చంద్రమౌళి, సుంచు కుమారస్వామి, తండ ముందయ్య, నిమ్మల మనోహర్, గడ్డం లలిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు అరికట్టేందుకు..**

# ప్రజల పక్షాన సిపిఐ నిరంతర పోరాటం

**గోదా శ్రీరాములు**



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టుటకై ప్రజల పక్షాన నిరంతరం సంఘటితంగా పోరాటాలు చేయాలని జిల్లా సిపిఐ కార్యదర్శి గోదా శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టై అండ్ డై అసోసియేషన్ భవనంలో నిర్వహించిన 12వ సిపిఐ మండల మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సిపిఐజెండానుఆవిష్కరించిమాట్లాడారు.దేశంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పట్ల పరిష్కారానికై నిత్యం ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు సంఘటితంగా ప్రజలందరూ ఏకమై నడుం బిగించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోచంపల్లి మండలం,మండల పరిసర ప్రాంతాలలోని గ్రామాలలోని మౌలిక వసతులు లింక్ రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూస్వామ్య పెత్తందారుల వ్యవస్థ నుంచి దున్నేవారికి భూమి కావాలని రైతు కూలీలను సంఘటిత పరిచి పీడిత ప్రజల పక్షాన నిలబడి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాదిమంది అమరవీరుల త్యాగాల వారసులుగా నిలబడి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ అని ఆయన తెలిపారు. ముఖ్యంగా పోచంపల్లి మండలంలో ప్రతి ఆదివారం జరిపే సంతకు శాశ్వత సంతను, పశువుల సంతకు స్థలం కేటాయించాలని, పిల్లాయిపల్లి కాల్వను పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.కార్యదర్శిగా 3వసారి గోడళ్ళ భూషణ్‌గౌడ్ సహాయ కార్యదర్శిగా ముసునూరి రాములు కార్యవర్గ సభ్యులుగా భీమగోని నరసింహ సంగెం గణేష్ మూషం శివలను ఎన్నుకున్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యవర్గ సభ్యులు బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

**9న దేశవ్యాప్త సమ్మె**

**ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వ కార్మిక హక్కులను కాలరాస్తోందని, 44 కార్మిక చట్టాలను అపహాస్యం చేస్తూ తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల జెఏసి నాయకులు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టియుసి నాయకులు త్యాగరాజన్, సిఐటియు, ఎస్ఇసియు నాయకులు రాజిరెడ్డి, టిబిజికెఎస్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలోని బిజేపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. తద్వారా కార్మిక సంఘాలు పెట్టుకుని, సమ్మెచేసి హక్కు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మోడి పాలన సాగుతూ కార్మికులను అణిచివేసే దిశగా ముందుకుపోతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన ఒక్కరోజు సమ్మెను అంతా జయప్రథం చేయాలని అన్నారు. తమ జీతాల కోసం కాకుండా కార్మికవర్గ శ్రేయస్సు కోసం చేపడుతున్న సమ్మెను అవసరాన్ని బట్టి దీర్ఘకాళికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేశంలోని సంఘటిత, అసంఘటిత వర్గానికి చెందిన సుమారు 50 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారన్నారు. భారతదేశం ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు 25 సమ్మెలు జరిగితే బిజేపి అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటివరకు 12 దేశవ్యాప్త సమ్మెలు జరిగాయన్నారు. ఇప్పటికైనా నరేంద్రమోడి కార్మికులపై కక్షకట్టడాన్ని ఆపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియూసి నాయకులు వంగా వెంకట్, రమణ మూర్తి, ఐఎన్‌టియుసి, ఐటియు,టిబిజికెఎస్, సింగరేణి అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెకు సన్నాహం



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించడం జరుగుతుందని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం నర్సంపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ, డిస్టిక్ ఇమినైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ , వర్ధన్నపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్యలకు సమ్మె నోటీసును అందించారు. ఆయన మాట్లాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగం గా జాతీయ ఆరోగ్యమిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతామహాధర్నా కార్యక్రమానికి హాజరై విజయవంతంచేయాలని, ఉద్యోగులకు సెలవు ప్రకటించాలన్నారు.ప్రభుత్వం 7నెలల ఏరియర్స్ బకాయి వెంటనే ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలన్నారు.ఎఐటియుసి అనుబంధం జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను కొర్నోల్, ఏఐటియుసి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సమస్యలు పట్టవా?



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** ప్రైవేట్ పాఠశాలలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలనిఅడ్డగూడూరు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్‌లు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు సరిపడ బాత్రూంలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. మండలంలో పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వెంటనే కొత్త భవనాలు నిర్మించాలని,ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు అమ్మితే దాడులు చేస్తామని హెచ్చరించారు. సంఘం మండల నాయకులు చిప్పలపల్లి బన్నీ తరుణ్, సంజయ్ ఉన్నారు.

## పేరెంట్స్ కమిటీల అనుమతి లేకుండా ఫీజుల పెంపా? : ఎఐఎస్ఎఫ్




**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేరెంట్స్ కమిటీల అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు ఎలా పెంచుతారని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ అన్నారు జగిత్యాల పట్టణంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం 25 శాతం ఉచిత విద్య కార్పోరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదవడానికి అని చెప్పి కనీస పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తు విద్య వ్యాపారం చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకోకోడం లేదన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలు కొమ్ము కాస్తున్నాయని దుయ్యబట్టారు.ఎఐఎస్ఎఫ్‌పట్టణ నాయకులు రామచంద్ర, సంజయ్, కార్తీక్, విఘ్నేష్, శ్రీశాంత్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలి

సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** వృద్ధాప్య, వితంతు, వికలాంగులు పెన్షన్లకు అర్హులైన వారందరికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్లు ఇవ్వాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గోపవరం సిపిఐ గ్రామశాఖ శుక్రవారం రాత్రి మిడియాల వెంకటి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారందరు పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నా పెన్షన్‌లు రావడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిశీలించి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గోపవరం గ్రామశాఖ కార్యదర్శిగా మురికిపూడి ఆశీర్వాదం, సహాయ కార్యదర్శిగా మురికిపూడి యశోదతోపాటు 11 మందితో కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో మాజీ ఎంపిటిసి పిడియాల వజ్రమ్మ, సీనియర్ నాయకులు మిట్టపల్లి వెంకటేశ్వర్లు, జాంబవంతు, అబ్రహాం, కోటపర్తి వెంకలు, కంచర్ల పిచ్చమ్మ, నిర్మల పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు విశ్వాసం కల్పించాలి

ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ అనుదీప్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి అంతా కలియతిరిగి, స్కానింగ్ గది, జనరల్ ఓపి, డ్రెస్సింగ్ రూం, ఇంజక్షన్ రూం, ఎక్స్ రే రూం, డెంటల్ విభాగం, ఫార్మసీ, డయాలసిస్ వార్డులను పరిశీలించారు. ఏఎన్సి రిజిస్ట్రేషన్, ఎన్సిడి సర్వే గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు గురించి అడిగి, సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. పిల్లల వైద్యులు ఉన్నారా, ఏఏ విభాగాల వైద్యుల అవసరం ఉన్నది అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్, ఎక్స్ రే విభాగంలో టెక్నీషియన్ లు ఉన్నది, ఇంకా ఏమేం అవసరాలు ఉన్నది అడిగారు. నాల్గవ తరగతి సిబ్బంది సరిపోను ఉన్నట్లు, క్రొత్త భవనానికి తగ్గట్లు పారిశుద్యానికి మరింత సిబ్బంది నియమించుకోవచ్చన్నారు. పారా మెడికల్ సిబ్బంది వివరాలు అడిగారు. అందుబాటులో ఉన్న మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు,



సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు సరిపడా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలుపుతూ, ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఓపి ఆన్‌లైన్‌లో జరుగుతుందా, మాన్యువల్‌గా జరుగుతుందా అని అడగగా, రెండు విధాలుగా జరుగుతున్నట్లు వైద్యాధికారులు సమాధానం ఇచ్చారు. ఆన్‌లైన్ ఓపి నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డయాలసిస్ విభాగం ద్వారా ప్రతి రోజు 20 మందికి డయాలసిస్ చేపడుతున్నట్లు, ఏరియా ఆసుపత్రి పరిధిలో 41 మంది రోగులు డయాలసిస్ కొరకు నమోదైనట్లు, వీరే రిపీటెడ్‌గా వస్తున్నట్లు తెలిపారు. వ్యాధి వచ్చాక కాక, రాకుండా నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఆహారం, జీవనశైలిపై చైతన్యం తేవాలని కలెక్టర్ అన్నారు. పెయిన్ కిల్లర్ల వాడకం తగ్గించాలని, మెడికల్ షాపులు పెయిన్ కిల్లర్ల అమ్మకంపై నియంత్రణ చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై చైతన్యం కలిగించాలని కలెక్టర్ అన్నారు. మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యాధికారులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని అన్నా రు. అంతకుముందు కలెక్టర్, రూ.34 కోట్లతో నిర్మిస్తున్న ఆసుపత్రి నూతన భవనాన్ని క్షుణంగా పరిశీలించారు. కొత్త భవనంతో ప్రజలకు మరిన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, చిన్న చిన్న పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. రూ.25 కోట్లతో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాల నూతన భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా డిసిహెచ్ఓ డా.రాజశేఖర్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్ గౌడ్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## నేడు సినీ సంగీత విభావరి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్వరసుధా మ్యూజిక్ యూనిట్ 33వ వార్షికోత్సవ సందర్భంగా ఖమ్మంలో నేడు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో నిర్వహకులు మాట్లాడుతూ ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రం నందు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పది గంటల వరకు సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొంటారన్నారు. డాక్టర్ వనం కృష్ణవేణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె. మాధవరావు, ఉపాధ్యక్షులు వివిరెడ్డి, కోశాధికారి పిజె వినయ్‌కుమార్, వేదిక పర్యవేక్షకులు పిన్నెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 6న ఖమ్మంలో సిపిఐ నగర మహాసభ



కరపత్రాల విడుదల

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం నగర ఐదవ మహాసభ జులై 6న ఖమ్మం సెయింట్ మేరీస్ హైస్కూల్ మస్తఫానగర్‌లో జరుగుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. శనివారం ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జానిమియా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసమే ఆవిర్భవించి ప్రజల కోసమే పని చేస్తుందన్నారు. పోరాటాల గుమ్మంగా పేరొందిన ఖమ్మం జిల్లాలో సిపిఐ నాయకులు అనన్య త్యాగాలు చేశారని వారి త్యాగాలతో ప్రజలకు అనేక హక్కులు సిద్దించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. ఐదవ మహాసభలో ఖమ్మం నగరంలోని పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, నివాస స్థలాలు, పట్టణ పేదలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితర సమస్యలపై చర్చించి పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, నగర నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, వరదా నర్సింహారావు, మాలకొండయ్య పాల్గొన్నారు.

## 'సర్వజ్ఞ'లో మెహందీ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో మెహందీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌లో బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్‌లను వేసుకున్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన డిజైన్‌లను ఎంచుకుని వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్, పాఠశాల కరస్పాండెంట్ నీలిమలు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం సాంప్రదాయం మాత్రమే కాదని దీని వెనక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువలు పెంపొందుతాయన్నారు. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు నూతన విషయాలను నేర్చుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత లోపించిందని, అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయిస్తున్నారని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ తెలిపారు. శనివారం కైకొండాయిగూడెం, ఎన్నెస్పి క్యాంపులో జరిగిన వన్‌టౌన్, టూటౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆవుల అశోక్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీని ఇందిరమ్మ కమిటీలు అపహాస్యం చేస్తున్నాయన్నారు. అనర్హులకు కేటాయించిన జాబితాను అధికారులకు విన్నవించినప్పటికీ వాటిపై సర్వే నిర్వహించి తొలగించిన దాఖలాలు లేవన్నారు. స్పెషల్ ఆఫీసర్లు సర్వే చేసి అర్హులను గుర్తించి తుది జాబితాను రూపొందించినప్పటికీ ఇందిరమ్మ కమిటీ బాధ్యులు అర్హులను తొలగించి అనర్హులకు అందిస్తున్నారన్నారు.అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుకు మాస్‌లైన్ తరపున పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు కె.శ్రీను, శోభ, లక్ష్మి నారాయణ, లెనిన్, ధరణి కృష్ణ, సత్తార్, వెంకన్న, జాస్మిన్, వనిత పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** ప్రభుత్వ అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలని లేని పక్షంలో సహించేది లేదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నిమ్మలగూడెం గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణం 60 లక్షలు సంపు, పంపుహౌస్ 31 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మలగూడెం చాలా గొప్ప గ్రామమని గొప్ప గుణం ఉన్న వాళ్ళని 45 ఏళ్ల నుండి మాతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇంటింటికి త్రాగునీరు అందించడం రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. భూ సమస్యలు ఉంటే తహసీల్దార్ ద్వారా సమస్యలు పరిశీలించుకోవాలని సూచించారు, సుజాతనగర్ లోని ఏడు గ్రామ పంచాయతీలు కార్పొరేషన్ ఏర్పాటు కావడం వలన భూమి ధరలు పెరుగుతాయని, స్థానిక ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయని తెలిపారు. దీనివలన అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం గ్రామస్తులు కూనంనేని కి పుష్పగుచ్చం అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ



చైర్మన్ మండే హనుమంతరావు, తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిఓ శ్రీనివాస్, డిఈ శివయ్య, ఏవో నర్మదా, ఎలక్ట్రికల్ ఏఈ గుగులోత్ కిషన్, ప్రధానోపాధ్యాయులు మద్దెల శివకుమార్, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు కేశవరావు, మాజీ సర్పంచ్ బండి రమేష్, మాజీ ఎంపీటీసీ గణేష్, మేకల వెంకటేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ సిపిఐ

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతకాని :** పీడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ సిపిఐ అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చింతకాని మండల మహాసభ రామకృష్ణాపురం గ్రామంలో పెరిక ప్రభాకర్ నగర్ నందు మార్గం శ్రీను, గోగుల ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా జమ్ముల జితేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగాఅమ్ముతుందని దేశ ప్రజల పట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ధరలు పెరిగిపోయి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడుతుంటే యుద్ధం పేరుతో దేశాన్ని, మతం పేరుతో దేశ ప్రజలను విచ్ఛన్నం చేసి కులాలు, మతాలుగా విభజించి దేశాన్ని విచ్చిన్నం చేస్తుందన్నారు. వ్యకాస జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల పట్ల వ్యవసాయ కూలీల పట్ల మోడీ ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా వేము జానకిరాములు, కార్యదర్శిగా గోగుల ఆదినారాయణతో



పాటు 19మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభల ప్రారంభ సూచికగా వ్యకాస జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు పతాకావిష్కరణ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, జిల్లా సమితి సభ్యులు పావులూరి మల్లిఖార్జున్‌రావు, పగిడిపల్లి ఏసు, రాసా ల మోహన్‌రావు, కూచిపుడి రవి, నాయకులు దూసరి శ్రీరాములు సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, రైతు సంఘం మండలాధ్యక్షుడు దొబ్బల వెంగళరావు, కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, గ్రామ కార్యదర్శి పగిడిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని అరికట్టండి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణామాచారితో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో విద్యా వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతుందని, ఫీజుల నియంత్రణ లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలను కాదని ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఒక క్యాంపస్‌కు అనుమతి తీసుకుని నాలుగైదు క్యాంపస్‌లు నడుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ విద్యార్థికి రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఫీజు వసూలు చేయడంతో పాటు బుక్స్, యూనిఫాం అంటూ అదనంగా వసూలు చేస్తున్నాయన్నారు. అధికారులు దృష్టిసారించి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, నగర అధ్యక్షులు గద్దె వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శి కేతనబోయిన నాగ య్య, మహిళా విభాగం అధ్యక్షురాలు నలమాస సుగుణ, వెంకటాచారి, నాయకులు రాము యాదవ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా జిల్లా వ్యవసాయ రంగ అభివృద్ధి

వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్రానికి ఆదర్శంగా ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వ్యవసాయ, ఉద్యానవన శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ సాగు, ఎరువులు, విత్తనాల లభ్యత, రైతు భరోసా, రైతు భీమా, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం వంటి పలు అంశాలపై మండలాల వారీగా కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆధునీక సాగు పద్దతులు పాటించడం, పంటల మార్పిడి విధానం అమలు వంటి కార్యక్రమాల్లో మన జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తయారు చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాల లభ్యత పట్ల ఎటువంటి ఫిర్యాదులు రాకుండా మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాల నాణ్యత చాలా కీలకమని ఎక్కడ కల్తీ విత్తనాలు విక్రయం జరగకూడదన్నారు. తొమ్మిది రోజుల వ్యవధిలోనే తొమ్మిదివేల కోట్ల రూపాయలను ప్రభుత్వం రైతు భరోసా క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసి వ్యవసాయ రంగ ప్రాధాన్యతను తెలియజేసిందన్నారు. మండల వ్యవసాయ అధికారి తమ పరిధిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల స్టాక్ లభ్యత ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కావాలన్నారు. మనదేశం ప్రతి ఏడాది వేల కోట్ల విలువ చేసే ఆయిల్ పామ్ దిగుబడి చేసుకుంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ పంట ఎక్కువ మొత్తంలో విస్తరించాలన్నారు.



జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యం చేరుకోవాలని, ప్రతి క్లస్టర్‌కు ఒకే రకమైన లక్ష్యాలు కాకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పొలం మధ్యలో ఫిష్ పాండ్ అభివృద్ధి చేయడం వల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరించాలన్నారు. ప్రతి ఇంచు భూమి పూర్తి స్థాయిలో వాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నేచురల్ ఫార్మింగ్ జరిగే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇతర రైతుల కూడా నేచురల్ ఫార్మింగ్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. అవగాహన కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఇంచార్జి జిల్లా ఉద్యానవన అధికారి ముత్యాలు, కూసుమంచి, వైరా, ఖమ్మం అర్బన్, సత్తుపల్లి, మధిర ఏడిఏలు, మండల వ్యవసాయ శాఖాధికారులు, హార్టికల్చర్ అధికారిణి అనిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పివి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మాజీ ప్రధాని పివి నర్సింహారావు జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. శనివారం పివి నర్సింహారావు 104 వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పివి నర్సింహారావు న్యాయవాదిగా పని చేస్తూ 1957లో శాసన సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘా ల జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, ముజాహీద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్‌గౌడ్, గజ్జెల్లి వెంకన్న, జెర్రిపోతుల అంజనికుమార్, బానాల లక్ష్మ ణ్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు, రాపర్తి శరత్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిన ఇందూరి రష్మితకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 996 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన ఇందూరి రష్మిత గురించి డిస్ట్రిక్ ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ కార్యదర్శి బండి నాగేశ్వరరావు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యల దృష్టికి తీసుకెళ్లారు. నగర పాలక సంస్థ కమిషనర్ సారథ్యంలో శనివారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజలు రష్మితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి ఉపయోగపడేలా రూ. 70వేల విలువ గల హెచ్‌పి ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ చేతుల మీదుగా బహూకరించారు. తన ప్రతిభకు తగిన గుర్తింపుగా తమిళనాడు తంజావూరులోని శాస్త్ర యూనివర్సిటీలో బిటెక్ సిఎస్ఈ కోర్సులో సీటు సాధించింది. పేద కుటుంబం కారణంగా చదువును కొనసాగించడంలో తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. తండ్రి సత్యనారాయణ ముత్తగూడెం గ్రామంలో ఓ ప్రైవేటు స్కూల్‌లో చిరుద్యోగిఈ నేపథ్యంలో ఆమె కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్‌లను సంప్రదించింది. పేదరికం కారణంగా తన బంగారు భవిష్యత్తును కోల్పోకూడదనే తాత్పర్యంతో ముగ్గురు అధికారులు రష్మితకు ఆర్థికంగా, మానసికంగా భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వారు రష్మితకు విద్యే నీకు ప్రపంచానికి పరిచయం, కష్టపడి చదువుకుంటే విజయాలు నిన్ను అనుసరిస్తాయంటూ ప్రోత్సహించారు. దాతల సహకారంతో రష్మిత కళాశాల ఫీజు కట్టడానికి ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సిద్ధంగా ఉన్నట్లు కార్యదర్శి బండి నాగేశ్వరరావు తెలిపారు.

## సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వసతి గృహ విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు మరిచాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. చదువుకోవడానికి సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహాల విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, బెడ్‌షీట్స్, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టెలు ఇప్పటి వరకు అందించలేదన్నారు. వసతి గృహాల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. వెంటనే వసతి గృహా విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, నాయకులు గోపి, రాహుల్, ప్రభాస్, నవీన్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## హస్తినాపురం, ఎస్ఆర్ నగర్ కాలనీల అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హస్తినాపురం, ఎస్ఆర్ నగర్ కాలనీ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ మున్సిపల్ డిఇ ఉపేందర్‌కు ఆదేశించారు. శనివారం కాలనీలో పలు సమస్యలపై ఉదయం పర్యటించి కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను తెలుసుకుని వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రధానంగా వరద నీరు, కొత్తబజారు నుంచి వచ్చే కాలువ నీరు బయటకు వెళ్ళేందుకు ప్రధాన సమస్యగా ఎమ్మెల్యే స్వీకరించారు. అలాగే రైల్వే గేటు నుంచి అండర్ పాస్‌కు 40ఫీట్ల రోడ్డు నిర్మాణం కూడా అవసరంగా ఆయన భావించారు. కాలనీకి వచ్చేసిన ఎమ్మెల్యేను కాలనీ అధ్యక్షులు కల్లూరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి తీగల దుర్గేష్, ట్రజరర్ పసునూరి విద్యాసాగర్, రవీందర్, వాంకడోత్ రమేష్, మురళి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నజీర్, ఖలీల్, ఎడ్ల రమేష్, బోనగిరి గిరిధర్ గుప్త, మొగిలి ప్రసాద్‌రెడ్డి, మాజీ వార్డు కౌన్సిలర్ లక్ష్మి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

### సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సమస్యలన్నీ పరిష్కరించాలని, బి.అజయ్‌సారథి రెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ 18వ వార్డు సిపిఐ మహాసభ షికార్‌ఖానా గడ్డలో మంద శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాటాలడుతూ మానుకోట మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య సమస్యలు వీధిలైట్ల ఏర్పాటు, వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని, పట్టణంలో వీధిలైట్లు సరిగా వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైట్లు ఏర్పాటుచేయాలన్నారు. వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. 18వ వార్డులో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ని గెలిపించాలని విజయసారథి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, 18వ వార్డు కన్వీనర్ రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్,జలగం ప్రవీణ్, మంద శ్రీను, తరుణ్, ఉపేంద్ర, బాజాజీ. శ్రీను, అమరావతి, మాదారపు కవిత, ఎలమందల విజయ, జంగిలి కిషోర్, బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ విలీన గ్రామాలకు నిధులు కేటాయించాలి

### సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మున్సిపాలిటీ విలీన గ్రామాలకు అభివృద్ధి నిధులు కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ కోరారు. 9వ వార్డు శనిగపురం గ్రామ సిపిఐ మహాసభ శనివారం చిట్టిమల్ల రాంచంద్రు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఆధ్వర్యంలో విలీన గ్రామాలకు బడ్జెట్ కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విలీన గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజిలు ఏర్పాటుచేయించాలని కోరారు. సిపిఐ ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించిందని అన్నారు. జూలై 2న సిపిఐ మహబూబాబాద్ పట్టణ మహాసభ ను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లాకార్యదర్శి బి విజయసారథి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. అలాగే జూలై 5,6 తేదీల్లో కురవి మండల కేంద్రంలో జరిగే జిల్లా మహాసభలను కూడా వేలాదిమంది తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోత పడాల దేవయ్య, 9వార్డు కన్వీనర్ మాలోతు రవీందర్, చిట్టిమల్ల రామచంద్రు, అబ్దుల్, గంట వెంకన్న, వేల్పుల వీరన్న, గంగాధరి సైదులు, చిట్టిమల్ల సారయ్య, కందుకూరి వేణు, అశోక్, మురళి, కల్లూరి బ్రహ్మచారి, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** బాలలను సంరక్షించుటకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ అడిషనల్ డీసీపీ సూచించారు. జులై 1వ తారీఖు నుండి నెల రోజుల పాటు నిర్వహించబడే ఆపరేషన్ ముస్కాన్11వ విడత కార్యక్రమంపై అదనపు డీసీపీ ఆధ్వర్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. హ్యూమన్ ట్రాఫిక్ విభాగం తో పాటు వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల వివిధ ప్రభుత్వ శాఖలు అనగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ,చైల్డ్ లైన్1098 విద్యాశాఖ, కార్మిక శాఖ చెందిన అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి ఎన్ రవి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ & ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను, భిక్షాటన చేయుచున్న పిల్లలను, నిరాదరణ కలిగిన పిల్లలకు మరి ముఖ్యంగా బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమం వలన బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరము 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని జులై 1 నుంచి 31 వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తు బాలల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా పోలీస్ టీం లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందు హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని రా అనిల్ చందర్, ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చాణక్య, వినోద్, రజిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబెర్స్ వరంగల్ ,జనగాం నుండి సుజాత, శ్రీలత, బాలల సంరక్షణ అధికారులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్లు, అధికారులు ,ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు.మండల కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలోశనివారం ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యేవిశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజ్ హజరయ్యారు. ఈ సందర్భంగా హసన్ పర్తి,హనుమకొండ మండల పరిది లోని 81మందికల్యాణ లక్ష్మి , షాది ముభారక్,లబ్ధిదారులకు 81లక్షల 9వేల 396 రూపాయల విలువలగల చెక్కులను అలాగే 25 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లబ్ధి దారులకు 7లక్షల 20వేల220 రూపాయలవిలువగల చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ రావు, పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి , ఉదయ్ కుమార్ రెడ్డి ,మెరుగు.రాజేష్ గౌడ్ చల్ల.గోపాల్ రెడ్డి ,మార్కెట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ, మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీర సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ,పొన్నాల రఘు, అయ్యలరామ్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు మాట్ల విష్ణు, మదన్ గౌడ్, వీసంసురేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో వేగం పెంచాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం ఐడిఒసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో చిన్న కాళేశ్వరం పనులు ప్రగతిపై ఇరిగేషన్, ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మెగా కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలని తెలిపారు. ఆధునీకరణలో ఉన్న చెరువుల, కాలువల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంపు హౌస్ పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూ సేకరణ సమస్యలు ఉన్న గ్రామాల్లో లో గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థులతో తీర్మానం చేయించాలని, భూసేకరణ పూర్తి అయిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం నుండి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులలో పురోగతిని పరిశీలించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈ సూర్య ప్రకాష్, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ప్రారంభించాలని, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు ముందస్తు ప్రణాళిక సిబ్బంద చేసుకోవాలని, ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను రికార్డుల్లో పొందుపర్చాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద కురవి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, విద్యాబోధన, వైద్య ఆరోగ్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. మహబూబాబాద్ మండలం సంద్రాల గూడెం, కురవి మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ హైస్కూల్, పిహెచ్‌సి అను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా జిలాలో అన్ని విద్యాసంస్థల్లో అధికాంగా అడ్మిషన్లు కల్పించామని, వసతి గృహాల్లలో చదువుతున్న విద్యార్థులకు మెనూ పాటించాలని, విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ కూడా మెయింటెన్ చేస్తూ వసతిగృహబూల్లో క్రమం తప్పకుండా శానిటేషన్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ రఘుపతిరెడ్డి, కురవి తహసీల్దారు బి.విజయ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించి పంటలు దిగుబడి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల రైతులకు నిర్వహించిన విత్తనాల పంపిణి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న చిరు సంచులు విత్తనాలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రైతులకు అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ లావుడియ మంజుల భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి రామారావు, ఏడీఏ పరుశరాములు, మండలాల వ్యవసాయాధికారులు శరత్‌చంద్ర, విజయ్‌రెడ్డి, దివ్య, బ్లాక్ కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మల్లారెడ్డి, వెంకటేష్, మహేష్, దీపక్, రైతులు, పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం

### అదనపు తరగతు గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండలంలోని కాస్తుర్బా గాంధీ బాలికా విధ్యాలయంలో 230లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను, ప్రయోగశాలలను ప్రారంభోత్సవం కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హజరై ప్రారంభిచారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు పాఠశాల స్పెషల్ అధికారి స్వప్న విధ్యార్థులతో ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాల అవరణంలో ఎమ్మెల్యే, కలెక్టర్ మొక్కలు నాటి విధ్యార్థులకు స్కూల్ యూనిఫాం,పుస్తకాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తునట్లు తెలిపారు. ప్రతి విధ్యార్థి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డకా ఉపాధ్యయ నియామకాలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 54 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు భర్తీ చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు పదోన్నతులు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.విధ్యార్థులు లక్ష్యాలను ఎంచుకోని పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విధ్యార్థులకు సూచించారు.స్పెషల్ అధికారి స్వప్న పాఠశాలకు చేతిపంపు,పాఠశాల ప్రహరి గోడ,డయాస్ నిర్మాణం అడిగిన మేరకు కలెక్టర్ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల ఉపాధ్యయులతో సమావేశం ఏర్పటు చేసి గురుకుల పాఠశాలలకు కావలిసిన అన్ని వసతులను కల్పిస్తామని కలెక్టర్ రహుల్ శర్మ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే,కలెక్టర్ విధ్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిసిడిఓ శైలజ, తహసిల్దార్ విజయలక్ష్మి , ఎంపిడివో అనిత, మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి,లింగంపెల్లి కిరణ్ రావు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## విజయశాంతిని కలిసిన రాజనాల శ్రీహరి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి శ్రీరామ రక్ష రాములమ్మ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజనాల శ్రీహరి అన్నారు. ఎమ్మెల్సీ ఫైర్ బ్రాండ్ విజయశాంతిని హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో తన నివాసంలో బొకేతో సత్కరించిన శ్రీహరి రాబోయే మంత్రి విస్తరణలో మంత్రి పదవి తప్పకుండా ఇవ్వాలని అన్నారు. సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్ కు రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు. మంత్రి పదవిలో విజయశాంతిని చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అన్నారు.

## పివి తెచ్చిన సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం



**ప్రజాపక్షం/హనుమకొండ :** పివి తెచ్చిన సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేసాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తొలి తెలుగు ప్రధానిగా పని చేసి నాదు ఎంపీ గా పోటీ చేసిన పీవీ నరసింహా రావు హయాంలో పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహ రావు 104వ జయంతి వేడుకలు హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం హనుమకొండ బస్ స్టాండ్ ఆవరణలో ఉన్న ఉన్న పీవీ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఇవి భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ వేదికలో నిలిచేలా గ్లోబల్, ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారని, మన ప్రాంత బిడ్డ అయినా పీవీ నాడు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న క్రమంలో వారి నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, లక్ష్మి రెడ్డి, రాజు, అంకుష్, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా విద్యాబోధన



**ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండ హంటర్ రోడ్ లోని ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట తరగతి గదుల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా పరిశీలించారు. పాఠశాలలోని సదుపాయాలు, చెత్త, మరుగుదొడ్ల, నిర్వహణ, సిజనల్ జ్వరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాలయంలో కొత్తగా చేరిన విద్యార్థులు, హాజరు శాతం, పదోతరగతి ఫలితాల వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. క్లాసు రూంలోకి వెళ్లి విద్యార్థులకు పాఠం చెప్పడమే కాకుండా వారిని పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చూసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చలించిపోయారు. వెంటనే అక్కడి నుంచి గురుకుల సెక్రటరీతో ఫోన్లో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చుంటున్నారని, హాట్ వాటర్ సౌకర్యం కల్పించాలని జులై నెల పూర్తి కల్లా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని గురుకుల సెక్రెటరీని ఎమ్మెల్యే కోరారు. హనుమకొండలోని హంటర్ రోడ్ లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను త్వరలోనే అన్ని సౌకర్యాలు ఉన్న కొత్త భవనానికి తరలించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివేలా ప్రోత్సహించాలన్నారు

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ పది ఫలితాల్లో 550 మార్కులకు పైగా సాదించడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణులు కావాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ విద్యార్థులకు సూచించారు. శనివారం లింగాలఘనపురం కేజీబీవీని, మోడల్ స్కూల్‌న అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించడంతో పాటు కేజీబీవీలో విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. కొత్త మెనుపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కేజీబీవీలలో విద్య బాగుందనే తాము ఇక్కడ చేరడం జరిగిందని విద్యార్థినీలు తెలిపారు. భోజన మెను బాగుతున్నారు. విద్యార్థులు తృప్తిగా భోజనం చేయాలని, ప్రతి రోజు కూరగాయలు మారుస్తూ విద్యార్థుల ఇష్ట ప్రకారమే కూరగాలు తేవాలని సూచించారు. సోరట్ రూమ్‌ను తనిఖీ చేసి కోడిగుడ్ల బరువును పరిశీలించారు. పల్లీల నాణ్యత, అయిల్ ఫ్యాకెట్స్, అవి తయారు చేసిన తేదీ, వస్తువలు దిగుమతి తేదీలను పరిశీలించారు. ఫైర్ యంత్రాలపై ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుంటు విద్య ఉపాధి మార్గంగా ఉండేలా ఎంపి చేసుకొనెలా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులు అవ్వాలన్నారు. విద్యార్థులకు విస్తున్న సైన్స్ బోధన పరిశీలిస్తూ అనుమానాలు నివృత్తి పరచ్చాలన్నారు. మోడల్ స్కూల్ ఆవరణ ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట తహాశీల్దార్ రవీందర్, డిఈఓ భోజన్న కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇన్న పూర్ణ, మోడల్ స్కూల్ ఇన్చార్జీ సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బడిబాట ప్రారంభం**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అందుతున్న బోధన తీరు, వారి సామర్థ్యాలు అలాగే వారికి అందుతున్నర పౌష్టికాహార నాణ్యతను పరిశీలించాలన్నారు. ఈ ఏడాది జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉండేలా ప్రతి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

## గాజర్ల రవి సంస్మరణ సభకు హాజరైన ఎమ్మేల్యేలు



**ప్రజాపక్షం/టేకుమట్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అడవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లో మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మవోయిస్టు కేంద్ర కమీటి సభ్యుడు,ఏవోబి స్పెషల్ జోనల్ కమీటి కార్యదర్శి ,2004 శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే గాజర్ల రవి సంస్మరణ సభ శనివారం మండలంలోని వెలిశాలలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మ్మేల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మేల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి,ఉధ్యమాకారులు, ప్రజప్రతినిధులు, మాజీ మవోయిస్టు కుటుంబ సభ్యులు పాల్గోని గాజర్ల కుటుంబ సభ్యులను పరమార్శించి రవి చిత్ర పటానికి పూలమాల వేశారు. కుటుంబ సభ్యులను దైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐతే ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, కత్తి సంపత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గోనారు.

## హాస్టల్ సందర్శించిన ఎఐఎస్ఎఫ్ నాయకులు

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలోని బాయ్స్ హాస్టల్ ను ఏఐఎస్ఎఫ్ ఆ గ్రామ సమితి ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బన్నీ ,హర్షద్ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, హాస్టల్ బిల్డింగ్లో పెచ్చులూడి పడుతున్నాయని అదేవిధంగా వర్షాకాలంలో ఎక్కువ వర్షపాతానికి హాస్టల్ భవనం నాని కూల్పోయే అవకాశాలు కూడా ఉన్నాయని, దీన్ని వెంటనే మరమతులు చేయాలని, కిటికీలకు జాలీలు లేకపోవడం వల్ల నేరుగా దోమలు లోనికి వచ్చి విద్యార్థులను కుడుతున్నాయని దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వెంటనే కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని హాస్టల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మామునూరు శ్రీకాంత్, చెరుకు పవన్, రావుల సిద్దు, కంచర్ల పున్నం, గండికోట సురేష్, సాత్విక్, వరుణ్, సంజయ్, వల్లపు సిద్దు, చీరల విగ్నేష్, అఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# లీల

## ప్రేక్షకులకు రుణపడి ఉంటా..

మోహన్ బాబు



కన్నప్ప సినిమాను ఇంతపెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు, నా అభిమానులకు రుణపడి ఉంటానని డాక్టర్ మోహన్ బాబు అన్నారు. ఇటీవల విడుదలైన కన్నప్ప సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ భగవంతుణ్ణి లీలావళి ఇదంతా జరిగిందని అన్నారు. ఇదంతా యాత్రే విష్ణుగా తనను అభిమానిస్తున్న ఫ్యాన్స్ కు ధన్యవాదాలు అని చెప్పారు. హీరోగా, విలన్ గా ఇలా అన్ని పాత్రల్లో నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు అని తెలిపారు. ఇదంతా నా పూర్వ జన్మ సుకృతం అని మోహన్ బాబు వ్యాఖ్యానించారు. ఈ సినిమాలో నటించిన, ఈ సినిమా పూర్తి కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని మోహన్ బాబు అన్నారు. హీరో విష్ణు మాట్లాడుతూ ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్ళకు ధన్యవాదాలు అని చెప్పారు. ఇదంతా శివలీలగా భావిస్తున్నాను అని అన్నారు. కన్నప్పకు ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు అని విష్ణు చెప్పారు. ఈ సక్సెస్ మీట్‌లో దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్, శివ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



## 3బిహెచ్‌కె ట్రైలర్ ఆవిష్కరణ

హీరో సిద్ధార్థ్ కెరీర్‌లో 40వ చిత్రం '3బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తుండగా, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది.ఇల్లు సొంతం చేసుకోవాలనే జీవితాశం కల కలిగిన మధ్యతరగతి కుటుంబ భావోద్వేగ ప్రయాణంలో ఈ ట్రైలర్ మనసుని హత్తుకుంది. జీవితంలో వైఫల్యాలు, నిరాశలను ఎదుర్కొన్న తండ్రి, కుటుంబం ఆకాంక్షలను నెరవేర్చడానికి తన కొడుకుపై తన ఆశలు పెట్టుకుంటున్నాడు. అయితే, చదువు పరంగా కష్టపడతాడు, అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ 34 సంవత్సరాల వయస్సులో కూడా ఉద్యోగం లేకుండా ఉన్న కొడుకు భావోద్వేగ ప్రయాణం చాలా ఎమోషనల్‌గా వుంది. ఆ కుటుంబం కల చివరకు సాకారం అవుతుందా లేదా అనేది ఈ సినిమా కథ. ఇల్లు కొనడం అనేది మధ్యతరగతి కుటుంబాల కల. ఈ కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. దర్శకుడు శ్రీ గణేష్ భావోద్వేగపూరంగా హృదయాన్ని తాకే కథనంతో రూపొందించారని హీరో సిద్ధార్థ్ అన్నారు. సినిమాటోగ్రాఫర్లు దినేష్ కృష్ణన్ బి, జితిన్ స్టానిస్లాస్ విజువల్స్ మధ్యతరగతి జీవితాన్ని అందంగా చూపించాయి. ప్రతి ఫ్రేమ్ నేచురల్ గా వుంది అని ఆయన అన్నారు. అమృత్ రామ్‌నాథ్ నేపథ్య సంగీతం ఎమోషన్ మరింత పెంచుతుంది. గణేష్ శివ రాసిన స్క్రీన్ ప్లే, రాకేందు మౌళి సంభాషణలు అద్భుతంగా వున్నాయి. వినోద్ రాజ్ కుమార్ ఎన్ ఆర్ట్ డైరెక్టర్. ఆర్. సిబి మారప్పన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి జూలై 4న విడుదల చేయనున్నారు.



## ఎనిమిది భాషల్లో నాని సినిమా

దసరా సినిమాతో సూపర్ డూపర్ హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదేలా దర్శకత్వంలో నాని రెండో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాను ఏకంగా ఎనిమిది భాషల్లో తెరకెక్కిస్తున్నారు. జూన్ 21 నుంచి ఈ సినిమాప్రారంభించారు. అయితే శనివారం నుంచి ఈ సినిమా షూటింగ్‌లో నాని పాల్గొంటున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ఎస్ ఎల్ వి సి బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

## 'జూనియర్' టీజర్ రిలీజ్

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నారు. , రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ 'జూనియర్' అనే సినిమాతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు. కిరీటి ఒక కాలేజీ కుర్రాడిగా నటిస్తున్నాడు. ఎదుటి వారిని ఆకర్షించే వ్యక్తిత్వం వున్న తను హీరోయిన్ శ్రీలీలాను ఇష్టపతాడు, మొదట గొడవతో మొదలైన జర్నీ మెల్లాగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. టీజర్‌లో కిరీటి చెప్పిన డైలాగులు అదిరిపోయాయి. అందరినీ అలరించేలా వున్నాయి. హీరోయిన్‌గా శ్రీలీల కూల్‌గా కనిపించింది. టీజర్ చివరిలో బాస్ పాత్రతో జెనీలియా డిసౌజా కనిపించడం మరింత ఆసక్తికరంగా వుంది. వైవా హర్ష పాత్ర కామెడీగా సాగుతుంది. కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించిన ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి రవీందర్ ప్రొడక్షన్ డిజైన్, పీటర్ హెయిన్ హైఆక్టేన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాసిన డైలాగ్స్ రాశారు. జూనియర్ సినిమాను తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళ భాషలలో జూలై 18న విడుదల చేయనున్నారు.



## నేడు 'సింధూర సంజీవని' రక్తదాన శిబిరం




జెట్టి సినిమాతో హీరోగా సుపరిచితులైన కృష్ణ మానినేని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానిగా విజయవాడ వరదల సమయంలో హీరో కృష్ణ చేసిన సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకున్నాయి. అటువంటి కృష్ణ జూన్ 14 ఇంటర్నేషనల్ బ్లెడ్ డొనేషన్ డేను పురస్కరించుకొని 'సింధూర సంజీవని' పేరిట ప్రతి ఏటా జూన్‌లో తన ఫ్రెండ్స్ తో బ్లెడ్ డొనేషన్ చేయడానికి సంకల్పించారు. ఆ క్రమంలో భాగంగా ఆదివారం చిరంజీవి బ్లెడ్ బ్యాంకులో మెగా బ్లెడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించనున్నారు. తనతోపాటు మరో పదిమంది యువత బ్లెడ్ డొనేషన్ క్యాంప్‌లో పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## 'మిరపకాయ్' ట్రైలర్ విడుదల

మాస్ మహారాజ రవితేజ మళ్లీ తన అభిమానులకు ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అయ్యాడు. రవితేజ హీరోగా ఎల్లో ఫ్లవర్స్ బ్యానర్ పై నిర్మాత రమేష్ పుప్పాల నిర్మించిన చిత్రం 'మిరపకాయ్'. 2011 సంక్రాంతికి విడుదలై మ్యూజికల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ మూవీ గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించారు. ఈ రిలీజ్ చేస్తున్న సందర్భంగా ట్రైలర్ ను విడుదల చేశారు ఈ సినిమాను రీరిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. జులై 11న 'మిరపకాయ్' చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నారు. హనుమాన్ మీడియా ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు, ఈ సినిమాలో అందాల భామ రిచా గంగోపాధ్యాయ్, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించారు.థమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు.

## ఐకానిక్ సినిమాటోగ్రాఫర్ 'అవార్డు' అందుకున్న కిషోర్ బొయిదాపు



ప్రముఖ హీరోయిన్ హన్సిక మోత్వాని నటించిన '105 మినిట్స్' చిత్రానికిగాను సినిమాటోగ్రఫీ విభాగంలో 'ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్ కెమెరామెన్ కిషోర్ బొయిదాపం ఆదుకున్నారు. సింగిల్ క్యారక్టర్‌తో.. సింగిల్ షాట్‌లో తెరకెక్కించడం '105 మినిట్స్' సినిమా ప్రత్యేకత. హైద్రాబాద్ లో లీమెరిడియన్ హోటల్‌లో జరిగిన వేడుకలో కిషోర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. రవిప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్ గా తన కెరీర్ ప్రారంభించిన కిషోర్... అనతికాలంలోనే అంచెలంచెలుగా కెమెరామెన్ స్థాయిని సాధించారు. 'స్లమ్ డాగ్ మిలియనీర్, మిషన్ ఇంపాజిబుల్4, లెటర్స్, సూటబుల్ బాయ్స్' వంటి హాలీవుడ్ ప్రోజెక్టులకు సెకెండ్ యూనిట్ కెమెరామెన్‌గా తన ప్రతిభ కనబరిచిన కిశోర్ ప్రఖ్యాత సినిమాటోగ్రఫర్ అనిల్ మెహతా ప్రియ శిష్యుడిగా... 'సీక్రెట్ సూపర్ స్టార్, ఏ దిల్ హై ముష్కిల్, బియాండ్ ది క్లౌడ్స్, హిందీ జెర్సీ' వంటి పలు చిత్రాలకు పనిచేశారు.

'బోయ్ మీట్స్ గర్ల్'తో కెమెరామెన్‌గా మారిన కిషోర్ సునీల్ నటిస్తున్న 'ఆన్ ది వే', ఆది సాయికుమార్ 'రుధిరాక్ష', బిగ్ బాస్ ఫేమ్ షణ్ముఖ, శివాజీ, భూమిక నటిస్తున్న ఇంకా పేరు పెట్టని చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

ముంబై నుంచి హైదరాబాద్ కు షిఫ్ట్ అయిపోయిన కిషోర్ తన ఫోకస్ ఇంకా తెలుగు సినిమాలపై మాత్రమేనని తెలిపారు.

## శ్రీలీలకు యంగ్ ఇండియన్ అవార్డు




తెలుగు సినిమాలో అతి తక్కువ సమయంలో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ నెంబర్ వన్ స్థానానికి ఎదిగిన శ్రీలీల మోస్ట్ ఇన్ ఫ్లూయేన్షల్ యంగ్ ఇండియన్ 2025 అవార్డు ను హీరోయిన్ శ్రీలీల అందుకున్నారు ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వైద్య విద్యను అభ్యసించిన శ్రీలీల డ్యాన్సింగ్‌లో యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈమె టాలెంట్ ను గుర్తించిన జీ క్యూ మోస్ట్ ఇన్ ఫ్లూయేన్షల్ యంగ్ ఇండియన్ అవార్డు ను శ్రీలీలకు అందించారు.

## 'పవర్' షూటింగ్ షురూ



టాలీవుడ్ స్క్రీన్ పైకి యంగ్ అండ్ డైనమిక్ హీరో రాబోతున్నాడు. సాయికృష్ణ హీరోగా, దర్శకుడు వెంకటరమణ పసుపులేటి రూపొందిస్తున్న సినిమా 'పవర్'. 'నాది పొగరు కాదురా... నా జాతికి ఈ దేవుడు ఇచ్చిన పవర్...' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో సాయి కృష్ణ హీరోగా సినీ ఎంట్రీ ఇచ్చారు. మంగళగిరి పరిధిలోని ఆత్మకూరులో వంగవీటి రంగా విగ్రహం వద్ద ముహూర్తం షాట్‌తో చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, సుజన, భాగ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రియతో పాటు సీనియర్ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ఈ చిత్రం టాలీవుడ్‌లో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని చిత్ర దర్శకుడు వెంకటరమణ పసుపులేటి అన్నారు.

## ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ ఫోన్‌లో కీలక ఆడియో

### ఎమ్మెల్సీ కవిత పిఎకు 'సిట్' నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత వ్యక్తిగత సహాయకుడు (పిఎ)కి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా నోటీసులు జారీ చేసింది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ( ఎస్ఐబి) మాజీ డిఎస్పి ప్రణీత్ రావు ఫోన్‌లో కవిత పిఎకు సంబంధించిన కొన్ని ఆడియో రికార్డింగులను అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ ఆయనను విచారణకు పిలిచింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు, ఇప్పటివరకు మొత్తం 618 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు తేల్చారు. వీరిలో ఇప్పటికే 228 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేశారు. పలువురు విఐపిల నుంచి కూడా కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ప్రణీత్ రావును విచారించినప్పుడు లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు పరిధిని మరింత విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవిత పీఏతో పాటు మరికొందరు బిఆర్ఎస్ నేతలకు సైతం సిట్ అధికారులు నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ పరిణామంతో బిఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిట్ విచారణలో ఇంకా ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## ప్లాంట్ల ఏర్పాట్ల సన్నాహాలను 'సింగరేణి' వేగవంతం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్:** సింగరేణి సంస్థ చేపట్టనున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాట్ల సన్నాహాలను మరింత వేగవంతం చేయాలని, కాల పరిమితిని విధించుకొని సత్వరమే ప్రాజెక్టులను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజాభవన్‌లో శనివారం సింగరేణి కాలరీస్ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టనున్న సోలార్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, ఇతర పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ లోయర్ మానేరు డ్యామ్ రిజర్వాయర్‌పై నిర్మించనున్న 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్‌పై నిర్మించతలపెట్టిన 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు ఇరిగేషన్ శాఖ ద్వారా రావాల్సిన అనుమతులకు లేఖలు రాయాలని ఆదేశాలు ఇచ్చారు. అనుమతుల కోసం నిత్యం సంబంధిత విభాగాలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో ఏర్పాటు చేయ తలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డిపిఆర్‌లను వచ్చే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. రామగుండం1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్ట్ నీటి సంపు ఆధారంగా నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసే 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటుపైనా కూలంకశంగా చర్చించారు. రాజస్థాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ అంశాన్ని వీలైనంత త్వరగా మంత్రివర్గంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, తెలంగాణ రెడ్‌కో వైస్ చైర్ పర్సన్, ఎండి ఆనీలా, సింగరేణి ఈడి(కోల్ మూమెంట్) ఎస్ డిఎం సుభాని, ఈడి (ఎస్‌టిపిపి) చిరంజీవులు, జిఎంలు జానకీరామ్, శ్రీనివాసులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### హరీష్‌రావుకు ధైర్యముంటే ఉద్యోగాల భర్తీపై

## బహిరంగ చర్చకు రావాలి

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరు వెంకట్ సవాల్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** మాజీ మంత్రి హరీష్‌రావుకు ధైర్యముంటే ఉద్యోగాల భర్తీ విషయంలో బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి డాక్టర్ బల్మూరు వెంకట్ సవాల్ చేశారు. కెసిఆర్, అప్పటి మంత్రులు చెబుతున్నట్లు బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే ఆ వివరాలు ఎందుకు మీడియాకు వెల్లడించడంలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలపై తాము చర్చకు సిద్ధమన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలని చెప్పిన బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో కనీసం 2లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. జాబ్స్ నోటిఫికేషన్స్ వేసి... పరీక్షలు పెట్టలేక భర్తీ చేయకుండా వదిలేసిన చరిత్ర బిఆర్ఎస్ పాలకులదన్నారు. గత 18 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం 58,868 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి వారికి నియామక పత్రాలు అందజేశామన్నారు. నోటిఫికేషన్స్ వారీగా నియామల విషయంలో అనుమానాలు ఉంటే ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు. ఏ ఉద్యోగ నియామకాల కోసమైతే నిరుద్యోగులు పోరాటం చేశారో వారినే మోసం చేసిన నీచమైన చరిత్ర మాజీ సిఎం కెసిఆర్‌దని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అనంతరం గెలిచిన తర్వాత అసెంబ్లీలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ నేతలు నిరుద్యోగుల పక్షాన ప్రశ్నిస్తే కెసిఆర్ ఎగతాళి చేసిన మాట నిరుద్యోగులు మరచిపోలేదన్నారు. మోసపోయామని తెలిసి స్వయంగా బిఆర్ఎస్ పార్టీ నేతల పేర్లు రాసి నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటే అప్పటి సిఎం కెసిఆర్ కనీసం స్పందించలేదన్నారు.

## దిగుమతులపై ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాయి. భూతలం నుండి, సముద్రతలం నుండి బంగ్లాదేశ్ నుండి జరుగుతున్న దిగుమతులకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. ఐతే మహారాష్ట్రలోని ఓడరేవు ఎన్‌హవా షెవాకు మాత్రం దీన్నుండి మినహాయింపు ఉంది. శుక్రవారం ప్రభుత్వం ఈ చర్యలు ప్రకటించింది. ప్రధానమంత్రి షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత నుండీ బంగ్లాదేశ్‌‌-భారత్ మధ్య సంబంధాలు బాగా క్షీణించాయి. గడ ఏడాది ఆగస్టులో ప్రభుత్వ పతనం తర్వాత షేక్ హసీనా భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అప్పటినుండీ భారతదేశంపై బంగ్లాదేశ్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. ఐతే బంగ్లాదేశ్‌లో సరఫరాదారులు అనుసరిస్తున్న అన్యాయపూరితమైన పద్ధతులవల్ల భారతదేశంలో రైతుల జీవన పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ హాని కలగడాన్ని ఒప్పుకోబోమని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు. ఎంతో సద్భావంతో భారతదేశ మార్కెట్‌ను బంగ్లాదేశ్ ప్రజలకు అందుబాటులోకి తెస్తే భారత ఆర్థిక ప్రయోజనాలకు ద్రోహం చేసేవిధంగా ఈ వ్యాపారాన్ని నష్టపరచి కించపరచే ఆచరణ చర్యలకు పాల్పడితే అందుకు దేశం సిద్ధంగా లేదని మరో అధికారి చెప్పారు. ఓడరేవుల ద్వారా భూమార్గంలో వచ్చే రెడీమేడ్ గార్మెంట్స్, ఇతర వినియోగ వస్తువులపై ఆంక్షలు విధించిన కొన్ని వారాల తర్వాత కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్ జనపనార, సంబంధిత ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది. సఫ్తా (దక్షిణాసియా స్వేచ్ఛావాణిజ్య ప్రాంతం) నిబంధనల కింద బంగ్లాదేశ్ నుండి ఎలాంటి సుంకాలు చెల్లించకుండానే భారత్‌కు బంగ్లాదేశ్ జనపనార వస్తోంది. దీనివల్ల ఆ దేశం ఎంతో లాభపడుతోంది. సబ్సిడీపై జనపనార ఉత్పత్తులు వస్తూ ఉండటంతో దేశంలో రైతులకు నష్టం కలుగుతోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్తున్న రాయతీల ఆధారంగా అదేపనిగా భారత్‌కు ఆ దేశం నుండి జనపనార వస్తోంది. వాళ్ళ రైతులు బాగు పడుతున్నారు.

దీంతో డిజిఎడి (యాంటీ డంపింగ్, అనుబంధ సుంకాల డైరెక్టరేట్ జనరల్ సవివరంగా దర్యాప్తు చేశారు. కానీ ఎడిడి (యాంటీ డంపింగ్ డ్యూటీ)ని మాత్రం దిగుమతులపై విధించడం వీలు కాలేదు. ఎగుమతులకు సంబంధించి బంగ్లాదేశ్‌లో అనేక అక్రమాలు జరుగుతూ ఉండటం సాధారణంగా మారిపోయిందని అధికారులు చెబుతున్నారు. అందువల్ల దేశీయ జనపనార పరిశ్రమలను రక్షించుకోవడానికి అన్యాయపూరితమైన విధానాలను అడ్డుకుని ఈ రంగంలో భారత్‌ను ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద స్వయంసమృద్ధి సాధించవలసి ఉందని అధికారులు పేర్కొన్నారు.

## పునాదులు వేసిన పివి

(మొదటి పేజీ తరువాయి)

అని కొనియాడారు. రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన తీసుకువచ్చిన అనేక సంస్కరణలు సమాజానికి గొప్ప మేలు చేశాయని తెలిపారు. పివి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి దేశం ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో ఉందని, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆయన ఈ దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను గాడిలో పెట్టిన మహానీయుడన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర మాట్లాడుతూ భారత ప్రధానిగా చిన్న భిన్నమైన ఆర్థిక వ్యవస్థను ఎన్నో ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన మహోన్నతమైన వ్యక్తి మన తెలంగాణ ముద్దుబిడ్డ పివి నరసింహారావు అని కొనియాడారు. ఆర్థిక మేధావి, గల్లి నుంచి ఢిల్లీ పీఠానికి ఎదిగిన రాజకీయ ఎవరెస్టు శిఖరం తెలంగాణ ముద్దు బిడ్డ పివి నరసింహారావు అని మంత్రి కొండా సురేఖ అన్నారు.మాజీ ప్రధాని పివి నరసింహరావు తీసుకున్న నిర్ణయాలు ఎప్పటికీస్ఫూర్తిదాయకం ఆమె పేర్కొన్నారు.బహుముఖ ప్రజ్ఞాశాలి, దేశ రాజకీయాలలో విలక్షణ ముద్ర వేసిన అపర మేధావి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మంత్రి వివేక్ కొనియాడారు. భారతజాతి గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాని పివి నరసింహారావు అని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు.

## కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సాగిస్తుంటారు రైల్వే స్టేషన్‌లో త్రాగునీరు లేక పోగా మల మూత్ర విసర్జనల కోసం ప్రయాణికుల ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్న అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. పెద్దపల్లి రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో రైల్వే అధికారుల నిఘ కొరవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులను చేస్తున్నారని నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన పనులను తూతూ మంత్రంగా పైపై మెరుగులు మెరిపిస్తూ పలు అభివృద్ధి పనులలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రీ మోడలింగ్ పేరుతో రైల్వే స్టేషన్ నూతన బిల్డింగ్ పనులు ప్రారంభించి దాదాపు సంవత్సర కాలం దాటిందని, గుంతలే దర్శనమిస్తున్నాయని ఎక్సలేటర్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, రైల్వే గుడ్ షెడ్ ఆవరణలో నిర్మిస్తున్న షెడ్డు పనులు సైతం నత్తనడకన కొనసాగుతున్నాయని అధికారుల అండదండలతోనే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూల్చడానికే సంవత్సరకాలం కట్టడానికి ఎన్ని సంవత్సరాలో.... అమృత్ భారత్ అభివృద్ధి పనులలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ పాత భవనాన్ని కూల్చడానికే సంవత్సర కాలం దాటిందని, మరి నూతన భవనాన్ని నిర్మించడానికి ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో అధికారులకు కాంట్రాక్టర్లకే తెలియాలని ప్రయాణికులు రైల్వే అధికారులపై మండిపడుతున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనులలో అన్ని రైల్వే స్టేషన్లలో పనులు పురోగతిలో ఉండగా పెద్దపల్లిలో మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదని ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు,రైల్వే శాఖ ఉన్నత అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అమృత్ భారత్లో ఎంపికైన. మంచిర్యాల, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చక చక పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధం కాగా మరి పెద్దపల్లి రైల్వే స్టేషన్ పనులు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.కనీస సౌకర్యాలు కరువు నిఘా నేత్రాలు లేవుపెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన త్రాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు కనుమరుగయ్యాయి. ముల్లె ముటా, పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రత లేకుండా పోయింది.ప్రయాణికుల భద్రత నిమిత్తం పెద్దపల్లి రైల్వే జంక్షన్ అయినప్పటికీ కనీసం ఒక్క ఆర్పిఎఫ్, జిఆర్‌పి పోలీస్ కూడా విధులకు కేటాయించకపోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ఇప్పటికే పలు దొంగతనాలు అఘాయిత్యాలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న కనీసం స్టేషన్ ఆవరణలో నిఘా నేత్రాలు లేకపోవడం. దురదృష్టకరమని ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు. రైల్వే బుకింగ్ కౌంటర్ లో పదే పదే 'కృపయా జాందే మీరు నిఘా నేత్రాల నీడలో ఉన్నారు ప్రతి క్షణం ప్రయాణికుల కదలికలు గమనిస్తున్నాము' అంటూ అనౌన్స్మెంట్ రికార్డింగ్ తప్ప స్టేషన్ పరిసరాలలో ఎక్కడ నిఘా నేత్రాల జాడలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారుల హడావిడే తప్ప అభివృద్ధి పనులలో పురోగతి శూన్యంఅమృత్ భారత్ పథకంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అయినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా వస్తూ పోతున్నారే తప్ప అభివృద్ధి పనుల్లో మాత్రం పురోగతి లేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం, డిఆర్ఎమ్, ఏడిఆర్ఎం,రైల్వే శాఖ ఉన్నత అధికారులు పలుమార్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన పనులు ముందుకు సాగడం లేదని పెద్దపల్లి పార్లమెంటరీ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ సైతం మొన్నటికి మొన్న రైల్వే స్టేషన్ సందర్శించి అభివృద్ధి సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన తూతూ మంత్రంగా పనులను ప్రారంభించి మళ్లీ పూర్తిగా పనులను నిలిపివేశారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గతవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ సందర్శనలో భాగంగా పలు సంఘాల నాయకులు, స్థానికులు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల జాప్యంపై పలు వినతులు చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎంపీ, ప్రజా ప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకొని అమృత్ భారత్ అభివృద్ధి పనులను త్వరగాతిన పూర్తి చేసేలా చూడలని కోరుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com